సోమవారం - గత వారం రోజులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital


ఉభయసభల్లో విపక్షాల ఆందోళనలు

గాజాలో యుద్ధం ఆగాలని 25 దేశాల సంయుక్త ప్రకటన

5


Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 172 పేజీలు: 8+16 వెల: 6.50


## బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!



### రాజ్యసభ ప్రస్తుత డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కే దక్కే అవకాశం

### కొందరు బిజెపి ఎంపీలు కూడా బరిలోకి..

### ధన్‌ఖడ్ రాజీనామాతో వేడెక్కిన ఢిల్లీ రాజకీయం

**న్యూఢిల్లీ, జూలై 22:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీ చేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. బిజెపితోపాటు ఎన్డీయే పక్షాలకు చెందిన నేతకూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈ నేపథ్యంలో జనతాదళ్ (యునైటెడ్) ఎంపి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాల్లో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పిజి చేసిన ఆయన జర్నలిస్టుగా డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలాయేళ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్‌ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన..ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జెడి(యు) నుంచి తొలిసారి ఎంపిగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా

>>2

# బిసి రిజర్వేషన్లపై ఢిల్లీకి

### అన్ని పార్టీల మద్దతుకు ప్రయత్నిస్తున్నాం

### న్యాయ సమస్యను ఎదుర్కొనడానికైనా సిద్ధం

### కులగణనలో దేశానికి రోల్ మోడల్ తెలంగాణ

### ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం కోసం చూస్తున్నాం

### మీడియాతో డి. సిఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై22:** బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కోవడానికి సిద్దంగా ఉన్నామని తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కులగనన సర్వే అవసరం లేదన్న మోడీ నీ జన గణనతోపాటు కులగణన కూడాచేస్తామని నిర్ణయం తీసుకునేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా, విజయవంతంగా కులగనన సర్వే పూర్తి చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేకి ముందు సర్వేకి తర్వాత అన్న చర్చ దేశవ్యాప్తంగా జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే చారిత్రాత్మకమైనదన్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42 రిజర్వేషన్ కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, లోక్ సభ, రాజ్యసభ ఎంపీల మద్దతు కూడగట్టేందుకు ఢిల్లీకి వెళ్తున్నామని చెప్పారు. బీసీ బిల్లును త్వరితగతిన పార్లమెంట్లో ప్రవేశపెట్టి మద్దతు కూడగట్టడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, ఈ కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి చెందిన 100 మంది ఎంపీలు కూడా కలిసి వస్తారని తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే కుల గణన చేపడుతామని మానాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారు ఆ మేరకు విజయవంతంగా కుల గణన పూర్తి చేసి క్యాబినెట్లో, ఆ తర్వాత అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింపచేసామని పేర్కొన్నారు. కుల గణనలో తెలంగాణ దేశానికి ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని,దేశంలోని ఏ రాష్ట్రం అయినా కుల గణన చేపట్టాలి అంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అనుసరించాల్సిందేనని చెప్పారు. గతంలో దేశంలో చేపట్టిన వివిధ రకాల సర్వేలు, వారి అనుభవాలు పరిగణలోకి తీసుకున్నామని, సర్వేకు సంబంధించిన ప్రశ్నావళి తయారీ విధానం, జిల్లా, రాష్ట్రస్థాయిలో భాగస్వాములు అందర్నీసర్వేకు ముందే సమావేశపరిచి వారి అభిప్రాయాలను తీసుకుని ముందుకు

>>2



## నేడు హస్తినకు ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై22:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ నిధులు, పలు

>>2

# పట్టణాల్లో ఇందిరమ్మ ఇండ్లు

### మొదటి దశలో జిహెచ్ఎంసి పరిధిలో నిర్మాణం

### పేదలు ఉన్నచోటే జి+3 గృహాలు

### స్థలాల గుర్తింపుపై నాలుగు జిల్లాల కలెక్టర్లతో సమావేశం: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 22:** గ్రామీణ ప్రాంతాల్లో మొదటి దశ ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ కొలిక్కి వచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసిస్తున్న చోటనే జి+3 పద్ధతిలో ఇండ్లు నిర్మించి ఇవ్వడానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో హౌసింగ్ అధికారులతోపాటు జిహెచ్ఎంసీ కమీషనర్, హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజ్‌గిరి మేడ్చల్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌లతో పట్టణాలలో ఇందిరమ్మ ఇండ్లు, 2 బిహెచ్‌కే ఇండ్లపై సుదీర్ఘంగా సమీక్షించారు.పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్‌కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఇష్టపడడం లేదన్నారు.గత ప్రభుత్వంలో కేటాయించిన ఇళ్లలోకి పేదలు వెళ్లడం లేదని, ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని త్వరలో మొదటిదశ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని తెలిపారు.పట్టణ పరిధిలోని మురికివాడల్లో నివసిస్తున్న వారికి అక్కడే జి+3 పద్ధతిలో ఇండ్లు నిర్మించి ఇవ్వడానికి వీలుగా స్థలాలను గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు వ్యక్తులకు చెంది పేదల అధీనంలో ఉన్న స్థలాలతో పాటు కబ్జాకు గురైన ప్రాంతాలను కూడాగుర్తించాలని, అదేవిధంగా భూదాన్ భూములను పేదల ఇండ్ల కోసం వినియోగించే వెసులుబాటు ఉన్నందున అటువంటి భూములను గుర్తించి సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని దీని కోసం ప్రతి జిల్లా కలెక్టర్ తమ పరిధిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకోవాలని సూచించారు. జిహెచ్ఎంసీ పరిధిలో గల 166 మురికివాడలలో సుమారు 42,432 మంది నివసిస్తున్నారని, ఇంతవరకు హైదరాబాద్ జిల్లాలో 106, సంగారెడ్డిలో 5, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 12, రంగారెడ్డిలో 26 మురికివాడలలో సర్వే నిర్వహించి 25,501 కచ్చా ఇండ్లలో పేదలు ఉంటున్నట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. దీనిపై మరింత లోతైన పరిశీలన జరిపి ఎన్ని మురికివాడల్లో ఎంత భూమి అందుబాటులో ఉంది,జి+3 పద్దతిలో ఎన్నిఇందిరమ్మ ఇండ్లు నిర్మించవచ్చు అనే అంశాలపై ఈనెలాఖరులోగా పూర్తిస్థాయినివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో నియోజకవర్గానికి తొలి విడతగా ఇచ్చినట్లు 3,500 ఇండ్లకు బదులు పట్టణ నియోజకవర్గాల్లో జనాభాను దృష్టిలో పెట్టుకొని అదనంగా ఇండ్లను మంజూరు చేయాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. 2 బిహెచ్‌కె ఇండ్లకు సంబంధించి సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరిల్లో కేటాయించిన వాటిలోకి హైదరాబాద్‌లో నివసిస్తున్నవారెవరూ అక్కడికి వెళ్లడం లేదని ఫలితంగా 30 వేల ఇండ్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇండ్లకేటాయింపు పొంది అక్కడ

>>2



మంగళవారం రవీంద్రభారతిలో అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మంత్రులు కృష్ణారావు, పొన్నం ప్రభాకర్. చిత్రంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తదితరులు

# ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం

### అన్ని గ్రామపంచాయతీల్లో అందుబాటులో దాశరథి రచనలు: మంత్రి జూపల్లి కృష్ణారావు

### అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం ప్రదానం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూలై 22 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్ను, కీర్తికి ప్రతీకగా నిలిచిన ఉద్యమ కెరటం, సాహితీ శిఖరం డా. దాశరథి కృష్ణమాచార్య నిలువెత్తు విగ్రహాన్ని త్వరలో ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టింపజేయడానికి సత్వర కార్యాచరణ రూపొందిస్తానని, సాంస్కృతికశాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12వేలకుపైగా గ్రామపంచాయతీలలో దాశరతి రచనలు

>>2

# కాంగ్రెస్‌కు పెద్ద షాక్..

### ఆ రూ. 199 కోట్లకు పన్ను కట్టాల్సిందే!



**న్యూఢిల్లీ, జూలై 22:** కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. తమ పార్టీకి విరాళంగా వచ్చిన రూ.199 కోట్ల డబ్బుపై పన్ను మినహాయింపు కోసం చేస్తున్న ప్రయత్నం బెడిసికొట్టింది. మంగళవారం ఆదాయ పన్ను అప్పిల్లేట్ ట్రిబ్యునల్ ఆ పార్టీ అప్పీల్‌ను తిరస్కరించింది. గతంలో ఆదాయ పన్ను అధికారులు తీసుకున్న నిర్ణయాన్నే ట్రిబ్యునల్ సమర్థించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు రిలీఫ్ ఇవ్వబోమని తేల్చిచెప్పింది. దాంతో, ఏం చేయాలో తెలియక కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు. కేంద్రంలో వరుసగా మూడో పర్యాయం అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ఆదాయ పన్నుఉచ్చు బిగుసుకుంటోంది. 2018-19లో పార్టీకి విరాళం రూపంలో రూ.199 కోట్లు వచ్చాయి. ఆ డబ్బుపై తప్పనిసరిగా పన్ను చెల్లించాల్సిందేనని ఆదాయపు

>>2

## ప్రధాని మోడీ నేటి నుంచి బ్రిటన్, మాల్దీవుల పర్యటన



**న్యూఢిల్లీ, జూలై 22:** ప్రధాని మోడీ ఈ నెల 23 నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవులలో నాలుగు రోజుల అధికారిక పర్యటన చేయనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వాణిజ్యం, భద్రత, ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. బ్రిటన్-భారత్ మధ్యసమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ), ఆర్థికం, సాంకేతికత, రక్షణ, భద్రత, వాతావరణం, ఆరోగ్యం, విద్య, అంతర్జాతీయ అంశాలపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో మోడీ చర్చలు జరపనున్నారు. ఇక మాల్దీవుల ప్రెసిడెంట్ మహ్మద్ మొయిజ్జు ఆహ్వానంపై హిందూ-మాల్దీవుల హర్తరాఫ్ ఇకనామిక్ అండ్ మారిటైమ్ సెక్యూరిటీ పార్ట్‌నర్‌షిప్‌ను సమీక్షిస్తూ.. మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవంలో గౌరవ అతిథిగా పాల్గొని ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలను బలపరచనున్నారు.



టెట్ ఫలితాలు విడుల చేస్తున్న అధికారులు

# 'టెట్'లో 33.98% అర్హత

### గతం కంటే పెరిగిన శాతం

### స్థానిక సమరం తరువాత డిఎస్‌సి నోటిఫికేషన్

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-జూన్-2025 పరీక్షల్లో 33.98 శాతం మంది అర్హత సాధించారు. గతజనవరిలో నిర్వహించిన టెట్ ఫలితాల కంటే జూన్‌లో అర్హతా శాతం స్వల్పంగా పెరిగింది. జనవరిలో నిర్వహించిన టెట్‌లో 31.21 శాతం అర్హత సాధించగా.. జూన్‌లో నిర్వహించిన పరీక్షల్లో 33.98 శాతం అర్హత సాధించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా మంగళవారం విడుదల చేశారు.టెట్ నోటిఫికేషన్‌ను ఏప్రిల్ 11న జారీ చేయగా.. జూన్ 18 నుంచి 30 వరకు పరీక్షలను నిర్వహించారు.టెట్ పరీక్షలకి 1,83,653 మంది దరఖాస్తు చేసకుఉన్నారు. వారిలో 90,205 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 30,649 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పరీక్షలకు హాజరైన

>>2

# పండుగ తెచ్చిన విషాదం

### ఫుడ్ పాయిజన్‌తో ఒకరు మృతి

### కొందరికి సీరియస్

### వనస్థలిపురంలో విషాద ఘటన



శ్రీనివాస్ (ఫైల్)

**మన్సూరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** బోనాల పండుగ సందర్భంగా ఆ కుటుంబ సభ్యుల అంత కలిసి అమ్మ వారికి ఘనంగా ఆదివారం బోనాలు సమర్పించి, మటన్, చికెన్‌లతో వంటలు చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కాగా మిగిలిని వంటకాలను ఆ రోజు రాత్రి మిగలడంతో ఫ్రిడ్జ్ లో పెట్టి మరుసటి రోజు ఉదయం ఇంటిల్లిపాది ఆ మటన్ చికెన్ లతో తినడంతో ఆ వంటకాలు ఫుడ్ పాయిజన్ గా మారి ఆ ఇంటిపెద్ద ఆకాల మృతువాత పడటంతో పాటు మిగిలిని కురుంభ సభ్యులు సైతం సీరియస్ గా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషాద సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట ప్రాంతానికి చెందిన శ్రీనివాస యాదవ్ గత 15 ఏండ్లుగా వనస్థలి పురం ఆర్టీసీ కాలనీ లో నివాసం ఉంటూ ఆర్టీసీ లో కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. అతని తో పాటు భార్య రజిత ఇద్దరు పిల్లలు లహరి జస్మిత మరియు శ్రీనివాస్ తల్లి గౌరమ్మ లతో ఆర్టీసీ కాలనీ లో నివాసముంటున్నాడు .ఆదివారం వనస్థలిపురం లో బోనాల పండుగ ఉండడంతో శ్రీనివాస్ సోదరి రాధిక ఆమె భర్త సంతోష్ కుమార్ మరియు వారి పిల్లలు కృతింగా. పూర్విక లను తన ఇంటికి ఆహ్వానించాడు. ఐతే పండుగ సందర్భంగా తన ఇంటికి మటన్ , చికెన్ తీసుకు రావడంతో రజిత మటన్ తో బోటి చేసి చికెన్ కర్రీ తో వంటలు చేసి కుటుంబ సభ్యులు అందరూ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. ఆదివారం రాత్రి భోజనాల అనంతరం కొంచెం మటన్ బోటి , చికెన్ కర్రీ మిగలడంతో రజిత వాటిని ఫ్రిడ్జ్ లో పెట్టింది. సోమవారం ఉదయం అందరూ కలిసి టిఫెన్ కు సిద్ధమవ్వగా మిగిలిని మటన్ బోటి చికెన్ కర్రీ లని ఫ్రిడ్జ్ లో నుండి తీసి వేడిచేసి కుటుంబ సభ్యులు అందరూ కలిసి తిన్నారు. కాగా

>>2



# 'హై స్పీడ్'లో ఉచిత బస్సు

### 200 కోట్ల మంది 'మహాలక్ష్ములు' ప్రయాణం

### వారి కోసం అయిన ఖర్చు రూ.6700 కోట్లు

### నేడు రాష్ట్ర వ్యాప్తంగా 97 డిపోలు, 341 బస్ స్టేషన్లలో సంబురాలు: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంతో ఆర్‌టిసిలో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణ ఖర్చు రూ. 6700 కోట్లని తెలిపారు. విజయవంతంగా కొనసాగుతున్న మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా నేడు (బుధవారం) రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆర్‌టిసి డిపోలతోపాటు 341 బస్ స్టేషన్‌లలో సంబురాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వంలో అమలు చేసిన మొట్టమొదటి మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 9 డిసెంబర్ 2023 నుండి విజయవంతంగా అమలవుతుందన్నారు. ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని.. రూ. 6700 కోట్ల విలువైన ప్రయాణాన్ని మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని తెలిపారు. ఆర్‌టిసికి మహిళా ప్రయాణికుల రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తుందన్నారు. సంస్థలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నూతన బస్సుల కొనుగోలు చేస్తూ మహాలక్ష్మి పథకం విజయవంతం కోసం కృషి చేస్తున్న ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్‌లు, శ్రామిక్ లు, ఇతర సిబ్బంది, అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత, ఉద్యోగుల సంక్షేమం ప్రథమ కర్తవ్యంగా ముందుకు పోతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఉచిత ప్రయాణం ద్వారా మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని.. దూర ప్రాంత ప్రజలు కూడా నిత్యం నగరానికి వచ్చి ఉద్యోగాలు చేస్తూ ఆర్‌టిసి వృద్ధి సాధించడం అభినందనీయమన్నారు. ప్రతి మహిళా నెలకు రూ. 45 వేల వరకు ఉచిత ప్రయాణం ద్వారా ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. ఆర్‌టిసిలో 200 కోట్ల ఉచిత బస్సు

>>2



న్యూఢిల్లీలోని శాస్త్రి పార్కు వద్ద కన్వరియా శిబిరంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఢిల్లీ సిఎంరేఖ గుప్తా

## టాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం

>> అందుబాటులో ఉంచే ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. తనకు సంవత్సరానికి వచ్చే 5కోట్ల నిధులలో కోటి రూపాయలు సాహితీమూర్తుల రచనలు గ్రంథాలయాల్లో ఉంచేందుకు, యువత క్రీడల కోసం మరో కోటి రూపాయల నిధులు కేటాయిస్తానని వాగ్దానం చేశారు. నాటి భారత స్వాతంత్ర్య, నేటి తెలంగాణ ఉద్యమాల్లో దాశరథి లాంటి మహాకవులు సంఘటితంచేసి అన్యాయాలు అక్రమాలపై నినదించి తమ కవితలతో నిలదీసిన కారణంగా ప్రజల్లో చైతన్యం రగిలి సఫలీకృతం కాగలిగామని గుర్తుచేశారు. సమాజం ఉన్నంతకాలం దాశరథి పేరు నిలిచివుండేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో గత దశాబ్దంపైగా ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న ప్రఖ్యాత కవి డా. దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు, సాహితీ పురస్కార ప్రదానోత్సవం మంగళవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవోపేతంగా జరిగింది. భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు విశిష్ట అతిథి రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్రగీత రచయిత అందెశ్రీ, సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, ప్రజాకవి జయరాజ్, కవి యాకూబ్, దాశరథి కుటుంబసభ్యులు లక్ష్మణ్, ఇందిర, గౌరీశంకర్‌లు, ప్రముఖకవి, కాలమిస్టు అన్నవరం దేవేందర్ తదితరులతో దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. ముందుగా జూపల్లి ఇతర అతిథులతో కలిసి ప్రముఖకవి అన్నవరం దేవేందర్ దంపతులను ఘనంగా సత్కరించి ప్రభుత్వం తరఫున ప్రతీ సంవత్సరం అందిస్తున్న దాశరథి సాహితీ పురస్కారాన్ని 2025కిగాను ప్రదానంచేసి, పురస్కారంతోపాటు లక్ష వెయ్యినూటపదహారు రూపాయల నగదు బహుమతిని అందజేసి శుభాభినందనలు తెలిపారు. ముందుగా డా. మామిడి హరికృష్ణ స్వాగతోపన్యాసంలో దాశరథి గొప్పదనాన్ని, రచనల వైవిధ్యాన్ని వల్లెవేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దాశరథి దశాబ్దాల తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అని అభివర్ణించారు. ఎందరో కవులు, సాహితీవేత్తలు దాశరథి ప్రభావం, సామాజిక స్పృహతో అద్భుత రచనలు చేసి తెలంగాణ సాకారానికి బాటలు వేశారని చెప్పారు.

దాశరథి సాహితీ పురస్కార స్వీకర్త అన్నవరం దేవేందర్ తన స్పందనలో దాశరథి పేరిట ప్రతిష్టాత్మక సాహితీ పురస్కారం అందించినందుకు ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దాశరథి అంటే ఒక ధిక్కారం, పీడనపై వ్యతిరేకత, నిజాం పిశాచంపై ఎక్కుపెట్టిన కలం, జైలు గోడలపై నా తెలంగాణ కోటి రతనాలవీణ అని లిఖించిన ధైర్యశీలన్నారు. ఈ పురస్కారం రావడం ఎంతో అదృష్టమని ఆనందాన్ని వ్యక్తపరిచారు. చివరిగా పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ భాషను ప్రవేశపెట్టాలని కోరుతూ కవిత్వాన్ని ప్రజల, అట్టడుగువర్గాల కోసం వ్రాస్తానని తెలిపారు.

## బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!

>> ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.
పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే పదవి నుంచి తప్పుకుంటున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు, ప్రధాని మోడీకి ,కేంద్రమంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మరో రెండేళ్ల పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వివి గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్. వెంకటరామన్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ, అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## బిసి బిల్లుకు బిజెపి మద్దతు

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు సంబంధించి ఏ బిల్లుపెట్టినా బిజెపి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావు అన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 9వ షెడ్యూల్‌లో పెట్టి బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ చెప్పలేదని అన్నారు. 9వ షెడ్యూల్‌లో పెట్టినా సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష చేసే అవకాశం ఉందన్నారు. తమిళనాడులో జయలలిత 50 శాతం మించి రిజర్వేషన్లు తీసుకొచ్చిందని, ఆ పిటిషన్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉందని అన్నారు. బిజెపిని బూచీగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్ల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందిని ఆరోపించారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రానున్న రోజుల్లో ద్విముఖ పోరే అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందని రాంచందర్ రావు చెప్పారు. బిఆర్ఎస్‌ను ప్రజలు మర్చిపోయారని అన్నారు. గడిచిన పదేండ్లలో బిజెపి తెలంగాణలో భారీగా ఎదిగిందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతుందన్నారు. వార్డు మెంబర్ల నుంచి మొదలుకొని జెడ్‌పిటిసిల వరకు పోటీ చేస్తామని చెప్పారు. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటామని వివరించారు.

## పట్టణాల్లో ఇందిరమ్మ ఇండ్లు

>> నివసించని వారందరికీ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్‌కే లను పూర్తిచేయాలని అలాగే వాటర్, కరెంట్, డ్రైనేజ్ వంటి కనీస వసతులను కల్పించి మిగిలిపోయిన 2 బిహెచ్‌కే ఇండ్లను ఆగస్టు నెలాఖరులోగా కేటాయింపులు పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ విపి గౌతమ్, జిహెచ్ఎంసీ కమీషనర్ ఆర్‌వి కన్నన్, నాలుగు జిల్లాల కలెక్టర్లు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా హౌసింగ్ కాలనీస్ ఇన్స్‌పెక్షన్ యాప్‌ను మంత్రి పొంగులేటి ప్రారంభించారు.

## హరిహర వీరమల్లుకు రేట్లు పెంపు

### అదనపు షోలకు సైతం రాష్ట్ర సర్కార్ అనుమతి

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** పవన్ కల్యాణ్ హీరోగా విడుదలవుతున్న హరిహర వీరమల్లు ప్రీమియర్ షోలకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఒకరోజు ముందుగానే సినిమా ప్రదర్శితం కానుంది. అలాగే, టికెట్ రేట్ల పెంపునకు కూడా ఓకే చెప్పింది. ఈ నెల 24న హరిహర వీరమల్లు మూవీ రిలీజ్ కానుండగా 23వ తేదీ రాత్రి పెయిడ్ ప్రీమియర్ షోలు వేసుకునేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ షోలకు టికెట్ ధర 600 రూపాయలు (జీఎస్టీ అదనం) ఉండనుంది. అలాగే, ఈ నెల 24 నుంచి 27 వరకూ ఐదు షోలకు అనుమతి ఇచ్చింది. మల్టీ ప్లెక్స్‌ల్లో అయితే 200 రూపాయలు (జీఎస్టీ అదనం), సింగిల్ స్క్రీన్లలో 150 రూపాయలు మేర (జీఎస్టీ అదనం)పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అలాగే ఈ నెల 28 నుంచి ఆగస్ట్ 2 వరకూ ఐదు షోలు వేసుకునేందుకు అనుమతి ఇస్తూనే, మరోవైపు మల్టీ ప్లెక్స్‌ల్లో 150 రూపాయలు (జీఎస్టీ+), సింగిల్ స్క్రీన్లలో 106 రూపాయలు (జీఎస్టీ +) వరకూ టికెట్ ధరలు పెంచుకునేందుకు వీలు కల్పించింది.

## పండుగ తెచ్చిన విషాదం

>> తిన్న వెంటన్నే శ్రీనివాస్ కు విరోచనాలు , వాంతులు మొదలయ్యి సీరియస్ గా ఉండడంతో వెంటనే తార్నాక లోని ఆర్టీసీ హాస్పిటల్ లో చికిత్స చేయించి ఇంటికి తిరిగి వచ్చారు. ఫుడ్ పాయిజన్ అయిందని గుర్తించారు.సోమవారం రాత్రి నుండి మిగిలిన కుటుంబ సభ్యుల పరిస్థితి కూడా ఇలానే ఉండటంతో మంగళ వారం ఉదయం చింతలకుంట లోని హిమాలయ ఆసుపత్రిలో శ్రీనివాస్ తో పాటు కుటుంబ సభ్యులు సైతం చికిత్స కోసం చేరారు . ఐతే అప్పటికి శ్రీనివాస్ మృతి చెందారని వైద్యులు తెలిపారు. కాగా హాస్పిటల్ లో ఫుడ్ పాయిజన్ వల్లనే ఇలా జరిగిందని వైద్యులు చెప్పారు. కాగా ప్రస్తుతం హాస్పిటల్ లో శ్రీనివాస్ భార్య రజిత , తల్లి గౌరమ్మ , కూతురు లహరి పరిస్థి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారు జస్మిత , సంతోష్ , రాధిక ,కృతింగా , పూర్వికలు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

23-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయనం
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి రా. 2.30
ఆరుద్ర సా. 5.57
వర్జ్యం : తె. 5.22-6.53
దు.ఉ. 11.49-12.41
రాహుకాలం - మ. 12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** సంతానానికి నూతన విద్యా, ఉద్యోగ యత్నాలు లభిస్తాయి. బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కోపతాపాలకు దూరంగా ఉండండి. ప్రయాణాలు.

**మిథునం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కీలక నిర్ణయాలలో సొంతఆలోచనలు శ్రేయస్కరం.

**కర్కాటకం :**అకారణంగా వివాదాలు ఏర్పడినా జీవితభాగస్వామి సలహాతో పరిష్కరించుకొంటారు.

**సింహం:** కాంట్రాక్టులు లాభిస్తాయి. రాజకీయ, కళారంగాల వారికి అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**కన్య :** నూతన ప్రయత్నాలు సఫలమవుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుండును.

**తుల :** నూతన మిత్రులు పరిచయమై కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు.

**వృశ్చికం:** చిరకాల కోరిక నెరవేరే సమయం. ఉద్యోగాలలో విశేష ఆదరణ పొందుతారు. వస్తు, వస్త్రా కొనుగోలు.

**ధనుస్సు:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మకరం:** తండ్రి నుండి ఆస్తి లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. శుభవార్తలు.

**కుంభం:** ఇంతకాలం పడిన కష్టానికి ఫలితం దక్కుతుంది. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బిసి రిజర్వేషన్లపై ఢిల్లీకి

>> వెళ్ళామని వివరించారు.. ప్రతి 150 ఇళ్లకు ఒక బ్లాక్, ప్రతి బ్లాక్ కు ఒక అధికారిని నియమించాం. పూర్తిగా ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో సర్వే జరిగిందని,. సమాచారం సేకరించిన విధానం, సేకరించిన డాటాను కేబినెట్‌లో అసెంబ్లీలో పెట్టి ఆమోదింపజేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే వివరాలను స్వతంత్ర అనుభవజ్ఞుల కమిటీతో కలిసి విశ్లేషణ చేయించామన్నారు. పారదర్శకంగా, పకడ్బందీగా సర్వే పూర్తి చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేకు అసెంబ్లీలోనే బిజెపి, టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా మద్దతు ఇచ్చారు.. అదేవిధంగా పార్లమెంట్ లోను పార్టీలకు అతీతంగా బీసీ బిల్లుకు మద్దతు ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తుందని చెప్పారు. 50 శాతం రిజర్వేషన్ల క్యాప్‌ను తొలగించకపోతే భవిష్యత్తులో ఇబ్బంది కలుగుతుందని ఆర్డినెన్స్ తీసుకు వచ్చాం.. ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదముద్ర వేస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు దళితులు బీసీలు, మైనార్టీలు అంటే చిన్న చూపు ఉంది. దేశంలో ఈ వర్గాలకు మేలు జరుగుతుంటే ఆయన పదేపదే అడ్డుపడుతున్నారని ఆరోపించారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రామచంద్రరావు పాత్ర ఏంటో అందరికీ తెలుసునని పేర్కొన్నారు. రిజర్వేషన్ల బిల్లుమేమేతెచ్చాం మేమే పరిష్కరించుకోవాలని బిజెపిఅధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. వారు విషయాన్ని సరిగా అవగాహన చేసుకోలేదని భావిస్తున్నాను అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు అనేది కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంశం.. రాజకీయ పార్టీలకు సంబంధించినది కాదన్నారు. బట్టి విక్రమార్క లీగల్ నోటీసులకు భయపడే వ్యక్తి కాదు.. సమయం వచ్చినప్పుడు పార్టీగా, వ్యక్తిగా లీగల్ నోటీస్ కు ఎలా సమాధానం చెప్పాలో ఆ విధంగా చెబుతాను అని సమాధానం ఇచ్చారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఈ పద్ధతిలో కుల గణన జరగలేదు.. తెలంగాణ చేపట్టిన కుల గణన దేశానికి దిశా నిర్దేశం చేసిందన్నారు. కుల గణనకు సంబంధించి కేంద్రం ఏ సమాచారం అడిగిన ఎప్పుడైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, కుల గణన విషయంలో అన్ని రకాల పరిణామాలను ఎదుర్కొనేందుకు ఒక పాజిటివ్ దృక్పథంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. పార్టీలకు అతీతంగా అసెంబ్లీలో బీసీ బిల్లుకు అన్ని పార్టీలు సహకరించాయి.. పార్లమెంట్లో అందుకు భిన్నంగా ఆయా పార్టీలు స్పందిస్తాయని అనుకోవడం లేదన్నారు. 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్ళు అన్ని గాలికి వదిలేశారు.. మాకు నిబద్ధత ఉంది కాబట్టి ప్రణాళికా ప్రకారం ముందుకు వెళుతున్నామన్నారు. కార్పొరేషన్ల చైర్మన్ ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటుందని చెప్పారు.

# విత్తనాల పేరుతో రైతుల నిలువు దోపిడి

### ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకంటే అధిక ధరలు

### మార్కెట్లో నిషేధిత బిటి విత్తనాలు

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం పంటల సీజనులో విత్తనాలకు డిమాండ్ పెరగడంతో కొందరు వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని బట్టి వ్యాపారులు ఒక్కొక్కరు ఒక్కో రీతిగా విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే పెంచి అమ్ముతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సోయాబీన్ విత్తనాల ధర రూ.2,400 మాత్రమే ఉండగా, కొందరు వ్యాపారులు రైతుల నుంచి రూ.2,600 వరకూ వసూలు చేస్తున్నారు. నగదు రూపంలో అదనంగా డబ్బులు తీసుకుంటున్న వ్యాపారులు రసీదులో మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరల్ని మాత్రమే రాస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే విత్తనాల కొరత ఉందనే సాకు చెబుతున్నారు. ఒక రైతుకు నాలుగెకరాల భూమిలో పత్తి, సోయాబీన్, మిరప పంటలు సాగు చేసేందుకు విత్తనాలు అడిగితే చెందిన నాలుగు పత్తి విత్తన ప్యాకెట్లు (ఒక్కటి 475 గ్రాములు), ఒక సోయాబీన్ సీడ్ సంచి (30 కిలోలు), మిరప విత్తనాలు కావాలని అడిగాడు. సదరు వ్యాపారి పత్తి ప్యాకెట్ ధర రూ.900 చొప్పున నాలుగు ప్యాకెట్లకు రూ.3,600, సోయాకు రూ.2,400, ఇతర విత్తనాలకు రూ.900 బిల్లు వేశాడు. నగదుగా మాత్రం రూ.600 అదనంగా తీసుకున్నాడు. రసీదులో వేసిన ధరల కంటే ఎక్కువ ఎలా తీసుకుంటారు అని రైతు ప్రశ్నించగా, పత్తి విత్తనాలపై ప్యాకెట్‌కు రూ.100 అదనంగా ఇవ్వాల్సిందేనని లేకుంటే మానుకోండని చెప్పడంతో చేసేది లేక వ్యాపారి చెప్పిన రేటు ఇచ్చి విత్తనాలను కొనుగోలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 3.34 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. సుమారు 6 లక్షల వరకు పత్తి విత్తనాల అవసరముంటుంది. సగటున ఒక్క ప్యాకెట్‌పై రూ.100 చొప్పున పత్తి, సోయాబీన్ విత్తనాలపై వసూలు చేస్తున్న వ్యాపారులు రూ.6 కోట్లకుపైనే రైతుల నుంచి అధిక ధరల పేరిట లూటీ చేస్తున్న పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. అలాగే సిద్దిపేట జిల్లాలోనూ 1.50 లక్షల ఎకరాల్లో పత్తి, మెదక్ జిల్లాలో 50 వేల ఎకరాల్లో పత్తి సాగవ్వనుంది. రెండు జిల్లాల్లోనూ 3.5 లక్షల వరకు పత్తి విత్తన ప్యాకెట్ల వ్యాపారం సాగనుంది. పత్తి విత్తనాలకు సంబంధించి బ్రాండెడ్ హైబ్రీడ్ విత్తనాలు బీటీ1, బీటీ2 రకాల కొరత ఉందని చెప్పి ఎంఆర్‌పీ ధర రూ.901గా ఉంటే అదనంగా రూ.200 వసూలు చేస్తున్నారు. హైబ్రీడ్ విత్తనాల గురించి రైతులకు శాస్త్రీయమైన అవగాహన లేకపోవడంతో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొందరేమో నిషేధించబడిన బీటీ3 పత్తి విత్తనాలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. బీటీ2 కంటే బీటీ3 విత్తనాలు సాగు చేస్తే 30 శాతం అధిక దిగుబడి వస్తుందని, దోమపోటు అస్సలు రాదని చెప్పి రూ600 వందలకే ప్యాకెట్ విత్తనాలను విడిగా విక్రయిస్తున్నారు. ఖమ్మం తదితర జిల్లాల్లో పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నిషేధిత గడ్డి మందు, చీడల నివారణ కోసం వాడే ఆయిల్ ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు అరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



తిరువనంతపురంలోని మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్. చిత్రంలో సిఎం పినరయ్ విజయన్ తదితరులు

# 'హై స్పీడ్'లో ఉచిత బస్సు

>> ప్రయాణం పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా 97 బస్సు డిపోలు, 341 బస్ స్టేషన్‌లలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. అందులో భాగంగా బస్ స్టేషన్లు, డిపోలు మొదలైన వాటిలో బ్యానర్ల ప్రదర్శన చేయాలని.. అన్ని డిపోల్లో ముఖ్యమైన బస్ స్టేషన్లలో సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సంబురాల కార్యక్రమాల్లో స్థానిక ఎంపీలు,మంత్రులు,ఎమ్మెల్యేలు,మేయర్లను సమావేశానికి ఆహ్వానించాలని.. మహిళా ప్రయాణీకులతోపాటు ప్రయాణికుల ప్రసంగాలను ఏర్పాటు చేయడం కూరగాయల విక్రేతలు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పాఠశాల,కళాశాల విద్యార్థులు, వ్యాపార మహిళలు, పట్టణ ఆసుపత్రులకు మెరుగైన చికిత్స కోసం వెళ్లే మహిళలు, యాత్రికులు వంటి వివిధ వర్గాలకు చెందిన వారు తమ ప్రసంగాలలో తమ ప్రయాణ అనుభవాలను పంచుకోవాలన్నారు. డిపోలు, ముఖ్యమైన బస్ స్టేషన్లలో మహిళా ప్రయాణికులను శాలువా, బహుమతితో సత్కరించనున్నట్టు మంత్రి తెలిపారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం, మహిళా సాధికారత మొదలైన అంశాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, రంగోలి, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలన్నారు. పుస్తకాలు, వాటర్ బాటిళ్లు, పెన్ సెట్లు మొదలైన బహుమతులతో 5 మంది బహుమతి గ్రహీతలను సత్కరించాలని మంత్రి పొన్నం సూచించారు. పథకం విజయవంతానికి దోహదపడిన ప్రతి డిపోలోని 5 మంది ఉత్తమ డ్రైవర్లు, 5 మంది ఉత్తమ కండక్టర్లతో పాటు ట్రాఫిక్ గైడ్‌లు,భద్రతా సిబ్బందిని సత్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

**ఉచిత బస్సు పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉంది: ముఖ్యమంత్రి రేవంత్**

18 నెలల ప్రజా పాలనలో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటిందని.. ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులైన ప్రతి ఆడబిడ్డకు నా అభినందనలు.. ఈ పథకాన్ని.. దిగ్విజయంగా అమలు చేయడంలో.. భాగస్వాములైన.. ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు అంటూ ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్‌కు పెద్ద షాక్..

>> పన్ను శాఖ అధికారులు కాంగ్రెస్‌కు స్పష్టం చేశారు. ఇదే విషయమై పలుమార్లు నోటీసులు కూడా పంపారు. అయితే.. కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అవి డొనేషన్‌గా వచ్చిన డబ్బులని.. వాటిపై పన్ను విధించడం సమంజసం కాదని వాదిస్తోంది. అంతేకాదు 2019లో కాంగ్రెస్ ఆదాయ పన్ను వివరాలను డిసెంబర్ బదులు నెల ఆలస్యంగా ఫిబ్రవరి 2న సమర్పించింది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 13ఏ ప్రకారం రూ.199 కోట్లకు మినహాయింపు ఇవ్వాలని ఐటీ శాఖను కోరింది. అయితే.. అదే ఏడాది సెప్టెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఒక దాత నుంచి రూ.14.49 లక్షలు విరాళంగా స్వీకరించినట్టు ఆదాయపు పన్ను అధికారులు గుర్తించారు. నియమాల ప్రకారం ఒకరి నుంచి రూ.2 వేలకు మించి తీసుకోకూడదు.

## 'టెట్'లో 33.98% అర్హత

>> వారిలో 33.98 శాతం మంది అర్హత సాధించారు. పేపర్-1 పరీక్షను 6 సెషన్‌లలో 7 భాషల్లో నిర్వహించారు. తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, బెంగాలీలో నిర్వహించారు. పరీక్షలకు 47,224 మంది హాజరు కాగా వారిలో 29,043 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 61.50 శాతం మంది అర్హత సాధించారు. పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్ పరీక్షను 10 సెషన్‌లలో 7 భాషల్లో నిర్వహించారు. తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, సంస్కృతం భాషల్లో నిర్వహించబడింది. ఈ పరీక్షకి 48,998 మంది హాజరు కాగా.. వారిలో 17,574 మంది(35.87శాతం) అర్హత సాధించారు. ఇక పేపర్-2 సోషల్ స్టడీస్ పరీక్షకి 41,207 మంది హాజరు కాగా.. వారిలో 13,075 మంది(31.73శాతం)అర్హత సాధించారు. పేపర్-1, పేపర్-2 పరీక్షలకి 90,205 మంది హాజరు కాగా వారిలో 30,649 మంది (33.98శాతం) అర్హత సాధించారు. టెట్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో నిరుద్యోగులు డిఎస్సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. డిఎస్సి నోటిఫికేషన్ విడుదలపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోయినప్పటికీ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ఇదే విషయాన్ని ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## నేడు హస్తినకు ముఖ్యమంత్రి రేవంత్

>> ప్రాజెక్టుల అనుమతి, నిధుల విడుదలపై చర్చించనున్నారు. జులై 24న ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీలతో సమావేశమై తెలంగాణలో నిర్వహించిన కులగణన సర్వే ఫలితాలను సమర్పించనున్నారు. బీసీలకు 42 రిజర్వేషన్ అమలుపై వివరణ ఇవ్వనున్నారు. అదే రోజు ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ ఎంపీలకు కులగణనపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు చట్టబద్ధతపై అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఎంపీలను కోరనున్నారు. ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఢిల్లీకి వెళ్లనున్నారు. సిఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఈనెల 25న రాష్ట్ర కేబినెట్ సమావేశం వాయిదా పడనుంది.

## 3 రోజుల్లో భారీ వర్షాలు

### పలు జిల్లాలకు రెడ్ అలర్ట్: వాతావరణ శాఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై22:** తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంతో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న తెలిపారు.
కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు.

## నకిలీ మద్యం ముఠా పట్టివేత

### 36 మంది అరెస్టు, 2200 లీటర్ల అక్రమ స్పిరిట్ స్వాధీనం

**విజయవాడ, జూలై 22:** నకిలీ మద్యం వ్యాప్తిని అడ్డుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక దాడుల ఫలితంగా భారీ విజయం నమోదు అయ్యింది. ఆధునీకరించిన నిఘా వ్యవస్థ, డేటా విశ్లేషణ ఆధారంగా చేపట్టిన చర్యల్లో ముప్పై ఆరు మందిని అరెస్టు చేయడంతో పాటు రెండు వేల రెండు వందల ముప్పది రెండు లీటర్లకు పైగా అక్రమ స్పిరిట్, నకిలీ మద్యం బాటిళ్లు, లేబుళ్లు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రధానంగా ప్రజారోగ్యం, నాణ్యమైన మద్యం సరఫరాపై దృష్టి సారించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు నకిలీ మద్యం నిర్మూలనపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ మీనా ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిఘా చర్యలు చేపట్టారు.నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు డేటా ఆధారంగా స్పిరిట్ వినియోగంలో అనుమానాస్పద మార్పులను గుర్తించి ప్రత్యేక దాడులు నిర్వహించారు. జూన్ నెల 23 తేదీ నుంచి జూలై 22 వ తేదీ వరకు కోరింగిపాలెం, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో దాడులు జరిగాయి. నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే ఖాళీ బాటిళ్లు, సీలింగ్ యంత్రాలు, లేబుళ్లు, మిషన్లు స్వాధీనం చేసుకోవటం జరిగింది.
తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ జిల్లాలో ఉన్న కృష్ణ ఫార్మా కంపెనీ ఈ ముఠాకు మూలంగా గుర్తించబడింది. కరోనా మహమ్మారి సమయంలో తాత్కాలికంగా మంజూరైన అనుమతిని దుర్వినియోగం చేస్తూ, స్పిరిట్‌ను హ్యాండ్ రబ్ పేరుతో డెనేచర్ చేయకుండా నేరుగా నకిలీ మద్యం తయారీదారులకు పంపినట్లు విచారణలో తేలింది. కంపెనీ యజమాని మల్లికార్జున రావు నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు రుత్తల శ్రీనివాస్ అలియాస్ అబ్దుల్ కలాం, చరణ్జీత్ సింగ్ సెథీలకు స్పిరిట్ సరఫరా చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.

## ఇడి విచారణకు గడువు కోరిన రానా

హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా పదుల సంఖ్యలో అమాయకులను బలిగొన్న బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీల ను విచారించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒకవైపు సన్నాహాలు చేస్తుండగా మరోవైపు ఇదే కేసులో ఈడీ నోటీసులు అందు కున్న దగ్గుబాటి రానా 23వ తేదీ విచారణకు రాలేనని ఈడీకి సమాచారం పంపారు. ఆ రోజున ముందుగా నిర్ణయించిన షూటింగ్ షెడ్యూల్ కారణం గా విచారణకు రాలేని ఈడీకి సమాచారం అందించారు. విచారణకు తనకు మరింత గడువు కావాలని రానా కోరారు. ఈడీ షెడ్యూల్ ప్రకారం 23 వ తేదీన రానా, 30వ తేదీన ప్రకాష్ రాజ్, ఆగస్టు ఆరవ తేదీన విజయ్ దేవరకొండ, ఆగస్టు 13వ తేదీన మంచు లక్ష్మీ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి రావాల్సి వుంది. రానా సమాచారంపై ఈడీ అధికారులు ఇంకా స్పందించలేదు. తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్‌లపై నమోదైన కేసుల ను ఈడీ విచారిస్తుండడం తెలిసిందే. ఇదే కేసులపై తెలంగాణ, ఏపి పోలీసులు వేరు వేరుగా విచారిస్తు డడం విదితమే.

## అమ్మాయిలా చాటింగ్ చేసి నిరుద్యోగులకు టోకరా

### నిర్మల్ జిల్లాలో ఓ కేటుగాడి ఘరానా మోసం

హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త: నిర్మల్ జిల్లాలో ఘరానా మోసం వెలుగు చూసింది. సూర్యాపేట్ జిల్లా జాన్‌పహాడ్‌లోని చెర్వుతాండకు చెందిన బనావత్ గణేష్ అనే యువకుడు నిర్మల్‌లోని విఠోలితాండకు చెందిన రాథోడ్ మహేందర్‌కు కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రాంలో అమ్మాయిలా పరిచయం అయ్యాడు. ఈ పరిచయంలో భాగంగా గణేష్, మహేందర్‌కు ఊరించే మాటలతో బుడిబోట్టించి నీకు మంచి ఉద్యోగం వుంటే పెళ్లి చేసుకుం టానని నమ్మించా చాడు. అయితే తనకు ఇంకా సరైన ఉద్యోగం లేదని మహేందర్ చెప్పడంతో గణేష్ మరో అడుగు ముందుకేసి తన సోదరుడు రెండు రోజుల్లో నిజామాబాద్ వస్తున్నాడని, అతన్ని కలవాలని, అతనికి చాలా మందితో పరిచయం వుందని, నీకు కచ్చితంగా మంచి ఉద్యోగం ఇప్పిస్తాడని నమ్మించాడు. దీని తరువాత గణేష్ నిజామాబాద్‌కు వచ్చి మహేందర్‌తో పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో మహేందర్ తన బంధువు ఉమేష్‌తో కలిసి తనతో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం అయిన అమ్మాయి సోదరుడని చెప్పాడు. దీని తరువాత గణేష్ మహేందర్, ఉమేష్ సహా వారి అనుచ రులు పవార్ పూజ, జాదవ్ విశ్వనాథ్, రాథోడ్ కరణ్, పవార్ ఆకాష్, ప్ర కాష్ చౌహాన్ సహా మరో ఐదుగురు నుంచి తలా 20 వేల రూపాయలు వ సూలు చేశాడు. మీకు పోస్టల్ శాఖలో ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని వారిని నమ్మిం చాడు. అనంతరం వీరిలో ఆరుగురిని వారం రోజుల క్రితం హై దరాబాద్‌కు తీసుకువచ్చి ప్రైవేటు హాస్టల్‌లో వుంచి రెండు రోజులు భోజనం అందించాడు. ఆ తరువాత పత్తా లేకుండా పోయాడు. దీంతో బాధితు లు తాము మోసపోయామని గ్రహించి నిర్మల్‌కు వెళ్లి ముథోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు.



శ్రీశైల నుంచి విడుదలవుతున్న వరద

## 883అడుగులకు శ్రీశైల జలాశయం

### ఒక గేటు ద్వారా నీటి విడుదల

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త: శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో రెండోసారి ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 37054 క్యూసె క్కులు, గేట్ల ద్వారా 12518 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 39411 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 90,560 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. ఒక గేటు 10అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగుల కుగానూ 883.70అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 208.2841టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 67,185 క్యూసె క్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జలవిద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

## జూరాల 3గేట్ల ద్వారా నీటి విడుదల

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త: జూరాల డ్యామ్‌కు వరద ప్రవా హం స్థిరంగా కొనసాగుతున్నది. జలాశయానికి 62,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.477 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 36,506 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 12024 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమాలిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1250 క్యూసెక్కులు, కుడి కాలువకు 645 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 52286 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.



సమావేశంలో నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల నేతలు

## రామచంద్రరావు వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

### ఉపసంహరించుకోకపోతే బిజెపి కార్యాలయాన్ని ముట్టడిస్తాం: జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్ (ముషీరాబాద్), జూలై 22, ప్రభాతవార్త: బీసీ రిజర్వేషన్‌లు 42 శాతంకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బిల్లును తొమ్మిదవ షెడ్యూ ల్‌లో చేర్చటం కుదరదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం దోమల గూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీ కులసంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి అధ్యక్షతన, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యని ర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ తదితర నేతలతో కలసి ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం లో పాల్గొన్న రామచంద్రరావు, సామాజిక రిజర్వేషన్లపై తనకున్న వ్యతిరేక భావాన్ని ప్రదర్శిస్తూ, బీసీ రిజర్వేషన్లపై లేనిపోని అబద్ధాలు చెబుతూ తనలో ఉన్న విషాన్ని వెళ్లగక్కాడని ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లపై ఆయన చేసిన వ్యాఖ్యలు 48గంటలలోగా ఉపసంహరించుకోవాలని,లేదంటే బీజేపీ కార్యా లయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాటిమండల కమీషన్ మొదలు నేటి బీసీ రిజర్వేషన్ల వరకు బీజేపీపార్టీ వ్యతిరేకిస్తోందని, బీజేపీలో ఉన్న బీసీ నేతలంతా దీనిని గ్రహించి, బీజేపీకి రాజీనామా చేయాలని కోరారు.

## యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలి: మంత్రి వివేక్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో యూరియా కొరత లేదని ఎవరైనా యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ప్రలోభాలకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మికశాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి హెచ్చరించారు. సిద్ది పేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అభి వృద్ధిపై మంగళవారం నిర్వహించిన సమీక్షా సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగుచేసే ప్రతి ఒక్క రైతుకు యూరియాను అందించడం జరుగుతుందన్నారు. మెరుగైన విద్యను అందించే లక్ష్యంగా ప్రభుత్వం 10 వేల టీచర్ల నియామకం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇప్పటికే సర్కారు డైట్ చార్జిలను పెంచిందన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ, నియోజకవర్గాలో అమృత్ స్కీం




మంగళవారంజిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

అమలు చేయాలని జిల్లాలో నూతన రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన తాగునీటి అందించాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి డిఆర్‌సి సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ప్రోటోకాల్ పాటించడం లేదని సమావేశాలు నిర్వహించిన ప్పుడు కనీస సమాచారం ఇవ్వడం లేదని సభ దృష్టికి తీసుకరాగా కలెక్టర్ హైమావతి వెంటనే స్పందిస్తూ మరోసారి అలా జరగకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమీక్షాలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### హెచ్‌సిఎ గోల్‌మాల్ కేసులో నిందితులకు ముగిసిన సిఐడి కస్టడీ

## రిమాండ్ విధించిన మల్కాజిగిరి కోర్టు

హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త: సంచలనం రేపిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) నిధుల గోల్‌మాల్ కేసులో అరెస్టయిన అధ్య క్షుడు జగన్‌మోహన్ రావుతో పాటు కోశాధికారి శ్రీనివాసరావు, సీఈఓ సునీల్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కార్యదర్శి రాజేందర్ యాదవ్, అధ్యక్షురాలు కవిత ల ఆరు రోజుల సిఐడి కస్టడీ మంగళవారంతో ముగిసింది. వీరిని సిఐడి పోలీసులు గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి మల్కాజిగిరి కో ర్టులో మంగళవారం సాయంత్రం హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం నిందితులకు రెండు వారాల రిమాండు విధించింది. అ నంతరం జగన్‌మోహన్ రావు సహా నలుగురు చర్లపల్లి జైలుకు, కవితను చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు. హెచ్‌సిఎలో అక్రమాలపై తెల ంగాణ క్రికెట్ అసోసియేషన్ చాలా కాలంగా పోరాడుతుండడం తెలిసిందే. దీనిపై ఈడీ కూడా రంగంలో దిగడం విదితమే. బిసిసిఐ నుంచి అందిన వందల కోట్ల రూపాయల నిధులను హెచ్‌సిఎ పక్కదారి పట్టించి, సొంత అవసరాలకు వాడుకుందని సిఐడి విచారణలో తేలగా దీంతో పాటు గత ఐ పిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టును టికెట్ల కోసం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చింది. దీనికి సంబంధించిన నివే దికను కూడా సిఐడి తెప్పించుకుంది. ఉప్పల్ స్టేడియంలో జరిగిన కోట్లాది రూపాయల పనులలో భారీగా అక్రమాలు జరిగాయని, హెచ్‌సిఎ అధ్యక్షు డుగా జగన్‌మోహన్ రావు ఎన్నికే అక్రమమని సిఐడి తేల్చింది. మాజీ మంత్రి కృష్ణా యాదవ్ నెలకొల్పిన గౌలిగుడ క్రికెట్ క్లబ్‌ను ఆయనకు తెలియ కుండా సంతకం ఫోర్జరీ చేసి శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరిట ఓ క్లబ్‌ను తన వారిచేత తప్పుడు పత్రాలతో జగన్‌మోహన్‌రావు ఏర్పాటు చేసినట్లు సిఐడి తే ల్చింది. దీని తరువాత ఇందులో తన వారినే నియమించి, తాను సభ్యుడుగా చేరి, ఆరు నెలలకే హెచ్‌సిఎ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందడం అం తా డ్రామాగా వుందని సిఐడి తేల్చింది. ఈ నేపథ్యంలో హెచ్‌సిఎ గోల్‌మాల్ వ్యవహారాలపై లోతుగా విచారించేందుకు నిందితులను ఆరు రోజుల క స్టడీలోకి తీసుకున్న సిఐడి అధికారులు అన్ని కోణాల్లో విచారించారు. విచారణలో భాగంగా నిందితులను ఉప్పల్ స్టేడియంకు తీసుకువెళ్లి అక్కడి రి కార్డులను వారి ఎదుట వుంచి ప్రశ్నించి అన్ని విషయాలను నిగ్గు తేల్చారు. ఈ కేసులో పరారీలో వున్న మరో నిందితుడు దేవరాజ్ కోసం ఇంకా గాలిస్తున్నారు. అతని సెల్‌ఫోన్లు స్విచాఫ్ చేయడంతో గాలింపు కష్టంగా మారింది.

దేవరాజ్ విదేశాలకు పారిపోకుండా వుండేందుకు అతని పాస్ పో ర్టును రద్దు చేసినట్లు తెలిసింది. దేవరాజ్‌కు ఇతర రాష్ట్రాల్లో అనుచరులు, బంధువులు వుండడంతో ఇతర ప్రాంతాలలోనూ గాలిస్తున్నారు. ఇతను ప ట్టుబడితే హెచ్‌సిఎ గోల్‌మాల్‌లో మరిన్ని విషయాలు వెలుగుచూసే వీలుంది. మరోవైపు ఈ కేసులో ఐదుగురు నిందితులు కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారిస్తామని కోర్టు పేర్కొంది.

## కిడ్నీ రాకెట్ కేసులో సూత్రధారి డాక్టర్ పవన్ అరెస్టు

హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన సరూర్‌నగర్ అలకనంద ఆసుపత్రి కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి కీలక నింది తుడు, సూత్రధారిగా వున్న డాక్టర్ పవన్‌ను సిఐడి అధికారులు అరెస్టు చేశారు. ముంబాయిలో రహస్యంగా వుంటున్న ఇతన్ని మంగళవారం నాడు అరెస్టు చేశారు.

గత జనవరి నెలలో వెలుగు చూసిన ఈ గోల్‌మాల్ రాకెట్‌లో అలక నందతో పాటు జనని, అరుణ అనే మరో రెండు ఆసుపత్రుల పాత్ర వున్నట్లు వెలుగు చూడడం తెలిసిందే. ఈ రాకెట్‌లో తమిళనాడు, కర్నాటక, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వైద్యులతో పాటు వైద్య సహాయక సి బ్బంది పాత్ర వున్నట్లు నిర్ధారణ అవడం విదితమే. ఈ కేసులో మొదట అలకనంద ఆసుపత్రి ఎండి డాక్టర్ సుమంత్‌తో పాటు, అలకనంద ఆసుప త్రి రిసెప్షనిస్టు గోపిలను అరెస్టు చేయగా ఆ తరువాత ఈ రాకెట్‌లో కీలక సూత్రధారి అయిన డాక్టర్ అవినాష్‌తో పాటు ఆపరేషన్ల సమయంలో స హాయకులుగా వున్న కర్నాటకు చెందిప పొన్ను స్వామి ప్రదీప్, సూరజ్ మిశ్రా, నల్లగొండకు చెందిన సపావత్ రవీందర్, రమావత్ రవి, సపావత్ హ రీష్, పొదిల సాయిలను అరెస్టు చేశారు. దీని తరువాత ఈ కేసు విచారణ సిఐడి బదిలీ అయ్యింది. ఈ కేసులో నిందితులు దేశ వ్యాప్తంగా అనేకప్రాంతాలలో వుండడంతో సిఐడికి బదలాయించారు. సిఐడి విచారణ చేబట్టాక కొందరు నిందితులు పట్టుబడగా తాజాగా డాక్టర్ పవన్ దొరికిపోయాడు.

పవన్‌పై వైజాగ్‌లోనూ కేసులున్నట్లు సిఐడివిచారణలో తేలింది. వైజాగ్ లో నమోదైన కేసులో పవన్ తనకు బదులు మ రొకరిని జైలుకు పంపినట్లు తేలింది. ఇందుకు గానూ అతను తప్పుడు పత్రాలను సృష్టించాడు. కాగాఅలకనంద ఆసుపత్రిలో గత ఏడాది డిసెం బర్ వరకు 20కిడ్నీ ఆపరేషన్లు జరిగాయని సిఐడి తేల్చింది. ఈ కేసులో మరికొందరు నిందితులు పట్టుబడాల్సి ఉంది.

## నడ్డా, నిర్మలా,గడ్కరీ,రాజ్‌నాథ్ సింగ్‌లను కలిసిన రాంచందర్‌రావు

### కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పలు అంశాలపై చర్చ

హైదరాబాద్, జూలై 22 ప్రభాతవార్త: బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఢిల్లీ పర్యటన విజయవంతం అయింది. రాష్ట్ర అధ్యక్షు డిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాంచం దర్ రావు తొలిసారిగా ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ పర్యటనలో బిజెపి జాతీయ నాయకత్వాన్ని మర్యాదపూ ర్వకంగా కలిసిన ఆయన, పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేయడంపై కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు.

అనంతరం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) సంతోష్, జాతీయ సహ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శివప్రకాష్, పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ సునీల్ బన్సల్, జాతీయ కార్యదర్శి అర్‌విండ్ మీనన్‌తో సమావేశమయ్యారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి



కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే దిశగా జాతీయ నాయకులు కీలక సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులతోనూ రాంచందర్ రావు సమావేశమ య్యారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర రోడ్డు రవాణ, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ని కలిసిన ఆయన రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర పథకాల అమలు వంటి ప్రజల ప్రయోజనాలను గూర్చి చర్చించారు. ఈ పర్యటనలో బిజెపి జాతీయ నాయకత్వం పూర్తి మద్దతు అందిస్తుందని స్పష్టం చేసింది. తెలంగాణలో బిజెపిని బలోపేతం చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన వైఫల్యాలను ప్రజల్లో బహిర్గతం చేయడంతో పాటు ప్రజాస మస్యలపై పోరాటాలు చేసేలా స్పష్టమైన మార్గదర్శనం లభించింది. రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసిన తర్వాత రాంచందర్ రావు ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు.

## బిసిలను మోసం చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోంది

### బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

హైదరాబాద్, జూలై 22 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారం మరోసారి బిసిలను మోసం చేసేలా కొనసాగుతుందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బిసిలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక, దానినుంచి తప్పించుకోవడానికి ఇతర పార్టీలపై నిందలు వేయాలని చూస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వే షన్లు కల్పిస్తామని చెబుతూనే, కొందరు అడ్డుకుంటున్నారంటూ ప్రచారం చేస్తూ మోసం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో బిసిలకు అనేక హామీలు ఇచ్చిం దన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిందన్నారు. ప్రతి సంవత్సరం సబ్ ప్లాన్ నిధుల కింద రూ. 20 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని హామీ ఇచ్చిందని,రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిందన్నారు. మేము కూడా ఆ హామీ అమలు చేస్తుందేమోనని అనుకున్నాం కానీ శాసనసభలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విష యంలో చర్చ జరిగినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వా నికి మేము స్పష్టంగా చెప్పామని, మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అన్నారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో తీర్పులు కూడా ఇచ్చిందన్నారు. బిసిల పేరుతో ముస్లిం మైనారిటీలను చేర్చడం ద్వారా రాష్ట్రంలో 56 శాతం ఉన్న బిసిలకు అన్యాయం జరుగుతుం దన్నారు. ఈ అంశంపై న్యాయనిపుణులతో చర్చిం చాలని మేము చెప్పామన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లుకు బిజెపి సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు.

కాంగ్రెస్‌పార్టీ ప్లాన్ ప్రకారమే ఈ విషయంలో మరోపార్టీని నిందించేలా ప్రయ త్నిస్తుందని మండిపడ్డారు. బిసిలకు సబ్‌ప్లాన్ కింద సంవత్సరానికి రూ. 20వేల కోట్లు కేటాయిం చడంలో ఏ షెడ్యూల్‌అడ్డొచ్చింది? అని ప్రశ్నిం చారు. కానీ రాజకీయంగా ఒక పార్టీని బద్నాం చేసి పబ్బం గడుపుకోవాలనే ప్రయత్నం చేస్తుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల విష యంలో సెక్షన్ 285లో సవరణలు చేయాల న్నారు. ఆ సవరణను రాష్ట్ర శాసనసభ చేయా లని, దీనిపై దృష్టి పెట్టి న్యాయనిపుణులతో చర్చించాలని మేము చెప్పినప్పటికీ కాంగ్రెస్ ప్రభు త్వం నుంచి సమాధానం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పిసిసి అధ్యక్షుడిగా ఒక బిసిని నియ మించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి, నిజంగా బిసిల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రిని బిసి సామాజిక వర్గానికి చెందిన వారిని ఎందుకు చేయలేదు? అన్నారు. బిసిలను మోసం చేయాలనుకుంటే బిసిలు క్షమించరు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఒక్కసారైనా బిసి వ్యక్తిని ముఖ్యమం త్రిగా చేసిన దాఖలాలు లేవన్నారు. బద్నాం చేసి పబ్బం గడుపుకోవాలనే దురుద్దేశ్యాన్ని విడిచి పెట్టాలన్నారు.

## తక్కువ కాలం అధికదిగుబడుల వెదురు విత్తనం

హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త: పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడుల నేపథ్యంలో రైతులు దీర్ఘకాలిక ఆదాయాలనిచ్చే పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నందున అందుకు అనుగుణంగా ఉద్యాన శాఖ కొత్త వంగడాలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా అధికారులు కొత్త వంగడాలను అందుబాటులోకి తెస్తున్నారు. తక్కువ కాలంలోనే అధిక యేండ్లపాటు ఆదాయాలనిచ్చే వెదురు మొక్కలో కొత్తరకం విత్తనాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ కొత్తరకం వెదురు విత్తనాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ ఫ్రూట్స్ అధికారులు తెచ్చి రైతుల కు ఉచితంగా సరఫరా చేయాలని ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు కొత్తరకం వెదురు మొక్కలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సీఈవో శ్రీధర్ తెలిపారు.

ఈ కొత రకం విత్తనాలను త్రిపుర నుంచి తెప్పించామని పేర్కొన్నారు. ఆగస్టులో వీటిని పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు.

## ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఈ యేడాది నుంచే డిగ్రీ కోర్సులు!

### నాలుగు కోర్సుల్లో ప్రవేశాలు, దోస్త్ ద్వారా చేపట్టే అవకాశం

హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది వరకు కొత్తగూడెంలో కొనసాగిన మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని కాస్త ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఆ తరువాత రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సుల్లో మూడు కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోవడానికి అనుమతించింది. ఇప్పుడు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఈ ఏడాది నుంచి డిగ్రీ కోర్సులను కూడా ప్రారంభించాలని నిర్ణయించింది. అందులో భాగంగా నేడు(బుధవారం) యూనివర్సిటీకి సంబంధించిన సమావేశం జరగనున్నట్టు తెలిసింది. యూనివర్సిటీలో ఈ ఏడాదిలో బిఎస్‌సిలో బిఎస్‌సి జియోలజీ, బిఎస్‌సి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బిఎస్‌సి జియో ఫిజిక్స్, బిఎస్‌సి జియో కెమెస్ట్రి కోర్సుల్లో ప్రవేశాలను తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన నిర్ణయాన్ని నేడు జరిగే సమావేశంలో తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే వీటిలో అడ్మిషన్లను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో దోస్త్-2025లో భాగంగా స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ చేపట్టనున్న నేపథ్యంలో.. స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. నాలుగు కోర్సుల్లో ఒక్కో కోర్సులో సుమారు 60 సీట్ల చొప్పున 240 సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిసింది. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసిగా విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా కొనసాగుతున్నారు.



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాతున్న మందకృష్ణ మాదిగ

## దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### ఆగస్టు 13న ఎల్బీస్టేడియంలో 'దివ్యాంగుల గర్జన'

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త: దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పెద్దలు ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు రూ.8వేలు, చేయూత పింఛన్ ద్వారా వృద్ధులు, వంతువులకు రూ.4వేలు పెంచి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా పెంచిన పింఛన్లు ఇవ్వలేదని విమర్శించారు. కేవలం పాత పింఛన్లు అది కూడా ప్రతి నెలా సక్రమంగా అందజేయడం లేదన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యమంత్రి ఏ తారీఖు వేతనాలు తీసుకుంటున్నారో ప్రజలకు చెప్పాల న్నారు. దివ్యాంగులకు నాలుగు శాతం సీట్లు కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కనీసం ప్రకటన కూడా చేయడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు మొదటి వారంలోపు పెంచిన పింఛన్లు అందించాలని, లేని పక్షంలో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 13న ఎల్బీ స్టేడియంలో పెద్ద ఎత్తున దివ్యాంగుల గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మున్సిపల్ వార్డ్ ఆఫీసర్స్‌కి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలి

### మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శికి గ్రూప్-4 వార్డ్ ఆఫీసర్స్ విజప్తి

హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపి ఎస్సి) ద్వారా గ్రూప్-4 పరీక్ష రాసి మున్సిపల్ శాఖలో వార్డ్ ఆఫీసర్స్‌గా ఎంపికైన వారికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రూప్-4 ద్వారా వార్డ్ ఆఫీసర్స్‌గా ఎంపికైన వారు మంగళవారం మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. టిజిపిఎస్‌సి నిర్వహించిన గ్రూప్-4 పరీక్ష దారి మున్సిపల్ వార్డ్ ఆఫీసర్స్‌గా ఎంపికైన వారు తమకు జూనియర్ అసిస్టెంట్ వేతనాలను అమలు చేయాలని కోరారు. గ్రూప్-4 పరీక్ష రాసి జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన వారి రూ. 24,380 నుంచి రూ. 72,850 వేతనం పొందుతున్నారని.. అలాగే అదే గ్రూప్-4 పరీక్ష ద్వారా వార్డ్ ఆఫీసర్స్‌గా ఎంపికైన తమకు మాత్రం పే స్కేల్‌ను రూ. 22,240 నుంచి రూ. 67,300గా నిర్ణయించారని గుర్తు చేశారు. ఒకే పరీక్ష ద్వారా ఎంపికైనప్పటికీ తమ మధ్య వేతన వ్యత్యాసం ఉందని మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు.

తాము కూడా డిగ్రీ పూర్తి చేసి టిజిపిఎస్‌సి నిర్వహించిన గ్రూప్-4 పరీక్ష ద్వారా ఎంపిక కాబడిన వారమని.. కాబట్టి తమకు కూడా జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌నను అమలు చేయాలని కోరారు. వేతనం వ్యత్యాసంగా ఉండటంతో అనేక అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని విన్నవిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్స్, ట్రేడ్ లైసెన్స్, శానిటేషన్, భువన్ సర్వే తదితర బాధ్యతలు నిర్వహిస్తూ మున్సిపాలిటీల రెవెన్యూ పెంచడానికి కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ అర్హతతో నియామకైన వారికి సాధారణంగా జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌ను.. ఇంటర్ అర్హతతో నియామకైన వారికి రికార్డ్ అసిస్టెంట్ పే స్కేల్‌ను అమలు చేస్తుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో తాము డిగ్రీ అర్హతతో నియామకైనందున తమకు అందుకు తగ్గట్లుగా జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ సవరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకి, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ క్షేత్రస్థాయిలో విధులను నిర్వర్తిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 1862 మంది వార్డ్ ఆఫీసర్స్ పే స్కేల్‌ను సవరించాలని కోరారు.

**నిందితుడైన ఒక వ్యక్తి హాజరు కోరుతూ బహిరంగ ప్రకటన**

(సెక్షన్ 82 Cr.PC చూడండి)

ఇది ఇలా ఉండగా, నిందితుడైన జిమిడో అంజయ్య పేరు గల వ్యక్తి R/o. ఇం.నం. 11/42 మెయిన్ రోడ్ చంద్రుపట్ల వాజీడు, ఖమ్మం జిల్లా, తెలంగాణ 507136, CT/FIR No.808/2018 U/S 138 NI చట్టం కేసులో PS చిత్తరంజన్ పార్క్, ఢిల్లీ వద్ద నేరం చేసినట్లు (లేదా చేసినట్లుగా అనుమానించబడి) నా ఎదుట ఫిర్యాదు వేయబడింది. మరియు ఆపై, అరెస్ట్ యొక్క వారంట్, సదరు నిందితుడు జిమిడో అంజయ్యకు జారీ అయినది, అతడు కనబడలేదని తిరిగి వచ్చింది. మరియు ఇది ఇలా ఉండగా సదరు నిందితుడు జిమిడో అంజయ్య తప్పించుకొని పారిపోయాడని (లేదా సదరు వారంట్ సెర్వీస్ తప్పించుకోవటానికి తాను రహస్యంగా దాక్కున్నాడని) నాకు సంతృప్తి కలిగేటట్లు చూపబడింది. CT/FIR No.808/2018 U/S 138 NI చట్టం యొక్క PS చిత్తరంజన్ పార్క్, ఢిల్లీ వద్ద సదరు నిందితుడైన జిమిడో అంజయ్య, 04-09-2025న లేదా ముందు, సదరు ఫిర్యాదుపై సమాధానానికి ఈ కోర్టు ఎదుట హాజరు కావలసిన అవసరం వుందని ఇందుమూలముగా బహిరంగ ప్రకటన చేయడమైనది.

ఉత్తర్వు చే
దేవాన్ని జన్మేజా
జుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్-04
సౌత్ ఈస్ట్ డిస్ట్రిక్ట్ కోర్ట్ నం. 10,
సాకేత్ కోర్ట్స్, న్యూఢిల్లీ.

DP/9509/SD/2025

వార్త


ఆకారాన్ని మాత్రమే చూసి మంచి చెడ్డలు నిర్ణయించుకునేవారు సంకుచిత స్వభావులు మాత్రమే.

-ఆస్కార్ వైల్డ్

# కీలుబొమ్మలుగా మారొద్దు!

స్వతంత్ర ప్రతిపత్తితో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఈడీలు రాజకీయ క్రీడలో పావులుగా మారి తమకు సంబంధం లేని విషయాల్లో తలదూర్చి దూకుడు ప్రదర్శించినప్పుడల్లా న్యాయస్థానాల చేత మొట్టికాయలు తింటూనే ఉన్నాయి. ఇలాంటి అంశాలను క్రోడీకరిస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ తమ అధికారాలను, విధులను దుర్వినియోగం చేస్తోందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్‌గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేసింది. ఇది తాజా అంశం ఇంతకు ముందు ఎన్నోసార్లు ఈ కేంద్ర దర్యాప్తు సంస్థల రాజ కీయ ఒత్తిడులకులొంగి చేసిన నిర్వాకాలను సుప్రీంకోర్టు తీవ్రంగానే మందలించింది. ప్రస్తుత 'ముడా' (మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ)భూ కేటాయింపుల కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య శ్రీమతి బిఎం పార్వతికి వ్యతిరేకంగా ఈడీ జారీ చేసిన సమన్లను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టులోని ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సోమవారం నాడు సుప్రీంకోర్టు ధర్మా సనం సమర్థించింది. హైకోర్టులో వచ్చిన తీర్పుకు సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌లో ఉన్నత ధర్మాసనం తమ పరిశీలనకు లోబడే కొన్ని విమర్శలు చేసింది. అవే కేంద్ర దర్యాప్తు సంస్థల నిర్వాకాన్ని,వాటిని తమకనుకూలంగా వాడుకోజూసిన పార్టీల ఆలోచనలను సుప్రీం ధర్మాసనం ఎండగట్టింది. ఈసారి అక్షింతలు వేయించుకునే వంతు 'ఈడీ'దయ్యింది. ఇంతక్రితం 2013లో సిబిఐని 'పంజరంలో చిలక'గా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్నది మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం. కేంద్రంలో ఏ పార్టీ, ఎవరు అధికారంలో ఉన్నా సుప్రీంకోర్టు ఒకే రకంగా వ్యాఖ్యానిస్తోందంటే వ్యవస్థలో ఉన్న లోపం ఇప్పటికీ సరికానట్లే! ప్రజాస్వామ్యానికి ప్రధాన స్తంభంగా వినుతికెక్కిన న్యాయవ్యవస్థ ఇతర వ్యవస్థల్లోని లోపాలను ఎత్తిచూపి న్యాయబద్ధంగా చట్టబద్ధంగా పనిచేసేందుకు ఓ 'ములుకర్ర' లా వ్యవహరిస్తుంటుంది. సిబిఐ ఈడి కేంద్ర దర్యాప్తు సంస్థలు నియమబద్ధంగా చట్టాలు,న్యాయ విధానాలకు లోబడి తమ దర్యాప్తులో ఎవరి జోక్యం లేకుండా పనిచేయాలి. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి. వీటన్నిటినీ వదిలిపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చిచ్చు రాజేసే పనులకు తోడ్పడుతున్నాయనో, రాజకీయ ప్రమేయంతోనో కేసుల వ్యవహారాలను ముందుకు తీసుకుపోతున్నాయనో ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తోంది. తాజాగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య కుటుంబాన్ని అప్రతిష్ట చేసే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను దురద్దేశపూర్వకంగా తమ రాజకీయ పోరాటాలను వాడుకుంటోందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒకరోజు ముందు మరో కేసులోఈడీని మద్రాసు హైకోర్టు కూడా ఇదేమాదిరి మందలించింది. కర్ణాటక ఎస్ఎల్‌పిలో అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీరాజు సుప్రీం కోర్టు వేసిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోవడంతో 'రాజకీయ స్వప్రయోజనాల కోసం, విపక్ష పార్టీలపై కక్ష సాధింపు కోసమే ఈడిని దుర్వినియోగం చేస్తున్నట్లు అనిపిస్తోందని సుప్రీం స్పష్టంగానే వ్యాఖ్యానించింది. దేశమంతటా ఈడిని ప్రత్యర్థులపై ఉసికొల్పే 'రాజకీయ' క్రీడకు ఆస్కారమివ్వద్దని గట్టిగానే హితవు చెప్పింది. రాజకీయ యుద్ధాలు ఎన్నికల వేదికల మీదనే తప్ప బయట వేసే ధోరణి మంచిదికాదని, ఇదే కొనసాగితే తాము కఠిన చర్యలు తీసుకుంటామని ఈడిని హెచ్చరించారు. ఇలా కోర్టుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలకు చీవాట్లుపడినప్పుడల్లా ప్రత్యర్థి పార్టీలు తమవంతుగా తీర్పులను వ్యాఖ్యాలను స్వాగతిస్తుంటారు. ఇప్పుడూ అదే జరిగింది. అటు వారు ఇటైనా, ఇటువారు అటైనా అధికార, విపక్షపార్టీలస్పందన ఇలాగే ఉంటుంది. ఆ సంస్థ కార్యకలాపాల్లో అనవసర జోక్యాలు,అధికార దుర్వినియోగాలు బయటపడ్తుంటాయి. అంతవరకు మీమాంసలతో చర్చించుకునే పజాబాహుళ్యానికి అసలు విషయాలు తేటతెల్లమవుతుంటాయి. న్యాయ సమ్మతంగా వ్యవహరించి ఉంటే గతంలో ఎన్నో సందర్భాల్లో 'కోర్టు మంద లింపు'లకు గురైన 'ఈడీ' వ్యవహారం మరోసారి ఇప్పుడు కోర్టు ముందు నవ్వులపాలు కాదు. గతంలో మహారాష్ట్ర లో జరిగిన అనుభవాన్ని కూడా జస్టిస్ బిఆర్‌గవాయ్ ఈ కేసు సందర్భంగా ఉటంకించారు. అంటే 'చర్విత చరణం'గా తప్పులు చేసే పద్ధతి మారాలని సూచించినట్లే. కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు కూడా ఈడి నోటీసులందించి మరో అద్భుతం సృష్టించింది. ఈ కేసును కూడా సుప్రీం ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించి, ఈ అంశంపై 'అమికస్ క్యూరీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రభావితం చేసే వర్గాలపై ఈడీ నోటీసుల వ్యవహారాన్ని కూడా ధర్మాసనం సీరియస్‌గా తీసుకొంది. తమ దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్నీ దర్యాప్తు చేయడానికి మీరేం సూపర్ కాప్‌కాదు. డ్రోన్‌లా ఎగిరిపోనక్కర్లేదని ఈడీని మద్రాస్ హైకోర్టు అంతకుముందు రోజే హెచ్చరించింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ చెన్నైకి చెందిన ఓ పవర్ జనరేషన్ సంస్థకు చెందిన రూ. 901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సీజ్‌చేసిన విషయంలో కాస్త తీవ్రంగానే మందలించింది. రాజకీయ ఉద్దేశ్యాల ప్రేరణతో చేపట్టేవన్నీ తాత్కాలిక వేధింపులకే తప్ప తుదకంటా నిలవవని ఎన్నో సందర్భాల్లో తేలినందున స్వచ్ఛమైన నియమ నిబద్ధమైన ఆలోచనలతో కేసులు స్వీకరించిదర్యాప్తు చేయలేకపోతే ఆయా సంస్థలు నవ్వులపాలు కాక తప్పదు.

మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్యకానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లిని

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### సమన్వయంతో పని చేయాలి

జూన్ 2025లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి తగ్గినట్టు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించడం కొంత ఊరట కలిగించినా, ఇది తాత్కాలిక ఉపశమనంగా మాత్రమే పరిగణించాలి. గత నెలల్లో ఆహారధరలు, నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరగడంతో మధ్య తరగతి, పేదవర్గాలు తీవ్ర ఆర్థికఒత్తిడిని ఎదుర్కొన్నారు. బియ్యం, కూరగాయలు,పాలు వంటిమౌలికావసరాలధరలు సామాన్యుడికి అధిక భారం మోపుతున్నాయి. ఇది ఆరోగ్యంపై, విద్యపై, జీవన నాణ్యతపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. చిన్నారులు,మహిళలు పోషకాహారం నుండి దూరమవుతున్నారు. ఇది ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేయాల్సిన అంశం. ధరల నియంత్రణకు సరఫరా గొలుసును బలోపేతం చేయాలి.వృద్ధి లక్ష్యాలను కొనసాగిస్తూ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### జాలర్ల జీవితాలకు కొత్తబాట వేయాలి

కచ్ఛతీవు వివాదం ఎన్నికలమ్యానిఫెస్టోకు పరిమితం కావడంవిషాదం.ఎప్పుడో ఇందిరాగాంధీ పీరియడ్‌లో కుదిరిన ఒప్పందం పైన ఇప్పుడు వివాదాలు రేపడం జాలర్ల జీవితాలకు సంబంధించిన అంశం కావడం బాధాకరం. నేడు అది రాజకీయ అస్త్రంగా మారడం విషాదం. బిజెపి ప్రభుత్వం కొత్తతరహా విదేశాంగ విధానానికి రూపకల్పన చేశామని చెపుతున్నారు కదా. విదేశాంగ నిపుణులను ఆర్థిక వేత్తలను, కోస్టాల్ ఏరియా నిపుణులను, ఇరు దేశాల పౌర హక్కుల ఉద్యమ కారులను, నియమించి వేలాది జాలరుల జీవితాలకు కొత్త బాట వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### సంప్రదాయాన్ని పాటించాలి

ఈకాలంలో ఆడపిల్లలు బాగా చదువు కోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన తరువాత వారికి వంట చేయడం చేత కావట్లేదు. వివాహమైన తరువాత చాలా శ్రమపడవలసి వస్తోంది. ఏకూర ఎలా చేయాలనేది తెలియక చరవాణిలోవంటలు యాప్‌లనుచూసిచేస్తున్నారు.లేదా బయటనుంచి ఆర్డర్లు పెడుతున్నారు. ఆడపిల్లలకు అన్ని రకాల వంటలను చిన్నప్పటి నుండే నేర్పడం మొదలు పెట్టాలి.

- కె. రామకృష్ణ, సికింద్రాబాద్

### విత్తనాలను సరఫరా చేయాలి

రోజు రోజుకు కూరగాయలు,పండ్ల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.రాష్ట్రప్రభుత్వం అన్నిగ్రామాల్లో,పట్టణాల్లోప్రతి ఇంట్లో, అపార్ట్మెంట్ లలో కూరగాయలు, పండ్ల చెట్లను నాటేవిధంగా ప్రభుత్వమే కూరగాయల విత్తనాలు,పండ్ల చెట్లను నామమాత్రపు ధరకు పంపిణీ చేయాలి.అలా పంపిణీ చేయడానికి పట్టణాల్లో,గ్రామాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల ద్వారా ప్రచారంచేయాలి. చెత్తసేకరించే వారిద్వారా ప్రతి ఇంటికి కూరగాయల విత్తనాలను,పండ్ల చెట్లను పంపిణీ చేయాలి. మున్సిపల్ శాఖ,గ్రామ పంచాయతీలు సేకరించిన చెత్త ద్వారా తయారుచేసినవర్మికంపోస్ట్‌ను నామమాత్రపు ధరకుపంపిణీ చేయాలి. తద్వారా తెలంగాణ రాష్ట్రం కూరగాయలు, పండ్లు పండించడం, ప్రజలందరికీ చౌక ధరలకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందేవిధంగా చేయవచ్చు. ప్రజలు తమకు సరిపోను మిగిలిన కూరగాయలు పండ్లను తక్కువ ధరకు మున్సిపల్ శాఖ, గ్రామ పంచాయతీల ద్వారా సేకరించి మార్కెట్‌కు తరలించవచ్చు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పించాలి.

-సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### పార్కింగ్ ఏరియా ఉండాలి

మన పట్టణాలు, నగరాలలోని కాలనీలలో అనేక మంది తన కార్లను తమ ఇళ్ళలో కాకుండా రోడ్డుపై నిలుపు చేస్తున్నారు. దీని వల్ల రోడ్లు ఇరుకై నడిచే వారికి, వాహనాలు నడిపే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్లను కొనుక్కుని తమ ఇంటిలో కాకుండా రోడ్ల మీద పార్క్ చేయటం ఇతరులను ఇబ్బందులకు గురి చేయటమే అవుతుంది. వినియోగదారులు కార్లు కొనేటప్పుడు కానీ, రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పుడు కానీ, కారు కొనుక్కునే సదరు వినియోగదారునికి తమ ఇంటిలో పార్కింగ్ సదుపాయం ఉందని చూపే ఋజువు ఉంటేనే వాహానాన్ని రిజిస్టర్ చేయాలనే విధానం ప్రభుత్వాలు వెంటనే ప్రవేశపెట్టాలి.ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

టీఎస్‌ఆర్టీసీ బస్సుల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతుంది. బస్సులు తప్పకుండా సమయపాలన పాటించాలి. బస్టాండులో టైమ్ టేబుల్ బోర్డు లు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు సరి అయిన సమయంలో సురక్షితంగా వెళ్లడానికి బస్సుల సమయ పాలన అవసరం.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ఇ-దర్శన్ కేంద్రాలతో ప్రయోజనమే..

**తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడీ ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒక ప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి.**

అప్పన్న గొనప

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అనేది కోట్లాది మంది హిందూ భక్తుల జీవిత లక్ష్యంగా మారిన పవిత్రతతో కూడిన ఆధ్యాత్మిక యాత్ర. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ శ్రద్ధతో, నమ్మకంతో పాల్గొంటారు. దేశమంతటా, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది భక్తులు తిరుమలకు వచ్చి శ్రీవారి కృపను పొందాలనుకుంటారు. ఈ ఆధ్యాత్మిక యాత్రను సులభతరం చేయడం, భక్తులకు ఏ విధంగానైనా ఇబ్బందులు కలగకుండా చూడడం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రధాన బాధ్యత. ఈ క్రమంలో ఒకప్పుడు ప్రారంభించిన 'ఈదర్శన్' కేంద్రాలు ఎంతో కాలం పాటు భక్తులకు సహాయకరంగా నిలిచాయి.కానీ గత ఏడు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా 100కు పైగా ముఖ్య ప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలను పూర్తిగా మూసివేయడం వల్ల లక్షలాది సామాన్య భక్తులకు అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. భక్తుల ప్రయాణం ఆధ్యాత్మిక పథంగా కాకుండా ఒక నిరాశాజనకమైన సమస్యల యాత్రగా మారుతోంది. 'ఈదర్శన్' కేంద్రాల మూసివేత అనేది సాధారణమైన పరిపాలనా చర్యకాదు. ఇది లక్షలాది మంది సామాన్య ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష ప్రభావాన్ని చూపే నిర్ణయం. గతంలో ఈ కేంద్రాల ద్వారా భక్తులు స్వయంగా తమ పట్టణ, జిల్లా కేంద్రాల ద్వారా దర్శన టికెట్లు, ఆర్జిత సేవల టికెట్లు వసతి గదుల బుకింగ్ చేసుకునే సదుపాయం కలిగి ఉండేవారు. అంతేకాదు,ఇందులో పని చేసే టీటీడీ సిబ్బంది భక్తులకు సహాయంగా ఉండి అవసరమైన సమాచారం అందించేవారు. పెద్దవారికి, వికలాంగులకు, టెక్నాలజీపై అవగాహనలేని వారికి ఇది ఒక దైవ ప్రసాదంగా భావించవచ్చు. అయితే ప్రస్తుతం టీటీడీ టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అందిస్తోంది. అంటే భక్తులు తిరుమల దర్శనానికి ముందు మూడు నెలల పాటు వేచి ఉండి, ఆన్‌లైన్‌లో టికెట్ పొందాల్సిన అవసరం ఏర్పడింది. ఇది సాంకేతికంగా అందరికీ సాధ్యపడే పనికాదు. స్మార్ట్‌ఫోన్లు లేని వారు, ఇంటర్నెట్ బాగా వాడలేని వారు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు, లేదా చదువురాని వృద్ధులు - వీరంతా తిరుమల దర్శనం పొందేందుకు ఇప్పుడు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ పరిస్థితిలో, చాలా మంది భక్తులు స్థానికంగా ఉన్న ఇంటర్నెట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కానీ అక్కడ వారు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరికొంతమంది దళారుల చేతుల్లో మోసపోతున్నారు. దర్శనానికి ఉచితంగా లేదా తక్కువ ధరకు లభించాల్సిన టికెట్ల కోసం వేల రూపాయలు చెల్లించే పరిస్థితులు కనబడుతున్నాయి. వీటితో పాటు వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు వంటి ప్రత్యేక వర్గాల భక్తులకు కూడా టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందించడం వల్ల వారు ప్రత్యక్షంగా తిరుమల కొండపైకి వచ్చి టికెట్ల కోసం వేచిఉండాల్సి వస్తోంది. ఇది వారి ఆరోగ్యానికే కాకుండా భక్తి భావనకూ ఎదురుదెబ్బలాంటిదే. టీటీడీ తమ సేవలన్నింటిని ఆన్‌లైన్‌లోకి మార్చడం ఒక ఆధునికీకరణ చర్యగా భావించవచ్చు. కానీ ప్రతి ఆధునికతను ప్రజల అవసరాలకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. అన్ని వర్గాల ప్రజలు



ఒకే స్థాయిలో డిజిటల్ ప్రపంచాన్ని వాడలేరు. భక్తులలో చాలా మంది పేదలు, గ్రామీణ ప్రాంతాలవారు, వృద్ధులు, నిరక్షరాస్యులు ఉంటారు. వీరందరికీ ఆన్‌లైన్ టికెట్లప్రక్రియ పూర్తి చేయడం చాలా కష్టంగా మారుతుంది. వారు అవసరమైన సమాచారం పొందడానికే కాదు, సరైన విధంగా గది బుకింగ్ చేసుకోవడానికి కూడా ఇతరులపై ఆధారపడుతున్నారు.ఇది వారిని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. భక్తుల ఈ పరిస్థితిని గుర్తించి, తిరిగి ప్రత్యక్ష సేవల విధానాన్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో, ఒక ప్రత్యేకమైన పథకాన్ని రూపొందించి, భక్తులందరికీ టికెట్లను పునరుద్ధరించిన ఈదర్శన్ కేంద్రాల ద్వారా అందించే విధంగా టీటీడీ కార్యాచరణ రూపొందించాలి. ప్రతి జిల్లాలో కనీసం ఒకటి, ప్రధాన పట్టణాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా భక్తుల సమస్యలకు పరిష్కారం చూపవచ్చు. తిరుమల యాత్ర అనేది ఒక ఆధ్యాత్మిక యాత్ర. భక్తులు తమ మనోభావాలను, శ్రద్ధను తీసుకొని స్వామివారి సన్నిధికి చేరుకుంటారు. అలాంటి యాత్రను ఆధునిక సాంకేతికత పేరుతో ఒక టెక్నికల్ కాంప్లికేషన్‌గా మార్చకూడదు. ప్రతి భక్తుడూ సమానంగా స్వామివారి దర్శనం పొందేహక్కు కలిగి ఉన్నాడు. ప్రత్యక్ష టికెట్ల విక్రయ కేంద్రాలు లేకుండా, భక్తులను ఆన్‌లైన్‌కు పరిమితం చేయడంవల్ల, వారి ఆధ్యాత్మిక యాత్ర అర్థరహితంగా మారుతోంది.కొన్ని నిమిషాల్లోనే అన్నిటికెట్లు బుక్ అయిపోవడం, సర్వర్లు డౌన్ కావడం, ఫోన్లో సిగ్నల్స్ రాకపోవడం వంటి సమస్యలు ప్రతిరోజు ఎదురవుతున్నాయి. అలాంటి సమయంలో భక్తులుస్వామిని దర్శించాలన్న ఆకాంక్షను వదులుకుంటున్నారు. ఇది అత్యంత బాధాకరమైన స్థితి. ఈపరిస్థితి మారాలంటే తిరిగి ప్రత్య క్ష సేవల అందుబాటు రావాలి. ఈదర్శన్ కేంద్రాలను తిరిగి తెరవడం ఒక ముఖ్యమైన పరిష్కారమార్గం. వీటి ద్వారాభక్తులు భద్రతగా, సులభంగా, నమ్మకంగా తమ సేవలను పొందగలుగుతారు.ప్రభుత్వం టీటీడీ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యపట్ల టీటీడీ ధర్మకర్తల మండలి, అలాగే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. ఇది భక్తుల విజ్ఞప్తి మాత్రమే కాదు,ఒక సామాజిక బాధ్యత. లక్షలాదిమంది సామాన్యులు భగవంతుని దర్శించుకోవాలనుకుంటే, వారిని ఆన్‌లైన్ పద్ధతిలోనే బంధించడం సమంజసంగా ఉండదు. ప్రత్యక్ష సేవల ద్వారా భక్తులకు మరింత మానవీయత, నైతికత, నిబద్ధతతో కూడిన అనుభవం లభిస్తుంది. ప్రతి పట్టణంలో తిరిగి ప్రారంభించదగ్గ ఈదర్శన్ కేంద్రాలద్వారా భక్తుల ఆర్థికభద్రత కూడా కాపాడబడుతుంది. దళారులచేతుల్లో మోసపోవడం తగ్గుతుంది. అందువల్ల, ఈ సమస్యపై టీటీడీ ఒకకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సమీక్ష చేసి, భక్తులకు ప్రత్యక్ష సేవలు అందించే దిశగా ముందడుగు వేయాలి. ఈ కేంద్రాలను తిరిగి తెరిచి భక్తుల కష్టాలను తీర్చడంద్వారా టీటీడీ తనధర్మాన్ని నిర్వర్తించగలదు. తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడి ప్రభుత్వాల బాధ్యత.ఈబాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒకప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి. •

# మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

కామిడి సతీష్ రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో, పట్టణాలలో పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు మద్యాన్ని విక్రయిస్తున్నాయి. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతూ వున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ఏరులై పారుతున్నా అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తి చూడకుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తున్నాయి. అన్ని జిల్లాలలో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. కిరాణాదుకాణం నుంచి మొదలుకొని నివాసగృహాలు, పాన్‌షాపులు, కల్లు కాంపౌండ్‌ల సమీపంలో మద్యం ఏరులై పారుతోంది. భవననిర్మాణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తూ బెల్టు దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఆఫ్‌లుగా సాగిస్తున్నారు. గతంలో వైన్ షాపుల పరిసరాలలో కొనసాగిన ఈ దందా ప్రస్తుతం గల్లీకొకటి ఏర్పాటు కావడంతో మద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీలకు బదులుగా మద్యాన్ని తాగుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా ఉదయం పూట వాహనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతంలోనే ఓ కల్లు కాంపౌండ్ పరిసరాలలో పలువురు పాన్ షాపులు ఏర్పాటుచేసి అందులో బెల్టుదుకాణం నడిపిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. గుడుంబా విక్రయాలు మానేసిన వారికి ప్రభుత్వం ఓవైపు స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరో వైపు బెల్టు దుకాణాలు పల్లెలు, పట్టణ ప్రజలను మత్తులో ముంచుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. లిక్కర్ డాన్లు వివిధ జిల్లాల్లో కమీషన్లకు బెల్టు షాపుల వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. రోజుకు ఎంత అమ్మితే అంత కమీషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒకరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. ఉదయం



నుంచి సాయంత్రం వరకు ఈ దందాను బహిరంగంగా కొనసాగిస్తూ ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలు,పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుంటే మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టుదుకాణాలు జోరందుకున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలోనే మద్యం షాపులు కొనసాగుతున్నాయి. వివిధ మండలంలలోని కొన్ని గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది. అందులో బాటిళ్లను ఎంఆర్‌పీ కంటే రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు. కొందరైతే వాహనాలను ఉదయం సమయంలో తీసుకువచ్చి అడ్డకూలీలకు, ఇసుక ట్రాక్టర్ల మీద వెళ్లే కూలీలకు అమ్మకాలు జరుపుతున్నారు. వివిధ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్ల వద్ద గల కిరాణా దుకాణాలలో కల్తీమద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలుస్తోంది. అన్ని జిల్లాలలో ఈ దందా సంగతి తెలిసిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు సిబ్బందికి ప్రత్యేకంగా వారం, నెలకు చొప్పున ముడుపులు అందుతుండడంతో ఏదైనా ఫిర్యాదు రాగానే బెల్టు షాపుల నిర్వాహకులకు సమాచారం అందించి తనిఖీల విషయాలను చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తం అవుతున్న బెల్టు షాపుల వారు తనిఖీలలో ఏమీ దొరకకుండా జాగ్రత్త పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఈ బెల్టుదందాకు అడ్డుకట్ట పడడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.యువత మాత్రం నిత్యం వీటికి బానిసై ఒళ్లు గుల్ల చేసుకుని భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు.ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది.ఇకనయినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద ఉక్కుపాదం మోపాలి. •

# ట్రంప్ వాణిజ్య పన్నుల వార్ డైలాగ్‌లకే పరిమితమా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ ఉక్రెయిన్, రష్యా దేశాల మధ్య యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వానికి చేసిన పరిస్థితులు అనుకూలించకపోవడంతో, అత్యంత శక్తివంతమైన రష్యా దేశాన్ని ఒప్పించలేక చివరకు అమెరికా ఉత్పత్తులపై అంతర్జాతీయంగా వాణిజ్య వ్యాపార ఎగుమతులు దిగుమతులపై అధిక శాతం సుంకం(టారిఫ్ ) విధిస్తున్నట్లు ప్రకటించడం, రష్యా ఆర్థిక వ్యవస్థనీ పరోక్షంగా దెబ్బతీసే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్టు ఉన్నాయా అనేవాదనలు తెరపైకి వస్తున్నాయి. అంతేకాదు రష్యాతో ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార వాణిజ్య సంబంధాలు కలిగిన భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాలు ఉక్రెయిన్ రష్యా మధ్య జరుగుతున్న యుద్ధం ముగించే విధంగా రష్యాపై ఒత్తిడి చేయాలని, లేకుంటే భారత్, బ్రెజిల్, చైనా దేశాలపై వాణిజ్య సుంకాలు వంద శాతం విధిస్తామని బెదిరించే రీతిలో ట్రంప్ వ్యాఖ్యలు చేయడం విమర్శలకు తావు ఇచ్చే విధంగా లేకపోలేదు. ప్రపంచ దేశాలకు అమెరికానే పెద్ద దిక్కు అన్నట్టు ట్రంప్ అప్పుడప్పుడు దేశాల మధ్య నెలకొన్న వివాదాల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్య పరిష్కారానికి తాను అనుకునే రీతిలో ప్రయత్నించి, చెప్పితే వినని దేశాలపై అమెరికా ఉత్పత్తులపై పన్ను (టారిఫ్) అధికంగా విధిస్తామని, చెప్పినట్టు వినే దేశాలకు పన్నురాయితో పాటు ఆయుధ సంపత్తిని విక్రయిస్తామని ఏమైనా చేసుకోండి అనే రీతిలో ట్రంప్ వ్యవహార శైలి ఉంటుందా అనే సందేహాలు కలగక మానవు. తరచుగా అమెరికా అధ్యక్షుడు నుండి వస్తున్న పదం టారిఫ్ అంటే అంతర్జాతీయంగా వ్యాపార వాణిజ్య రంగాలలో తమ దేశ ఉత్పత్తుల్లో ఎగుమతులు దిగుమతులలో విధించే సుంకం లేదా పన్ను. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని పొందిన అనంతరం వాణిజ్య వ్యాపార సంబంధాల్లో అంతర్జాతీయంగా ఉన్న అమెరికా ఉత్పత్తుల ఎగుమతి దిగుమతుల విషయంలో తమకు అనుకూలంగా లేని దేశాలపై ఒక రకమైన టారిఫ్, అనుకూలంగా ఉన్న దేశాలపై తక్కువ శాతంటారిఫ్ విధానాన్ని అవలంబిస్తూ, దేశాల వాణిజ్యాన్ని నియంత్రించడానికి ద్వంద వైఖరితో ప్రత్యక్షంగా పరోక్షంగా అంతర్జాతీయంగా ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిబింబించేలా ట్రంప్ ప్రయత్నిస్తున్నడా అనే సంశయం కలగక మానదు. అయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించడానికి భారత్ ,బ్రెజిల్ ,చైనాలు తప్పనిసరిగా రష్యాను ఒప్పించాలని లేనిపక్షంలో అధిక టారిఫ్‌కు సంబంధించిన దేశాలపై అధిక శాతం విధిస్తామనడం ట్రంప్ వైఖరి ముమ్మాటికి సరి అయినదా కాదా అనే భిన్న వాదనలు లేకపోలేదు. భారత్, బ్రెజిల్, చైనా లాంటి స్వతంత్ర దేశాలు స్వయంగా నిర్ణయాలు తీసుకుంటాయి కానీ, అమెరికా ఒత్తిళ్లకు బెదరింపులకో తలొగ్గవనే విషయాన్నిఅమెరికా గ్రహించాల్సి వస్తుందేమో. అవసరమైతే భారత్ లాంటి దేశాలు అమెరికా ఉత్పత్తుల దిగుమతులను సాధ్య మైనంతగా తగ్గించి, స్వదేశీ ఉత్పత్తులను పెంచుకొని తమ దేశ




ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఆంక్షాల ప్రభావం చూపకుండా తమ దేశ ప్రయోజనాల కొరకు తమకు సహకరించే దేశాలతో వాణిజ్య వ్యాపారాలు కొనసాగిస్తాయి. అంతేకానీ అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని దేశాల మధ్య అంతర్గత యుద్ధాల్లో అనవసరంగా ఏకపక్షంగా ఎలాంటి సూచనలు సలహాలు చేయవలసిన అవసరం లేదనే అభిప్రాయాన్ని భారత్ లాంటి దేశాలు పరోక్షంగా వ్యక్తపరుస్తుండడం విశేషం. అమెరికా ఏమి అనుకున్నదో ఏమోకానీ ఎవరు ఏది చెప్తే అది వినడానికి రష్యాదేశం ఏమైనాఇజ్రాయిల్, ఇరాన్, పాకిస్థాన్ లాంటి దేశాలవలే కాదు కదా.ఆసియా ఖండంలో బలమైన దేశాలుగా ఉన్న భారత్ లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాల కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంటుంది. అవసరమైతే తప్ప ఇతరుల జోక్యాన్ని పూర్తిగా తోసిపుచ్చే విధానం నిర్దిష్టమైన విదేశాంగ విధానం భారత్ లాంటి దేశాలకు ఉన్నదని అమెరికాకు తెలియదా ఏమి. అలాంటప్పుడు అమెరికా ఒత్తిడితో భారత్ లాంటి దేశాలు అనవసరంగా వేరొక దేశ అంతర్గత విషయాల్లో జోక్యానికి ఎందుకు ప్రయత్నిస్తాయి అనే ప్రశ్నలు తలెత్తక మానవు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానంలో సరికొత్తపోకడలకు భాష్యాన్ని ఇస్తున్నట్టు, ప్రతి విషయాన్ని వాణిజ్య వ్యాపారంలో అధిక పనుల విధానంతో ముడి పెడుతుండడం విశేషం. అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ముందు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావడానికి ఏకంగా తనకేవ్వరు ప్రపంచంలో శత్రువులు లేనట్లు తన మాటను వినేవారే అధికమంటూ, యుద్ధాలను అధికారంలోకి రాగానే క్రమంగా ఆపిస్తానని రష్యా అధ్యక్షునితో తనకు మంచి సంభాషణే ఉన్నట్లుఅప్పట్లో వార్తలువచ్చాయి. అయితే డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి కైవసం చేసుకున్న తర్వాత ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఆపడమేమో గానీ, ఇజ్రాయిల్ పాలస్తీనా హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపించే ప్రయత్నంలో ఏకంగా ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై అమెరికా దాడి చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అనంతరం జరిగిన పరిణామాలలో ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారకున్ని అని చెప్పుకుంటూ వచ్చిన డోనాల్డ్ ట్రంప్ టెర్రరిస్టులకు బహిరంగంగానే ఆశ్రయం ఇస్తున్న పాకిస్థాన్ పైభారత్ తీసుకున్న చర్యలు నిర్దిష్టంగా ఉన్నప్పటికీ భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపించానని యుద్ధం ఆపకుంటే వాణిజ్యపరమైన ఆంక్షలు విధిస్తాం అనగానే యుద్ధం ఆగిపోయిందని ట్రంప్ అంతర్జాతీయ వేదికలపై చెప్పిన విషయం విధితమే. ఏది ఏమైనప్పటికీ ట్రంప్ రష్యా. ఉక్రెయిన్‌మధ్య యుద్ధం ఆగిపోవాలని కోరుకోవడం సహజమే. నిజానికి ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వల్ల భారీగా ప్రాణ ధన నష్టాలను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలకు డోనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి కొంత ఆశాజనకంగా గోచరించవచ్చు కానీ ప్రపంచ శాంతికి తానే ముందు వరుసలో ఉన్నట్లు వ్యవహరించాలనుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచంలో దేశాల మధ్య యుద్ధ వాతావరణాన్ని నివారించడానికి టారిఫ్ విధానాన్ని ఆయుధంగా మలచుకొని సామవేద దండోపాయలతో దేశాలపై ఒత్తిడి పెంచి యుద్ధాలను ఆపాలని చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయో లేదో వేచి చూడాల్సిందే. •

# ఉభయ సభల్లో విపక్షాల ఆందోళనలు

## గందరగోళంతో సభ నేటికి వాయిదా!

## ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్ ఓటర్ల జాబితాల సవరణపై చర్చకు పట్టుపట్టిన విపక్షాలు

### విపక్షాల వాయిదా నోటీసులను తిరస్కరించిన హరివంశ్



**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేయడంతో మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనలు చేయడంతో, దిగువ సభ కార్యకలాపాలను తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అయితే తిరిగి సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో, స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష పార్టీల ఆందోళనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడ్డాయి. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం రాత్రి ఆకస్మిక రాజీనామా చేయడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన మధ్య ఎగువ సభ ఉదయం కార్యకలాపాలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. తరువాత కూడా నిరసనలు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ అంశాలపై చర్చ చేపట్టడానికి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీసులను హరివంశ్ తిరస్కరించారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. అయితేఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది. తొలిరోజున ప్రతిపక్షాలు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేయడంతో ఉభయసభలు వాయిదా పడిన సంగతి తెలిసిందే. తొలిరోజు నిరసనల మధ్యనే రాజ్యసభ షిప్పింగ్ డాక్యుమెంటేషన్ చట్టాలను ఆధునీకరించే లాడింగ్ బిల్లును విజయవంతంగా ఆమోదించింది. ఈ బిల్లు లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందింది. సమావేశాల మొదటి రోజున హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌సిన్హాపై మోపిన అభిశంసనపై రాజ్యసభలో ప్రసంగించిన అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. జులై 21న ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఆగస్టు 12 నుండి ఆగస్టు 17 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల విరామం ఉంటుంది. ఆగస్టు 18న తిరిగి సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

ఇదిలా ఉండగా తాజాగా జస్టిస్ యశ్వంత్ వర్మపై మోపిన అభిశంసన తీర్మానంపై ఐయుఎంఎల్ ఎంపిఇటి మహ్మద్ బషీర్ మాట్లాడుతూ, ఈ అభిశంసన చాలా ముఖ్యమైనది. ఆ న్యాయమూర్తి వ్యవహారాల కారణంగా భారత న్యాయ వ్యవస్థ స్థితి మరింత దిగజారింది. అందుకే తాము దీనిపై మెమోరాండంను స్పీకర్‌కు సమర్పించామన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందిస్తుందని ఆశిస్తున్నామని బషీర్ పేర్కొన్నారు.



# గాజాలో యుద్ధం ఆగాల్సిందే

## 25 దేశాల సంయుక్త ప్రకటన

### 59 వేలు దాటిన పాలస్తీనియన్ల మరణాలు

**లండన్, జూలై 22 :** గాజాలో యుద్ధం ఆగి తీరాలని, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ గౌరవించాలని బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్‌లతో సహా మొత్తం 25 దేశాలు సోమవారం ఒక సంయుక్త ప్రకటన వెలువరించాయి. కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో సామాన్యుల కష్టాలు మరింతగా పెరిగాయని ఆయా దేశాల విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. చాలీచాలని సాయం అందించడమే కాక, కనీస అవసరాలైన ఆహారం, నీళ్ల కోసం వేచి వున్న అమాయక ప్రజలను, మహిళలు, పిల్లలను విచక్షణారహితంగా హతమార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. 'ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుసరిస్తున్న సహాయ పంపిణీ విధానం అత్యంత ప్రమాదకరం. ఇది అస్థిరతను పెంపొందించడంతోపాటు గాజా వాసుల కనీస మానవ గౌరవాన్ని హరిస్తోంది' అని సంయుక్త ప్రకటన తెలియజేసింది. గాజాలోని అన్నార్తుల పట్ల ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వైఖరిని ఐరాస తీవ్రంగా ఖండించింది. ఆహార కేంద్రాల వద్ద వచ్చే వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కాల్పులు జరుపుతోందంటూ మండిపడింది.

ఆదివారం ఒక్కరోజే 80 మంది ఉసురు తీయడాన్ని ప్రస్తావించిన ఐరాస ఆహార విభాగం (డబ్ల్యుఎఫ్‌పి).. పాలస్తీనియన్ల పాలిట భయంకరమైన రోజుల్లో ఒకటని అభివర్ణించింది.

సెంట్రల్ గాజాలోని నెట్‌జరిమ్ కారిడార్ వద్ద గుంపుగాచేరిన పాలస్తీనియన్లపైజరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. హమాస్‌శ్రేణులు లక్ష్యంగా 21 నెలలుగా యథేచ్ఛగా ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న దాడుల్లో మరణాలు 59 వేలు దాటాయని గాజా ఆరోగ్య విభాగం సోమవారం తెలిపింది. 2023 అక్టోబరు 7 నుంచి సాగిస్తున్న దాడుల్లో క్షతగాత్రుల సంఖ్య 1,42,135కు చేరుకుందని వివరించింది.



## భారత్-పాక్ సరిహద్దుల్లో బిఎస్‌ఎఫ్ 'డ్రోన్ స్క్వాడ్రన్'

**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పిఒకెతోపాటు పాక్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అటునుంచి దాయాది దేశం కూడా మనపై డ్రోన్లతో దాడులకు యత్నించింది. దీంతో భారత బలగాలు అప్రమత్తమయ్యాయి. భవిష్యత్తులో ఇటువంటి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా భారత్-పాక్ సరిహద్దులో గస్తీ పెంచడంతోపాటు 'డ్రోన్ స్క్వాడ్రన్'లను ముమ్మరంగా మోహరించే పనిలో నిమగ్నమయ్యాయి. సరిహద్దులో నిర్దిష్ట ఔట్ పోస్టుల్లో ఉండే డ్రోన్ దళాల్లో నిఘాకు సంబంధించి అనేక వ్యవస్థలు ఉంటాయి. ఈ స్క్వాడ్రన్‌లో నిఘాతోపాటు మానవరహిత విమానాలు లేదా డ్రోన్లు ఉంటాయి. ఈ పరికరాలను ఆపరేట్ చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తిస్తారు. చండీగఢ్‌లోని బిఎస్‌ఎఫ్ వెస్టర్న్ కమాండ్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఈ బృందాలకు దిశానిర్దేశం చేస్తుంది. రక్షణ పరిశోధన, నిఘా సంస్థలతో ఈబృందాలు కీలకవివరాలను పంచుకుంటాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితులు తలెత్తినప్పుడు శత్రు డ్రోన్లపై దీటుగా విరుచుకుపడతాయి.

# గడ్చిరోలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



**గడ్చిరౌలి, జూలై 22:** విదేశీ నిధులతో గడ్చిరౌలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేస్తున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించారు. లాయిడ్స్ అండ్ ఎనర్జీ లిమిటెట్ సంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్చిరౌలి జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. గడ్చిరౌలిలో నక్సలిజం తగ్గుతోందని, ప్రస్తుతం కొంతమంది నక్సలైట్లు మాత్రమే ఉన్నారని, వాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు అని, ఇక్కడి అడువుల్లో వాళ్లు ఉన్నారని ఆయన అన్నారు. హింసను వీడాలని నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఫడ్నవీస్ తెలిపారు. ప్రధాన జీవనస్రవంతిలో కలవాలని కోరుతున్నట్లు తెలిపారు. అయితే తుపాకీ పట్టుకుని తిరిగే నక్సలైట్లు తగ్గుతున్న దశలో.. అర్బన్ నక్సల్స్ సంఖ్య పెరుగుతోందని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అర్బన్ నక్సల్స్ పట్ల అలర్ట్‌గా ఉండాలని, వాళ్లు తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారని, గడ్చిరౌలిలో స్టీల్ ప్లాంట్ కోసం శంకుస్థాపన చేయగా, మరుసటి రోజే సోషల్ మీడియాలో దుష్ప్రచారం మొదలుపెట్టారని, గిరిజనులను చంపుతున్నారని ప్రచారం చేస్తున్నట్లు సిఎం ఆరోపించారు. భారీ స్థాయిలో అడవుల్ని నరికివేస్తున్నట్లు ప్రచారంచేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేస్తుంటే.. ఎలా వ్యతిరేక ప్రచారం చేపడుతున్నారని ఆయన అడిగారు.

మహారాష్ట్రకు సంబంధం లేని వ్యక్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, ఇద్దరు కోల్‌కతాలో ఉన్నారని, మరో ఇద్దరు బెంగళూరులో ఉన్నారని, వాళ్లు విదేశీ నిధులతో.. సోషల్ మీడియా పోస్టులతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అబద్ధాలు చెబుతూ అర్బన్ నక్సల్స్ గడ్చిరౌలిని అభివృద్ధికి దూరం చేస్తున్నారని ఆయన తెలిపారు.

# ఎట్టకేలకు కేరళను వీడిన బ్రిటన్ ఫైటర్ జెట్

**తిరువనంతపురం, జూలై 22:** సాంకేతిక సమస్యల కారణంగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో నెల రోజులుగా నిలిచిపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్-35 బి స్టెల్త్ యుద్ధ విమానం ఎట్టకేలకు టేకాఫ్ అయ్యింది. మంగళవారం ఉదయం కేరళను వీడింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బి 40 రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇండో-యుకె నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బి విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఆ విమానాన్ని జూన్ 14న అర్ధరాత్రి తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో దించేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరత కారణంగా విమానాన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఆ ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య తలెత్తినట్లు ఆ తర్వాతే యుకె అధికారులు వెల్లడించారు.

ఈ ఫైటర్ జెట్‌కు ఇక్కడ మరమ్మతులు చేయడానికి వీలుకాకపోవడంతో బ్రిటన్ నుంచి నిపుణులను రప్పించారు. 24 మంది స్పెషల్ ఎక్స్‌పర్ట్స్ బృందం వచ్చి విమానానికి మరమ్మతులు చేపట్టింది. విమానంలోని లోపాలను సరిచేసింది. దీంతో విమానం ఎట్టకేలకు గాల్లోకి ఎగిరింది. దాదాపు ఐదు వారాల తర్వాత మంగళవారం ఉదయం కేరళ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయి బ్రిటన్‌కు బయల్దేరి వెళ్లింది.

# ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 9.74 లక్షల టన్నుల డిఏపి దిగుమతి

## ఎరువుల లభ్యతపై రాజ్యసభలో కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ ప్రకటన



**న్యూఢిల్లీ, జూలై 22:** దేశీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశం 9.74 లక్షల టన్నుల డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఏపి)ని దిగుమతి చేసుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరానికి డిఏపి దిగుమతికి గణాంకాలను కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియపటేల్ రాజ్యసభలో వెల్లడించారు. దేశం ఏప్రిల్‌లో 2.89 లక్షల టన్నులు, మేలో 2.36 లక్షల టన్నులు, జూన్‌లో 4.49 టన్నులు దిగుమతి చేసుకుందని చెప్పారు.

2024-25 ఆర్థికసంవత్సరంలో 45.69 లక్షల టన్నులు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 55.67 లక్షల టన్నులు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 65.83 లక్షల టన్నులు, 2021-22 ఆర్థిక సంవత్సంలో 54.62 లక్షల టన్నులు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 48.82 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని వివరించారు. యూరియాను 2024-25లో 56.47 లక్షల టన్నులు, 2023-24లో 70.42 లక్షల టన్నులు, 2022-23లో 75.80 లక్షల టన్నులు, 2021-22లో 91.36 లక్షల టన్నులు, 2020-21లో 98.28 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్లు వివరించింది. ఖరీఫ్ నేపథ్యంలో రైతుల అవసరాలను తీర్చేందుకు అవసరమైన ఎరువులు ఉన్నాయని తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువుల అవసరం గతేడాది కంటే ఎక్కువగా ఉందన్నారు. రుతుపవనాలతోపాటు సాగు విస్తీర్ణం పెరిగింది. ఏప్రిల్ 2010 నుంచి కేంద్రం ఫాస్ఫేటిక్, ఫొటాసిక్ (పిఅండ్‌కె) ఎరువుల కోసం పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) విధానాన్ని అమలుచేసింది.

ఎరువుల డిమాండ్, ఉత్పత్తి మధ్య అంతరాన్ని దిగుమతుల ద్వారా తీరుస్తామని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ చెప్పారు. భౌగోళిక రాజకీయ కారణంగా సరఫరా గొలుసులో ఎదురైన అంతరాయాల ప్రభావాన్ని తగ్గించేందుకు.. ఎరువుల కంపెనీలు నిరంతరాయంగా సరఫరాను చేసేలా డిఏపి ఉత్పత్తి చేసే దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన మహిళ

### ఇంట్లో గొయ్యితీసి పూడ్చేసి పరార్

**ముంబై, జూలై 22:** ప్రియుడి సాయంతో భర్తను చంపి, ఇంట్లోనే పూడ్చిపెట్టిన ఓ మహిళ .. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ప్రియుడితో పారిపోయింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దారుణ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధనివ్‌బాగ్ ప్రాంతానికి చెందిన విజయ్ చౌహాన్ (34), చమన్ అలియాస్ గుడియాదేవి (32) పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే గుడియాదేవి తమ పొరుగునే ఉన్న మోనువిశ్వకర్మ (33)తో వివాహేతర సంబంధాన్ని ఏర్పరుచుకుంది. దీంతో వారిద్దరూ తమకు అడ్డుగా ఉన్న విజయ్ చౌహాన్‌ను చంపడానికి ప్రణాళిక వేసుకున్నారు. దాదాపు 15 రోజుల క్రితం వీరిద్దరూ విజయ్‌ను హత్యచేసి, అతని ఇంట్లోనే గొయ్యి తీసి పాతిపెట్టారు. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా ఉండడానికి అక్కడ కొత్త టైల్స్‌తో కప్పి ఏమీ తెలియనట్లుగా ఉన్నారు.

అయితే ఈ కేసు ఎలా వెలుగులోని వచ్చిందంటే.. విజయ్ తోబుట్టువులు ఓ ఇల్లు కొనాలని అనుకుని డబ్బులకోసం వారు విజయ్‌కు ఫోన్ చేయగా, ఎన్నిసార్లు ఫోన్ చేసినా విజయ్ స్పందించలేదు. దీంతో వారు తమ సోదరుడి ఇంటికి వెళ్లి ఆరా తీయగా, తన భర్త పని కోసం కుర్లాకు వెళ్లాడని గుడియా చెప్పింది. దీనితో వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత విజయ్ తిరిగి ఇంటికి వచ్చాడో, లేదో తెలుసుకోవడానికి ఈ నెల 19న మళ్లీ గుడియాకు ఫోన్ చేశారు. కానీ ఆమె ఫోన్‌ను స్విచ్ ఆఫ్‌చేసి ఉంది. దీంతో విజయ్ సోదరులకు అనుమానం వచ్చి ఇంటికి వెళ్లిచూశారు. ఆమె కనిపించకపోవడంతో పెల్హార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విజయ్ ఇంటిని పరిశీలించగా, అక్కడ కొత్తగా వేసిన టైల్స్‌కనిపించాయి. వాటిని తొలగించి చూడగా, దుర్వాసనవచ్చింది. దీనితో అక్కడ తవ్విచూడగా కుళ్లిపోయిన స్థితిలో విజయ్ మృతదేహం కనిపించింది. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముంబయిలోని జెజె ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

# ధన్‌ఖడ్ రాజ్యాంగ విలువలను కాపాడారు

## ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాన్ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మీ పదవీ కాలంలో ఉప రాష్ట్రపతి పదవి గౌరవాన్ని అచంచలమైన నిబద్దతతో నిలబెట్టారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ దయ,నిష్పాక్షికత,సమగ్రతతో భాధ్యతలు నిర్వహించారు. రాజకీయ ఒత్తిడి లేకుండా నిర్భయంగా మీ అభిప్రాయాలను వ్యక్తీకరించారు.గౌరవనీయమైన పాత్ర నుంచి వైదొలగుతున్న మీకు మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన జీవనం ఉండాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ గత రాత్రి రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ హోదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న జెడియూ నేత హరివంశ్ నడిపించనున్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా భాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ళ 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. ధన్‌ఖడ్ ఆదర్శనీయ రాజకీయ వేత్తని పవన్ అన్నారు.

## హాకీ క్రీడాకారిణిపై సామూహిక అత్యాచారంకేసులో

# నలుగురు కోచ్‌ల అరెస్టు

### ఒడిశా 'సాయ్' సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ప్లేయర్

**భువనేశ్వర్, జూలై 22:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో 15 యేళ్ల టీనేజ్ హాకీ క్రీడాకారిణిపై కోచ్‌లే సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన నివ్వెరపరుస్తోంది. ఈ కేసులో నలుగురు హాకీ కోచ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దారుణం రూర్కెలాలోని సాయ్ (స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) సెంటర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు గత రెండేళ్లుగా ఈ కేంద్రంలో శిక్షణ పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న సాయంత్రం స్థానిక స్టేడియంలో కోచింగ్ సెషన్ ముగిసిన తర్వాత నలుగురు కోచ్‌లు .. ఆ క్రీడాకారిణిని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ వారు తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ రాత్రి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. భువనేశ్వర్ డిసిపి ప్రతీక్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకుని నలుగురు శిక్షకులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని వివిధ సెక్షన్లతోపాటు సామూహిక అత్యాచారం, పోక్సో చట్టం సెక్షన్ 6 కింద కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ సంఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# సంక్షిప్తంగా..

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదరింపు



**గాంధీనగర్, జూలై 22:** దేశంలో బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా అహ్మదాబాద్ విమానాశ్రయానికి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు సోదాలు చేపట్టారు. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్‌కు మంగళవారం ఉదయం బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్ట్‌లో సోదాలు చేపట్టారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికిచేరుకుని బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అయితే ఇప్పటివరకు జరిపిన సోదాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శరద్ సింఘాల్ తెలిపారు.

## రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం, ఐదుగురు మృతి

**జైపూర్, జూలై 22:** రాజస్థాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. బికనీర్ జిల్లాలోని సిక్వాల్ ప్రాంతంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అయిదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారి 11పై ఈ ఘటన చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు రెండు కార్లలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఖతుష్యం ఆలయ సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో కార్లు రెండూ నుజ్జునుజ్జు అయ్యాయి. కార్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు విద్యుత్ కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. కార్లలో ఉన్న మృతదేహాలను బయటకు తీసేందుకు దాదాపు గంట సమయం పట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు.

## భారత్‌కు అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు



**న్యూఢిల్లీ, జూలై 22:** భారత ఆర్మీ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు చేరుకున్నాయి. హిండన్ ఎయిర్‌బేస్‌లో తొలి విడితగా మూడు హెలికాప్టర్లు అమెరికా మిలిటరీ ట్రాన్స్ పోర్టు ప్లేన్‌లో హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీటిని పూర్తిస్థాయిలో అసెంబుల్ చేసి తనిఖీలు నిర్వహించాక సైన్యానికి చెందిన ఏవియేషన్ కోర్ విభాగానికి అందించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక వీటిని జోధ్‌పూర్‌కు తరలిస్తారు. అపాచీ హెలికాప్టర్‌లు భారత్‌కు చేరుకోవడంపై సైన్యం హర్షం వ్యక్తంచేసింది. ఇదో ముఖ్యమైలు రాయి అని వ్యాఖ్యానించింది. భారత అమ్ములపొదిలో అత్యాధునిక హెలికాప్టర్ల చేరికతో కార్యనిర్వాహకసామర్థ్యాలు మరింతపెరిగాయని పేర్కొంది. అపాచీ హెలికాప్టర్‌లతోకూడిన ప్రత్యేక స్క్వాడ్రన్‌ను గతేడాది మార్చిలోనే జోధ్‌పూర్‌లో ఏర్పాటు చేశారు.అపాచీ ఎహెచ్-64ఇ అటాక్ హెలికాప్టర్ల కోసం 2020లో అమెరికాతో భారత ఆర్మీ 600 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది.

## బీహార్ ఓటర్ లిస్టు నుంచి 51 లక్షల పేర్లు తొలగింపు

**పాట్నా, జూలై 22:** బీహార్ ఎన్నికల జాబితా నుంచి 51 లక్షల పేర్లు తొలగించినట్లు ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. ఓటర్లు మరణించడం, వలస వెళ్లడం ఇందుకు కారణాలుగా తెలిపింది. ముసాయిదా ఎన్నికల జాబితాలో అర్హులైన ఓటర్లను చేరుస్తామని హామీ ఇచ్చింది. ఆగస్టు 1న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. 'బీహార్ ఎస్ఐఆర్ ఇంతవరకూ వెల్లడైన నిజాలు' అనే పేరుతో ఎన్నికల కమిషన్ ఇక నోట్ విడుదల చేసింది. ఇంతవరకూ నిర్వహించిన బీహార్ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో 18 లక్షల మంది ఓటర్లు చనిపోయినట్లు తమ దృష్టికి రాగా, 26 లక్షల మంది వివిధ నియోజకవర్గాలకు మారిపోయారని, రెండుచోట్ల పేరు నమోదు చేసుకున్న వారు 7 లక్షల మంది ఉన్నారని వివరించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ బాధ్యతగా ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్నామని ఇసి తెలిపింది.

# స్థానిక పోరులో యువతకు ప్రాధాన్యత నివ్వండి

## రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి


యువతకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధన్యత ఇవ్వాలని సిఎం రేవంత్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న టివైసి రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చి బరిలో నిలపాలని రాష్ట్ర యుజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి కోరారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా నివాసంలో జక్కిడి శివ చరణ్‌రెడ్డి కలిశారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు 20 శాతం సీట్లను కేటాయించాలని రేవంత్ రెడ్డి కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించి సిఎం స్థానిక సంస్థ ఎన్నికల్లో అభిలాషణీయమైన స్థాయిలో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని శివచరణ్‌రెడ్డి తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన అర్హత గల యువజన కాంగ్రెస్ నాయ కులకు తగిన గుర్తింపు ఇచ్చి సీట్ల కేటాయింపులో సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి చెప్పారని ఆయన వివరించారు.

# నేడు గాంధీభవన్‌లో ముఖాముఖికి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనడానికి బుధవారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,దివ్యాంగులు సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గాంధీ భవన్‌కు రానున్నారు.టిపిసిసి చీఫ్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు వారానికి రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉంటారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే విన్నపాలు మంత్రికి ఇవ్వడానికే ఈ కార్యక్రమం దోహదపడుతోంది. అడ్లూరి లక్ష్మన్ మంత్రిగా ఇటీవలే పదవి బాధ్యతలు తీసుకొని తొలిసారి విన్నపాలు స్వీకరణకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి వస్తున్నారు.


తాటి, ఈత వనంలో కార్మికులతో తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్ తదితరులు

# కల్తీ పేరిట కల్లు నిషేధానికి కుట్రలు

## గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయొద్దు

### కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** కల్తీ పేరిట ఔషధ గుణాలు కలిగిన కల్లును నిషేధించేందుకు కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్ అన్నారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గి గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయ్యవద్దన్నారు. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కామారెడ్డి హన్మాండ్లు గౌడ్‌తో పాటు యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగాల గోవర్ధన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పులి లక్ష్మీపతిగౌడ్,కార్యాలయం కార్యదర్శి టి.భిక్షపతి గౌడ్‌లు మాట్లాడారు. తొలుత హన్మాండ్లు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కల్తీ కల్లు నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీకి పాల్పడిన దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. కొందరు చేసిన తప్పుకు నగరంలోని కల్లు దుకాణాలన్ని మూసివేసి ఔటర్‌రింగ్ రోడ్డుకు తరలిస్తారని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నగరంలో కల్లు సొసైటీలోని దుకాణాలను యధావిధిగా కొనసాగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

దుకాణాలను ఔటర్ కు తరలిస్తే వేలాది మంది కల్లుగీత కార్మికులు, సొసైటీల్లోని కల్లు డిపో వర్కర్లు, పారిశ్రామికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రమాదవశాత్తు ఈత, తాటి చెట్ల పైనుండి పడి మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయంలో చాలా జాప్యం జరుగుతున్నదన్నారు. దీనిని నివారించి తక్షణమే ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన నీరాకేఫ్ ప్రాంగణంలోకి తెలంగాణ ట్యాడి ట్యాపర్ కార్యాలయాన్ని తరలించాలని ఆయన ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కల్లు గీత కార్పొరే షన్‌కు వెంటనే పాలక కమిటీని నియమించాలన్నారు.


హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఐక్యత చాటుతున్న బిసి నేతలు

# రాంచంద్రరావు వ్యాఖ్యలపై మండిపడ్డ బిసి నేతలు

## తమిళనాడులో సాధ్యమైనప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు

### సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లి ప్రధానిపై ఒత్తిడి చేయాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 22 ప్రభాతవార్త:** బిసిల 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు న్యాయప రమైన అంశాలపై అవగాహన లేదని, పూర్తి అజ్ఞానంతో వ్యాఖ్యలు చేశారని జాతాయ బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య ఆరోపించారు. తమిళనాడులో 4 సార్లు అఖిల పక్ష సమావేశం నిర్వహించి 3 సార్లు తీర్మానం చేసి రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం చేసి బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చడం జరిగిందని ఆయన వివరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ లను 9వ షెడ్యూల్డ్‌లో పెట్టె విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేయాలని, ప్రభుత్వం చేసిన కులగణను బహిర్గతం చేయకపోవ డమంటే సమాజాన్ని తప్పుదారి పట్టించడమేనని ఆరోపించారు.బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ రాంచంద్రరావు ఢిల్లీలో బిసిల రిజర్వేషన్‌లపై చేసిన ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిసి బిల్లుకు అమోదం తెలిపిన బిజెపి, కేంద్రంలో ఎందుకు వ్యతిరేకిస్తున్నదని ప్రశ్నిం చారు. ఇక నుంచి తమ పోరాటాలు ఢిల్లీ నుంచి కొనసాగిస్తామని, తమిళనాడు రిజర్వేషన్‌లు సాధ్యమైనప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కావని ప్రశ్నించారు. 4శాతం ఉన్న ఒసిలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను కేంద్రం కల్పించిందని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళి ప్రధాని నరేంద్ర మోదీపై వత్తిడి చేసి బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు బాలగోని బాలరాజుగౌడ్, అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, కె.వి.గౌడ్, చామకూర రాజుగౌడ్, అంబాల నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై డిజిపి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో మహిళల భద్రతకు సంబంధించి డిజిపి జితేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. మహిళా భద్రతా విభాగం నేతృత్వంలో జరిగిన ఈ సమావేశం డిజిపి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సిఐడి చీఫ్ చారు సిన్హాతో పాటు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి, రాచకొండ కొత్వాల్ సుధీర్ బాబు, మహిళా భద్రతా విభాగం డిఐజి రెమా రాజేశ్వరితో పాటు ట్రై కమిషన రేట్ల భద్రతా మండలి అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ ట్రై కమిషనరేట్లలో మహిళల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో సైబరాబాద్ కమిషనరేట్ ముందంజలో వుందని ఆయన తెలిపారు. మహిళల భద్రతకు సంబంధించి ట్రై కమిషనరేట్ల అధికారులు పరస్పర సహ కారంతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. మహిళల భద్రతకు సంబంధించి వున్న భరోసా కేంద్రాలు, షీ బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగంతో కలిసి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ విషయంలో ట్రై కమిషనరేట్ల సెక్యూరిటీ కౌన్సిల్స్ సభ్యుల సహకారం తీసుకోవాలని ఆయన కోరారు.

# కొండంత చేశాం.. గోరంత కూడా చెప్పుకోలేకపోతున్నాం

## సాధించిన ప్రగతికి విస్తృత ప్రచారం కల్పించాలి, అప్పుడు, ఇప్పుడు ఆ పార్టీది గోబెల్ ప్రచారమే


### జిల్లా పౌరసంబంధాల అధికారులతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్


మంగళవారం నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై22:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏడాదిన్నర కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ చేసిన మంచి పనులను సవివరంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. నేడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో చెయ్యని వాటిని చేసినట్లుగా గోబెల్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టిందని, ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసిన దాన్ని కూడా పూర్తిగా చెప్పుకోలేకపోతున్నామని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐఅండ్‌పిఆర్ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి జి.మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతోచేసిన ప్పటికీ ఆశించిన రీతిలో ప్రజలకు వివరించలేక పోతున్నామని అన్నారు. ఇచ్చిన హామీలనే గాక ఇతర అంశాలలో ప్రజోపయోగపనులు చేపట్టా మని, 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామన్నారు. ఇవేగాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్న బియ్యం, మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు.గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేనిది ఏడాదిన్నరలో చేసి చూపిం చామన్నారు. పది సంవత్సరాలలో పేదలకు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఆలోచన కూడా చేయలేదన్నారు. ఉన్న రేషన్ కార్డులలో పేర్లు కూడా నమోదుచేయలేదు. గతపది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరునమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డులలో నమోదు చేశామన్నారు. కొత్తగా 7లక్షల రేషన్ కార్డులిచ్చాం. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసు కొచ్చాం. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నాకూడా పేదల సంక్షేమం విషయంలో ఈప్రభుత్వం రాజీ పడడం లేదన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాస్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారులదేనని ఈ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

# ప్రాంతాల మధ్య వైరుధ్యాల సృష్టికి పన్నాగం

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** ప్రాంతాల మధ్య వైరుధ్యాలను సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోలని బిఆర్ఎస్ నేతల పన్నాగం పన్నుతున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. గాంధీ భవన్‌లో మంగళవారం అందుబాటులో ప్రజా ప్రతినిధుల కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలను చేస్తున్న బిఆర్ఎస్‌పార్టీని రద్దు చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. బనకచర్ల అనే లేని ప్రతిపాదనను వివాదం చేస్తూ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారని అద్దంకి దయాకర్ ఆరోపించారు. ఫాం హౌస్‌కి పరిమితమైన కెసిఆర్‌కి ప్రతిపక్ష హోదా ఎందుకు అని నిలదీశారు. కెసిఆర్ కుటుంబంలోని నలుగురిలో రాబోయే రోజుల్లో ముగ్గురు కలిసి ఉండే అవకాశం ఉందా? ఇంతకు కవిత ఏపార్టీలో ఉన్నట్లు అని అనుమానం వ్యక్తంచేశారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతు మీరు ఎంపిలు, ఎమ్మెల్యేలుగా ఎలా ఉన్నారని అద్దంకి ప్రశ్నించారు. బిఆర్ఎస్ ఆంధ్ర మీడియా అంటూ దాడులు చేసే పరిస్థితికి దిగజారిందని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీలో రెండో నెంబర్ వ్యక్తి ఆ పార్టీలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆ పార్టీలో అదే తంతు కొనసాగుతుందన్నారు. అరెస్టులు,కేసులంటే బిఆర్ఎస్ నేతలకు భయం పట్టుకుంది మీ హయాంలో స్పీకర్ పర్మిషన్ లేకుండా రేవంత్ రెడ్డి, కోదండరాం,కృష్ణయ్యను అరెస్టు చేశారని గుర్తుచేశారు.మేం ప్రశ్నిస్తే అరెస్టు చేశారు.మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేయకూడదని అన్నారు. వంటేరు ప్రతాప్ రెడ్డిని బెదిరించి మీ పార్టీలో చేర్చుకున్నారు.ఆయనను పోలీసులు కొట్టిన తీరు చూసి బాధ కలిగిందని గతాన్ని గుర్తు చేసుకున్నారు. బిఆర్ఎస్ ఇచ్చింది రేషన్ కార్డులు కాదు రేషన్ సీట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. మేము వచ్చాక కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. గ్రూప్-1 మీద కేసులు వేయడానికి బిఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలను చూసి శకుని కూడా సిగ్గుపడే పరిస్థితి ఉందని అన్నారు. నిజమైన ఉద్యమకారులు ఎవరో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలుసని బిఆర్ఎస్ చేసే విషప్రచార మాటలను నమ్మకండని అద్దంకి అన్నారు.అంతకు ముందు గాంధీభవన్‌లో ప్రతి రోజూ నిర్వహించే అందుబాటులో ప్రజా ప్రతినిధుల సమావేశంలో అద్దంకి పాల్గొని ఉద్యోగులు, స్థానికులు, ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వాటి పరిశీలించి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన ఆర్జీలను ఎక్కువగా వచ్చాయని ఆయన తెలిపారు.

# బిసి ద్రోహిగా మిగిలిపోనున్న బిజెపి

## 42శాతం ఆర్డినెన్స్ అడ్డుకోవడానికి బిజెపి బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ జూలై 22,ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైఖరితో బిసి ద్రోహిగా మిగిలిపోతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు అమలు కావొద్దన్నదే రామచంద్రరావు వైఖరీగా ఉందని ఆవేదన చెందారు. బిసిలు కాంగ్రెస్ వైపు మొగ్గ చూంస్తారనే రామచంద్రరావు మొసలికన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపిలు గెలిపించినా రాష్ట్రానికి నిధులు తీసుకురాలేకపోతున్నారని కనీసం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ ఆమెదించిన బిల్లు కేంద్రానికి పంపితే ఆర్థికేతర అంశమైనా దానిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందుపరిచేందుకు కేంద్రంతో పోరాటం చేయలేని చేతగాని దద్దమ్మలు బిజెపి ఎంపిలని ఆయన విమర్శించారు.బండి సంజయ్, ఈటెల రాజేందర్, ధర్మపురి అర్వింద్ లాంటి వాళ్లు కేంద్రాన్ని ఎందుకు ఒప్పించలేకపోతున్నారు? అని ఆయన ప్రశ్నించారు.స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం మా రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ తీసుకువస్తున్నారని ఆయన తెలిపారు.బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు రిజర్వేషన్ల పైనచేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి, బిఆర్ఎస్‌లోపాయికారీ ఒప్పందం తో ఆర్డినెన్స్‌ను అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిసి వ్యతిరేకి

## తెలంగాణ బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలి: రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలి,వారు రాజీనామా చేస్తే ఎందుకు అమలు చేయరో చూద్దాం అంటూ రాష్ట్రరవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ బిజెపి అధ్యక్షుడు మరోసారి బిసి రిజరేషన్ వ్యతిరేకతతో తన అసలు నిజ స్వరూపాన్ని బయటపెట్టాడని బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ 9 వ షెడ్యూల్ లో చేర్చడం అసాధ్యం అంటున్నారని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమే,గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో జరిగిందని ఆయన ఉదహరించారు. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు,ఎమ్మెల్యేలు రాజీనామా చేసి జాతీయపార్టీపై ఒత్తిడి పెంచండి ఎందుకు రిజర్వేషన్లు అమలు కావో చూస్తాం, దీనిని సాధించిపెట్టండని ఆయన కోరారు. సుప్రీంకోర్టులో ఇందిరా సహనీ కేసులో బిసి రిజర్వేషన్ పెంపు విషయంపై స్పష్టంగా చెప్పారు. రాష్ట్రాల దగ్గర ప్రామాణికమైన సమాచారం ఉంటే ఎంపెరికల్ డేటా ఉంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని చెప్పారని ఆయన వివరించారు.అందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి కేబినెట్ ఆమోదం శాసన సభ ఆమోదం, గవర్నర్ ఆమోదంతో ఢిల్లీలో ఉందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకో వాల్సిన అంశంతప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని పొన్నం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నడుపుతున్న బిజెపి 9వ షెడ్యూల్ లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు తప్పకుండా చేర్చాల్సిందే అని డిమాండ్ చేశారు. గతంలో జనహిత అభియాన్ కేసులో ఇడబ్ల్యుఎస్ సందర్భంగా స్పష్టంగా చెప్పిందిని ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ ఇచ్చినప్పుడు 50 శాతం రిజర్వేషన్ల శ్లాబ్ ఎత్తివేశారని గుర్తు చేశారు. ప్రామాణిక నివేదిక ప్రకారం సమా చారం సుప్రీంకోర్టులో ఉందని మభ్యపెడుతుంది మీరు అని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి బిసి అని మభ్యపెట్టేమీరు కనీసం ఎల్‌పి లీడర్, పార్టీ అధ్యక్షపదవి కూడా బిసిలకు ఇవ్వకుండా బిజెపి కుల వివక్ష పాటిస్తోందని ఆయన దుయ్యబట్టారు.

# బిజెపి బిసి నేతలు రిజర్వేషన్ కోసం నోరు విప్పాలి

## ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్



**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** తెలంగాణలో విద్య,ఉద్యోగం,రాజకీయ అవకాశాలు పెంపొందించడానికి బిసిలకు 42శాతం రిజర్వేషన్ పెంపు కోసం బిజెపి హైకమాండ్‌పై ఒత్తిడి తీసుకొచ్చి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి ఆ పార్టీ బిసి నేతలు నోరు విప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లాడతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైఖరీలో బిసి రిజర్వేషన్ వ్యతిరేకంగా కనిపిస్తున్నదని అన్నారు. రాంచంద్రరావు బిసి రిజర్వేషన్లను ఆహ్వానిస్తున్నామని రాష్ట్రంలో చెపుతూ ఢిల్లీ వెళ్లగానే మాట మారుస్తున్నాడని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ లపైన మా రేవంత్ రెడ్డి చిత్తశుద్దిని పశ్నించే నైతిక హక్కు బిజెపి కి లేదని ఆయన అన్నారు. బిసి రిజర్వేషన్ల పైన మా చిత్తశుద్దిని మేం నిరూపించుకున్నామని, 42 శాతం రిజర్వేషన్ల కోసం పకడ్బందీగా కులగణన చేశామని మంత్రి వర్గంలో ఆమోదించామని అసెంబ్లీలో చట్టం చేశాం గవర్నర్ దగ్గర నివేదించామని ఆది శ్రీనివాస్ వివరించారు. 9వ షెడ్యూల్ లో చేర్చాల్సింది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. 9వషెడ్యూల్ లో చేర్చాలని మేం జంతర్ మంతర్ దగ్గర ఇప్పటికే ధర్నా చేశామని కూడా గుర్తుచేశారు.పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించామని ఇప్పుడు బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తే మేం సహించం అని ఆది హెచ్చరించారు. రామచంద్రరావు కూడా ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు నడ్డాను రిజర్వేషన్లపై నిలదీయాలని ఆదిశ్రీనివాస్ హితవు చెప్పారు.సొంత పార్టీని ఒప్పించుకోవడం చేతకాక మా పైన విమర్శలు చేస్తే సరిపోదని అన్నారు. తెలంగాణలోని వెనుకబడిన తరగతుల ప్రజలు బిజెపి దొంగ నాటకాన్ని గమనించాలని కోరారు. ఈటెల రాజేందర్,ధర్మపురి అర్వింద్ తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చడానికి నోరువిప్పాలని ఎందుకు బిజెపి బిసి నేతలు నోరు మెదపడంలేదని ఆయన ప్రశ్నించారు.

# దాశరథి కృష్ణమాచార్యకు సముచిత గౌరవం ఇవ్వని ప్రభుత్వం

## తెలంగాణ జాగృతి స్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సభలో ప్రసంగిస్తున్న కల్వకుంట్ల కవిత, కె.శ్రీనివాస్, నాళేశ్వరం, అమ్మంగి తదితర అతిథులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 22 ప్రభాతవార్త :** నిజాం రాచరిక దుష్టపాలన నుండి తెలంగాణ విముక్తి కోసం కలమనే ఆయుధాన్ని పట్టి తెలంగాణ రాష్ట్ర సాకారానికి ప్రముఖభూమికను పోషించిన ఉద్యమ చరిత్ర కలిగిన మహోన్నతకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించడంలో నేటి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమై సముచిత గౌరవం ఇవ్వలేదని తెలంగాణ జాగృతి స్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విచారం వ్యక్తపరిచారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో తెలంగాణ జాగృతి నిర్వహణలో జరిగిన దాశరథి శతజయంతి ఉత్సవాలకు కె.కవిత ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రముఖకవి డా. నాళేశ్వరం శంకరం, సాహితీవేత్త డా. అమ్మంగి వేణుగోపాల్, సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, దాశరథి కుమారుడు లక్ష్మణ్ తదితరులతో కలిసి దాశరథి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించి ప్రసంగించారు.

మారుమూల గ్రామం చిన్నగూడూరు లోని పేద కుటుంబంలో జన్మించిన ఆయన గిరిజనులు, పేదప్రజల దీనస్థితిపై చైతన్యం కలిగించే ఎన్నో రచనలు చేశారని వివరించారు. సామాజిక వివక్షను తుడిచి పెట్టాలంటే కవిత్వమే ఆయుధమని ఉద్యమ కవితలు రాసారన్నారు. నిజామాబాద్‌లో దాశరథిని నిర్బంధించిన జైలు వద్ద ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి పెద్దయెత్తున అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అగ్నిశిఖ పుస్తకాన్ని కవిత ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు.

అనంతరం కె.శ్రీనివాస్, నాళేశ్వరం శంకరం తదితరులు ప్రసంగించారు. సభా కార్యక్రమం అనంతరం అగ్నిశిఖ పేరిట జరిగిన కవిసమ్మేళనంలో పలువురు కవులు తమ తమ కవితా గానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు.

# సంతోష్‌నగర్ పోలీసు స్టేషన్‌లో యువకుడి అక్రమ నిర్బంధంపై హెచ్‌ఆర్‌సి సీరియస్

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** సంతోష్ నగర్ పోలీసు స్టేషన్‌లో ప్రశాంత్ కుమార్ అనే యువకుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించడంతో పాటు చేయనితప్పును ఒప్పుకోమని బలవంతం చేయడంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం తీవ్రంగా స్పందించింది. దీని పై బాధితుడు కోర్టులో పోరాడుతుండగా దీనిని వెనక్కు తీసుకోవాలని సదరు యువకుడిని పోలీసులు మళ్లీ వేధిస్తుండడం సరైంది కాదని, ఈ విషయంలో వెంటనే పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిజిపి జితేందర్‌కు హెచ్‌ఆర్‌సి సిఫార్సు చేసింది. ఫిర్యాదుదారుల భద్రతను పోలీసులు కాలరాయడం సరికాదని హెచ్‌ఆ ర్‌సి పేర్కొంది. ఫిర్యాదిదారుడిని పోలీసులు పదేపదే బెదిరించడం సరైంది కాదని హెచ్‌ఆర్‌సి పేర్కొంది.

# గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఎప్పుడిస్తారు?

## సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రమాదాలకు గురై మరణించిన కల్లుగీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికులు వృత్తిలో భాగంగా అనేక విధాలా ప్రమాదాలకు గురౌతున్నారని.. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకుంటున్నా హామీలే ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదన్నారు. ప్రమాదాలకు గురైన వారికి తక్షణమే రాష్ట్రప్రభుత్వం బాధితులకు ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ కాలంలో దాదాపు 710 మంది వృత్తిదారులు ప్రమాదాలకు గురైతే వారిలో 130మంది మరణించగా 120 మంది శాశ్వత వికలాంగులయ్యారని సుమారు 460 మంది వికలాంగులయ్యారని గుర్తు చేశారు. ప్రమాదాలకు గురైన వారికి రూ.12.96 కోట్ల నిధులు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందన్నారు.

# రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు

## దరఖాస్తుల తిరస్కారానికి సరైన కారణాలు చూపాలి

## ఆగస్టు 15 నాటికి వీలైనన్ని భూ సమస్యలు పరిష్కరించాలి

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏ సమస్యా రాకూడదు

## కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై22:** తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సిఎస్ కె. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసినప్పుడే దాని ఫలితాలు సామా న్యులకు అందుతాయని అన్నారు. మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సామా న్యులను ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్ప వని సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం ఉందని ఇది పునరావృతం కాకుండా చూడాలని కలెక్ట ర్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో 8.65లక్షల దరఖాస్తులు వచ్చాయని ఇందులో ప్రధానంగా సాదాబైనామా, సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్, అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్ కు సంబంధించి సుమారు 6 లక్షల దరఖాస్తులు వచ్చా యని వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్టు 15వ తేదీలోగా వీలైనన్ని సమస్యలను పరిష్కరించాల న్నారు. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్దం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్ధిదారు ల వివరాలను ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు. దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టం వచ్చిన రీతిలో తిరస్కరించకూడదని, తిరస్కారానికి గల కారణా లను లిఖిత పూర్వకంగా దరఖాసు దారునికి తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జీపీవోలకు, జెఎన్‌టియు ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేసుకొని పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలన్నారు. పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ధరలు, చెల్లింపులు, ఇసుక, సిమ్మెంట్, స్టీల్ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏ సమస్య రాకుండా చూడాలని అలాగే ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, ఇది సరైన విధంగా లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలో ఇసుక అందేవిధంగా చూడాలన్నారు. బేస్‌మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబా టులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్దిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్య కాదని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ 1, ఎల్2, ఎల్3 జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్ధికంగా ఎన్ని ఇబ్బందులున్నా కూడా ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని అయితే సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించి లబ్దిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. 2 బిహెచ్‌కే ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలన్నారు.



# తల్లులకు కేసీఆర్ కిట్లను అందించిన కెటిఆర్

## గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ భవన్‌లో కిట్ల పంపిణి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై22:** కెసిఆర్‌కు మంచి పేరు వస్తుందన్న ఉక్రోశంతోనే రేవంత్ ప్రభుత్వం కెసిఆర్ కిట్లను ఇవ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో మాత శిశు మరణాలు గణ నీయంగా తగ్గి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్ కిట్లను ఇస్తానని కెటిఆర్ ప్రకటించారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తల్లి బిడ్డలకు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ కిట్లను అందించారు. గత 20 నెలల నుంచి కేసీఆర్ కిట్లను ఇవ్వకపోవడంతో చాలామంది తల్లులు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. అందుకే తన పుట్టిన రోజు సందర్భంగా 5 వేల మంది తల్లులకు సిరిసిల్లలో కేసీఆర్ కిట్లను ఇవ్వను న్నట్లు తెలిపారు. 2014 కు ముందు నేను రాను బిడ్డో సర్కారు దవఖానకు అని జనాలు భయపడేవారన్న కేటీఆర్, ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న చర్యలతో సర్కార్ దవాఖానాకే పోవాలని జనాలంతా అనుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చిన కేసీఆర్ కిట్లను గత 20 నెలల నుంచి రేవంత్ సర్కార్ ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. కేసీఆర్ మీద ఉన్న అంతులేని ద్వేషం, కోపమే ఇందుకు కారణమని విమర్శించారు.

# అడుగడుగున బిసిలను మోసగిస్తున్న కాంగ్రెస్

## రిజర్వేషన్లపై బీసీ నేతలతో కెటిఆర్ సమావేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై22:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి మోసపూరిత వైఖరినే అనుసరిస్తుందని బిఆర్ఎస్ పార్టీ అభిప్రాయపడింది. కులగణన నుండి ప్రారంభించి, ప్రస్తుత ప్రభుత్వం తీసుకువస్తున్న ఆర్డినెన్స్ వరకు అన్ని స్థాయిల్లోనూ బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలైన లక్ష్యంగా ఉందని విమర్శించింది. బోనాల పండుగ సందర్భంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో అందుబాటులో ఉన్న బీసీ ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహపూరిత కార్యక్ర మాలు చేస్తుందంటూ పైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కేవలం బీసీలను మోసం చేయాలన్న దురుద్దేశంతోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశంలో, ప్రతి సందర్భంలో చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందని బీసీ నేతలు అభిప్రాయ పడ్డారు. తాము తీసుకువచ్చిన చట్టం ఆమోదం పొందదని తెలిసినా, మరోసారి ఆర్డినెన్స్ పేరుతో కొత్త నాటకానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని వారు పేర్కొన్నారు. కుల గణన జీవో నుండి గణన ప్రక్రియ వరకు బీసీల సంఖ్యను తగ్గించి చూపడంలో కాంగ్రెస్ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా బీసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందన్నారు. తాము చేపట్టిన ప్రతి ప్రక్రియలో ఉన్న లోపాలు లొసుగులు ముందే తెలిసినా, బీసీలను మోసం చేయాలన్న దురా లోచనతో ఇప్పుడు కోర్టుల పేరుతో, చట్టపరమైన నిబంధనలు చూపిస్తూ తప్పించుకోవడానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కులగనన మరింత శాస్త్రీయంగా జరగాలని చెప్పే కాంగ్రెస్ పార్టీ... అత్యంత లోప బూయిష్టంగా దురుద్దేశపూర్వకంగా నిర్వహించిన కుల గణన సర్వేను జాతీయ రోల్ మోడల్‌గా చెప్పడం ద్వారా తెలంగాణ ప్రజల్ని మోసం చేయడమే కాకుండా, జాతీయ వేదికలపై అబద్ధాలు చెబుతున్నదని నేతలు మండిపడ్డారు. ఒకవైపు 42శాతం రిజర్వేషన్ల అంశంలో బీసీ లను మోసం చేస్తూనే, బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కూడా కాంగ్రెస్ అమలు చేయకుండా బీసీలను మభ్యపెడుతుందని బిఆర్ ఎస్ బీసీనేతలు అభిప్రాయపడ్డారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల కోసం ప్రారంభించిన పథకాలను రద్దుచేసి కొత్త పథ కాలు ప్రారంభించకపోవడం ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీ వారికి చేస్తున్న ద్రోహమే అన్నారు.

# యూరియా కొరత లేదు

## గత ఏడాది కంటే 18 శాతం ఎక్కువ సరఫరా: వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేదని వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్ తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ రోజు వరకూ దాదాపు 18 శాతం అధికంగా యూరియాను సరఫరా చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలో వ్యవసాయ కార్యకలాపాలు వేగంగా సాగుతున్న తరుణంలో యూరియా సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయేతర వినియోగానికి యూరియాను మళ్లించే అవకాశం ఉన్నందున వాటిని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. అలాగే యూరియాకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. యూరియా నిల్వలు, మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతున్నట్లయితే రైతులు 8977741771కు ఫోన్ చేయాలన్నారు. అలాగే సహకార సంఘాల్లో యూరియా స్టాక్ బోర్డును ప్రదర్శించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని సంఘాలు ఉదయం 8 నుండి అందుబాటులో ఉండాలని వెల్లడించారు. రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయాలని అదేశించారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద యూరియా తరలింపును తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ డైరక్టర్ డాక్టర్ బి గోపి తదితరులు పాల్గొన్నారు.

**తీవ్రమవుతున్న యూరియా కొరత రోడెక్కుతున్న అన్నదాతలు :**యూరియా కొరత రాష్ట్రంలో రాను రాను తీవ్రమవుతోంది. యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా యూరియా సరఫరా లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల కోసం రైతులు డిపోల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఎరువుల డిపోల వద్ద పెద్ద సంఖ్యలో రైతులు గుమిగూడుతుండటంతో పోలీసు భద్రత ఏర్పాటుచేయాల్సి వస్తుండటం గమనార్హం. అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరడం, కొన్నిచోట్ల చెప్పులు, సంచులు క్యూలై న్లలో ఉంచడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడు తున్నది. వికారాబాద్ జిల్లా, ధారూరు మండల కేంద్రం, హరిదాసుపల్లి పీఏసీఎసలకు రెండు లారీల యూరియా వచ్చింది. దీంతో రైతులు యూరియా కోసం ధారూరు పీఏసీఎస్ కార్యాలయం ముందు క్యూ కట్టారు. యూరియా 500 బస్తాలే రావటంతో రైతుకు రెండు బస్తాల చొప్పున 250 మంది రైతులకు ఇచ్చి సరిపెట్టారు. యూరియా కొరతపై సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదనేది రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మహబూబ్ నగర్ జిల్లాలో యూరియాకు కొరత తలెత్తుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సింగిల్ విండో సహకార సంఘాలు నిధులు లేవన్న సాకుతో తమకు కేటాయించిన దానికి అనుగుణంగా యూరియా తెప్పించుకోలేకపో తున్నాయి. ఈ నేపథ్యంలో మక్తల్ తదితర ప్రాంతాల్లో సహకార సంఘాల వద్ద రైతులు యూరియా కోసం పాస్‌బుక్కులను బారులుగా పెట్టి కాపు కాయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. అలాగే యూరి యా కొరత ఏర్పడి రైతులు ఆందోళన బాటపట్టారు. ఇదే సమస్యపై కొద్ది రోజులుగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల నిరసన తెలిపిన రైతులుహనుమకొండ జిల్లా శాయంపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించారు.

# రైతుల కోసం కొత్త వంగడాలు: అధిగ దిగుబడి ఇచ్చే లక్ష్యం

## ఇక్రిశాట్, ఐఆర్ఆర్ విప్లవాత్మక పరిశోధనలు

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** తెలంగాణ రైతుల కోసం భారత వరి పరిశోధన సంస్థ, ఇక్రిశాట్ సంస్థలు సరికొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నాయి. ఐఆర్ఆర్ ఎకరానికి పది టన్నుల దిగుబడినిచ్చే వరి వంగడాన్ని 2027 నాటికి అందుబాటులోకి తేనుంది. ఇక్రిశాట్ ర్యాపిడ్ రాగి అనే నూతన రాగి వంగడాన్ని రూపొందించింది, ఇది చిరుధాన్యాల సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ఈ పరిశోధనలు తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరిని ఇవ్వనున్నాయి. తెలంగాణ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు తగిన దిగుబడి రాక నిరాశ చెందుతున్న పరిస్థితులకు ఇకపై తెరపడనుంది. భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు చీడపీడలను తట్టుకుని, దిగుబడిని గణనీయంగా పెంచే కొత్త రకం వరి వంగడాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇదే సమయంలో ఇక్రిశాట్ (అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ) కూడా ర్యాపిడ్ రాగి అనే నూతన వంగడాన్ని రూపొందించి. చిరుధాన్యాల సాగులో నూతన ఆశలు రేపుతోంది. మరోపక్క సాధా ణంగా ఒక ఎకరం వరి పొలంలో 150 నుండి 200 వడ్ల గింజలతో 2 నుంచి 2.5 టన్నుల దిగుబడి వస్తుంటుంది. గత సంవత్సరం అక్టోబర్‌లో విడుదలైన డీఆర్ఆర్ ధాన్ 75, 76 రకాల్లో కంకికి 450 నుండి 500 గింజలు వచ్చి 3.5 నుంచి 4.5 టన్నుల దిగుబడిని ఇచ్చాయి. ఇప్పుడు, ఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు దీనికి రెట్టింపు స్థాయిలో కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి 10 టన్నుల భారీ దిగుబడిని సాధించే దిశగా కొత్త వరి వంగడాన్ని సిద్ధం చేస్తున్నారు. కంకికి వెయ్యి గింజలతో ఎకరం విస్తీర్ణం గల భూమిలో పది టన్నులు పండే వరి వంగడం 2027 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తేవాలని సంకల్పించినట్లు ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. దీనిపై ప్రాథమిక ప్రయోగాలు ఇప్పటికే పూర్తయ్యాయి. తుది ఫలితాలు వచ్చాక, మరో రెండేళ్ళలో ఈ వంగడాలు రైతులకు అందుబాటులోకి వస్తాయ న్నారు. హైబ్రిడ్ విధానంలో కాకుండా సంప్రదా య రకాల కలయిక ద్వారా ఈ కొత్త రకాన్ని సృష్టిస్తున్నారు. తక్కువ కాలవ్యవధిలో సాగయ్యే సన్న రకంగా, తెగుళ్లను తట్టుకునే విధంగా, గ్లూకోజ్ శాతం తక్కువగా ఉండేలా దీన్ని రూపొందిస్తున్నారు. ఇది వరి సాగులో ఒక కొత్త చరిత్రను సృష్టిస్తుందని, ప్రస్తుతం చైనాలో హైబ్రిడ్ వరి ఎకరానికి 6 టన్నులు వస్తుంటే, దాన్ని అధిగమించి రైతులకు ఉత్పాదకతను, దేశానికి ఆహార భద్రతను రెట్టింపు చేస్తుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త రకం విత్తనోత్పత్తికీ ఇది అనుకూలం. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలకు సంపూర్ణ పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు (మిల్లెట్స్) పరిష్కార మార్గంగా మారుతున్నాయి. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఊదలు, సామలు, అరికెలను మరింతగా వినియోగంలోకి తెచ్చేందుకు విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇక్రిశాట్ రాగులపై విస్తృత పరిశోధనలు చేసి, ర్యాపిడ్ రాగి అనే పేరుతో ఒక కొత్త వంగడాన్ని అభివృద్ధి చేసింది.

# ఇకపై పాఠశాలల్లోనే ఆధార్‌కార్డు నవీకరణ:

## యుఐడిఎఐ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, జూలై 22:** చిన్నపిల్లల ఆధార్‌కార్డుల అప్‌డేషన్ విషయంలో తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలను స్కూల్‌లో చేర్పించే సమయంలో బాల ఆధార్‌కార్డులు తీసుకుంటున్నారు. కానీ, వారికి ఐదేళ్ల దాటిన తర్వాత ఆధార్‌కార్డు అప్‌డేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలా ఐదేళ్ల వయసు దాటిన తర్వాత ఆధార్‌కార్డు నవీకరణ చేయించుకోని చిన్నారులు దేశవ్యాప్తంగా ఏడు కోట్ల మందికిపైగా ఉన్నట్లు యుఐడిఎఐ తాజాగా వెల్లడించింది. అలాంటి వారికోసం యుఐడిఎఐ కొత్త వెసులుబాటు తీసుకొస్తోంది. పిల్లలు చదువుకునే స్కూళ్లలోనే ఆధార్ అప్‌డేషన్ చేసే విధంగా ఒక ప్రాజెక్టును ప్రారంభించినట్లు యుఐఇఎఐ సిఇఒ భువనేశ్‌కుమార్ తెలిపారు. ప్రతి స్కూల్‌కు వెళ్లి ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేసేందుకు కావాల్సిన టెక్నాలజీని పరీక్షిస్తున్నామని మరో 45 నుంచి 60 రోజుల్లో ఇది సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

# పాకిస్థాన్‌లో ఆకస్మిక వరదలు

## నలుగురు మృతి.. 30మందికిపైగా గల్లంతు

**ఇస్లామాబాద్, జూలై 22:** పాకిస్థాన్‌లో ఆకస్మిక వరదలు అతలాకులం చేశాయి. గిల్గిట్-బాల్టిస్థాన్‌లోని పర్యాటక కేంద్రం దగ్గర హఠాత్తుగా వరదలు సంభవించాయి. దీంతో ఒక మహిళ సహా నలుగురు పర్యాటకులు మృతి చెందారు. దాదాపు 30 మందికిపైగా వరదల్లో కొట్టుకుపోయారని మంగళవారం అధికారులు తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని గిల్గిట్-బాల్టిస్థాన్ ప్రాంతంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఒక్కసారిగా వరదలు సంభవించడంతో పర్యాటక వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయని ప్రాంతీయ ప్రభుత్వ ప్రతినిధి ఫైజుల్లా ఫరాక్ తెలిపారు.

# వైకుంఠమ్-3 క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై నిపుణుల కమిటీ!

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంక టేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరాన్ని పరిశీలిం చేందుకు నిపుణులతో టిటిడి కమిటీ వేయనుంది. ఈ కమిటీ క్షుణ్ణంగా ఇప్పుడున్న పరిస్థితులను అం చనావేసి, ఆలయం వెలు పల క్యూలైన్లను నియంత్రించేందుకు అధ్యయనం చేయనుంది. ఆ తరువాత సమర్పించే నివేదిక ఆధారంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా తిరుమలలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు టిటిడి పాల కమండలి నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే తిరు మలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరుతుండటంతో అందుకు అనుగుణంగా భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో లాంజ్‌ల తరహాలో విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటుచేయ నుంది. అనువైన నిర్మాణాలు చేపట్ట డంపై కన్సల్టెన్సీలతో కమిటీ ఏర్పాటు కానుంది. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు ఇతోధికంగా సేవలందిస్తున్న శ్రీవారిసేవ స్వచ్ఛంద సేవను మరింత విస్తరించి పటిష్టంగా అమలు చేసేందుకు నలు గురు కోఆర్డినేటర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీచేయ నున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో 85 ప్రతిపాదనలతో టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది.



మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి పాలకమండలి సమావేశం దృశ్యం


## హోంగార్డులకు పెండింగ్ జీతాలను తక్షణమే విడుదల చేయాలి: హారీష్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై22:** హోంగార్డులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ప్రతి నెలా జీతాలు సమయానికి అందేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 16,000 మందికి పైగా హోంగార్డులు వేతనాల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తిందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతినెలా జీతాలు ఆలస్యమవుతున్నాయని, హోంగార్డులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

# నా ప్రాధాన్యత రాజకీయాలే

## మీడియాతో ఎపి డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ విష యంలోనైనా నిక్కచ్చిగా తాను ఉంటానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. తాను విధానాలకు కట్టుబడి ఉంటానన్నారు. రాజకీ యాల్లో పారదర్శకతే తనకు ఇష్టమన్నారు. మంగళవారం ఎపి సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. రాజకీయాం శాలపైన, తన కొత్త సినిమా హరిహర వీరమల్లు చిత్రం ప్రమో షన్స్‌పై ఆయన మాట్లాడారు, సినిమాలకు సంబంధించి తాను తీసుకునే ప్రతి నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెడతానన్నారు. ఆయన అభిప్రాయాలను గౌర వించే దిశలో తన నిర్ణయా లుంటాయన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ది చెప్పినప్పటికి



మాజీ ముఖ్యమంత్రి జగన్‌లో మార్పు రావ డంలేదన్నారు. ఇక హరిహర వీరమల్లు చిత్రం కోసం కష్ట పడి పని చేసాను. నేను రాజ కీయాల్లోకి వెళ్లినందున సినిమాలు ఏదో తూతూ మంత్రగా చేస్తాడని అనుకో వద్దని ఇందులో చాలాకష్ట పడ్డాను. కెరీర్ ప్రారంభంలో ఎలా చేశానో ఇప్పుడు కూడా మార్షల్ ఆర్ట్స్ కోసం అంతేకష్ట పడ్డా. అయితే కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా ఉండడం వల్ల బాడీ ఫ్లెక్సిబిలిటీ పోయింది. శరీ రం సహక రించలేదు. అయినా శ్రమించానన్నారు.

# బిజెపి ఎంపీలకు లంచ్ ఇచ్చిన విశ్వేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై22:** చేవేళ్ళ లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర రెడ్డి మంగళవారం రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలకు తన నివాసంలో ఆతిథ్యం (లంచ్) ఇచ్చారు. పార్లమెంటు సమావేశాల ప్రారం భమైన నేపథ్యంలో కొండా ఇచ్చిన విందుకు ఎంపీలు రఘునందన్ రావు, డికె అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, జి. నగేష్ హాజరయ్యారు. కాగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పార్లమెంటు సమావేశాల్లో బిజీగా ఉన్నందున కొండా విశ్వేశ్వర రెడ్డి ఇచ్చిన విందుకు హాజరుకాలేదు.

# పీడితుల పక్షాన నిలిచిన కలం దాశరథి:కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి హైదరాబాద్, జూలై 22:**నా తెలంగాణ కోటి రతనాల వీణ'.. అంటూ తెలంగాణ గరిమను, తన సాహిత్యం ద్వారా ప్రపంచానికి చాటిన గొప్ప తెలంగాణ కవి, దాశరథి కృష్ణమాచార్య అని బీఆర్ఎస్ అధినే తకేసీఆర్ తెలిపారు. దాశరథి శత జయంతి సం దర్భంగావారికృషిని కేసీఆర్ స్మరించుకున్నారు.

# పర్యాటక శాఖ స్వయం సంమృద్ధిసాధించాలి


## అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్ధేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూలై22:**ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక ప్రదేశంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పని చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. మంగళవారం హిమయత్‌నగర్ లోని పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో పర్యాటక ప్రగతిపై మంత్రి జూపల్లి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, టీజీటీడీసీ మేనేజింగ్ డెరెక్టర్ వల్లూరు క్రాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బలహీనమైన పాస్‌వర్డ్..158 యేళ్ల కంపెనీ కెఎన్‌పి లాజిస్టిక్ మూత

## 700 మంది ఉద్యోగులు రోడ్డుపైకి..

## కంపెనీ సిస్టంలోకి చొరబడిన సైబర్ నేరస్థులు





**లండన్, జూలై 22:** పాస్‌వర్డ్ ఏర్పాటు విషయంలో నిరక్ష్యం ఒక కంపెనీ మూతపడడానికి దారితీ సింది. 158 యేళ్లుగా విజయవంతంగా కొనసా గుతున్న ఆ సంస్థ ప్రస్తుతం మూతపడనుంది. దీంతో 700 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. దీనంతటికీ కారణం 'బలహీనమైన పాస్‌వర్డ్'.. పాస్‌వర్డ్ పటిష్ఠంగా లేకపోవడంతో సైబర్ నేరగాళ్లు కంపెనీ సిస్టమ్‌లోకి ఎంటరై కీలకమైన సమాచారాన్ని తమ నియంత్రణలో పెట్టుకున్నారు. ఉద్యోగులకు ఆ సమాచారం అందకుండా చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రఖ్యాత లాజిస్టిక్ కంపెనీ 'కెఎన్‌పి లాజిస్టిక్'కు ఈ సంకట పరిస్థితి ఎదురైంది. కంపెనీకి చెందిన 500 లారీలు నిత్యం వినియోగదారుల సరుకులను దేశవిదేశాలకు చేరవేస్తుంటాయి. 'నైట్ ఆఫ్ ఓల్డ్ బ్రాండ్' పేరుతో ఈ లారీలు తిరుగు తుంటాయి. అయితే, ఇటీవల కంపెనీ ఉద్యోగు లలో ఒకరి పాస్‌వర్డ్‌ను ఊహించిన హ్యాకర్లు.. కెఎన్‌పి సిస్టంలోకి ఎంటరయ్యారు. సంస్థ ఉద్యోగులకు పలు కీలక సమాచారం పొందేందుకు వీలు లేకుండా చేశారని కేఎన్‌పి డైరెక్టర్ పాల్ అబాట్ వివరించారు. హ్యాకర్లు భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తున్నారని, అంత మొత్తం ఇచ్చుకునే పరిస్థితి లేదన్నారు. దీంతో తమ ముందు ఉన్న ఏకైక అవకాశం కంపెనీని మూసేయడమేనని చెప్పారు. అయితే, హ్యాకర్లు ఎంత డిమాండ్ చేశారనేది పాల్ అబాట్ వెల్లడించలేదు. సైబర్ నిపుణుల అంచనాల ప్రకారం.. ఈ హ్యాకింగ్ అకీరా గ్యాంగ్ పనే అయి ఉంటుందని, 50 లక్షల పౌండ్స్ డిమాండ్ చేసి ఉంటారని అంచనా. కాగా, ఈ సైబర్ అటాక్ కారణంగా కంపెనీ మూతపడితే సంస్థలోని 700 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోనున్నారు.

# రాష్ట్ర పతికి కోర్టు గడువు విధించవచ్చా?

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, జూలై 22:** శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశిం చవచ్చా అనే అంశంపై మంగళవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. దీనిపై అభిప్రా యాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఇది ఒక రాష్ట్రానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, మొత్తం దేశానికి సంబంధించిన విషయమని గమనించాలని వ్యాఖ్యానించింది. శాసనసభలు ఆమోదించినబిల్లులపై ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి ఒక కాల వ్యవధిలోగా చర్యలు తీసుకోవాలని గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు పేర్కొంది.

దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తనకు రాజ్యాంగంలోని 143(1)అధికరణం ద్వారా సంక్రమించిన అధికా రాలను ఉపయోగించుకొని 14 కీలక ప్రశ్నలను అత్యున్నత న్యాయస్థానం ముందుంచారు. ప్రజాప్రయోజనంతో ముడిపడి ఉన్న చట్టపరమైన అంశాలపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం తెలుసుకునేందుకు ఆ కోర్టు ముందు తన ప్రశ్నను ఉంచవచ్చని, సుప్రీంకోర్టు దానిపై విచారణ జరిపి తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియ జేయ వచ్చని 143(1) అధికరణం తెలియజేస్తోంది.

# ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం

**న్యూఢిల్లీ, జూలై 22:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ మేరకు మంగళవారం ఫైల్‌పై సంతకం చేశారు. ఇదిలా ఉంటే.. జగదీప్ ధన్‌ఖడ్ మరో రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీ చేయడం దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు పంపించారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. మంగళవారం పరిశీలించి.. ఆమె ఆమోదించారు.

## విజయ్ కింగ్డమ్ కోసం సందీప్ వంగ?

టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ ది విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం కింగ్డమ్ కోసం అందరికీ తెలిసిందే. ఈ చిత్రం ఇంకొన్ని రోజుల్లోనే విడుదల కాబోతుండగా సాలిడ్ ప్రమోషన్స్ కోసం సినిమా సిద్ధం అవుతుంది. కింగ్డమ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ ప్రమోషన్స్‌లో విజయ్ బ్లాక్ బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగ భాగం కానున్నట్టుగా తెలుస్తుంది. విజయ్‌తో ఒక స్పెషల్ ఇంటర్వ్యూని వీరు ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

# తెర

# ప్రీమియర్ షో అ'ధర్ణ' హో..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న హరి హర వీరమల్లు చిత్రం జూలై 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా రిలీజ్‌కు ఒకరోజు ముందుగానే ప్రీమియర్ షోలకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని కొన్ని థియేటర్లలో హరి హర వీరమల్లు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

బుక్‌మైషోలో మాత్రమే కాకుండా డిస్ట్రిక్ట్ యాప్, బ్రో యాప్ వంటివి వేదికలలో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. జూలై 23న రాత్రి 9 గంటలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలలో ప్రీమియర్ షోలు వేయనున్నారు. దీనికోసం బుకింగ్స్ ఇలా ఓపెన్ అయ్యాయో లేదో అలా సోల్డ్ అవుట్ చూపిస్తుండటం విశేషం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు హరి హర వీరమల్లు చిత్రానికి టికెట్ ధరలను పెంచుతూ ప్రత్యేక అనుమతులు మంజూరు చేశాయి.

ఏపీలో జూలై 23న పెయిడ్ ప్రీమియర్ షోల కోసం ఒక్కో టికెట్ ధరను రూ.600 వరకు నిర్ణయించారు. ఎంపిక చేసిన సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్‌లలో ప్రీమియర్ షోను ప్రదర్శించనున్నారు. రెక్లయినర్/సోఫా సదుపాయం కలిగిన టికెట్ ధర దాదాపు రూ.1000 దాటింది. అలాగే బాల్కనీ ధర రూ.830 దాటగా.. సెకండ్ క్లాస్ రూ.790 (బుకింగ్ ఛార్జీలు అదనం)గా ఉన్నాయి.

ఇక జూలై 24 నుంచి మల్టీప్లెక్స్‌లలో పెంచిన ధరల ప్రకారం.. రాయల్ సీటింగ్‌లో రూ.495, ఎగ్జిక్యూటివ్ సీటింగ్‌లో రూ.377 ధర కనిపిస్తోంది. అదే సమయంలో సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో బాల్కనీ రూ.250 కాగా.. ఫస్ట్ క్లాస్ రూ.150గా నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా టికెట్ ధరల పెంపునకు ఆమోదం తెలిపింది. అయితే తెలంగాణలో పెయిడ్ ప్రీమియర్‌కు సంబంధించి ఇంకా బుకింగ్స్ ప్రారంభం కాలేదు. జూలై 24 నుంచి మల్టీప్లెక్స్‌లలో రాయల్ సీటింగ్ కోసం రూ.500గా నిర్ణయించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కోసం రూ.413 (బుకింగ్ ఛార్జీలు అదనం)గా ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ బుక్‌మై షోలో చూపిస్తోంది. అదే సమయంలో సింగిల్ స్క్రీన్‌లో బాల్కనీ రూ.300 కాగా, ఫ్రంట్ సర్కిల్‌లో రూ.200గా నిర్ణయించారు.

### 20 నిమిషాల తర్వాతే హరిహర ఎంట్రీ?

హరిహర వీరమల్లు సినిమాని నిర్మాత ఏ.ఎం.రత్నం, పవన్ కళ్యాణ్ కళ్యాణ్ కలిసి కొంతమంది స్నేహితులకు అలాగే రాజకీయవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు చూపించినట్టు సమాచారం.



సినిమా చూశాక వాళ్ళు తమ అభిప్రాయాన్ని షేర్ చేసుకున్నారు. హరిహర వీరమల్లు మొదటి 15 నిమిషాలకే అందరూ కథలో ఇన్వాల్వ్ అయిపోతాం అని, దాదాపు 20 నిమిషాల తర్వాత పవన్ కళ్యాణ్ ఎంట్రీ ఉంటుందని, ఆ తర్వాత ప్రేమ కథ, కామెడీ సన్నివేశాలు వస్తాయని చెబుతున్నారు. సనాతన ధర్మం గురించి వచ్చే డైలాగులు పవన్ వీరాభిమానులు మెచ్చే విధంగా ఉంటాయని చెబుతున్నారు.

### వీరమల్లు వచ్చేది నిశ్శబ్దంగా కాదు

ప్రీ రిలీజ్ వేడుకలో రచయితగా క్రిష్‌కి పవన్ గౌరవం ఇస్తూ మాట్లాడిన నేపథ్యంలో ఇప్పటివరకు సైలెంట్‌గా ఉన్న క్రిష్ ఓపెన్ అయ్యాడు. 'ఈ ప్రాజెక్ట్ మరెవరి వల్ల సాధ్యపడదు. పవన్ కళ్యాణ్‌లోని ఫైర్‌ను ఏ కెమెరా క్యాప్చ్యూర్ చేయలేదు. ఏ.ఎం.రత్నం అకుంఠిత దీక్ష మాత్రమే ఈ సినిమా పూర్తవ్వడానికి కారణం. ఇప్పుడు వీరమల్లు ప్రపంచంలోకి అడుగు పెట్టబోతోంది. కానీ నిశ్శబ్దంగా కాదు ఈ సినిమాకి ఇద్దరు లెజెండ్స్ ఫ్యాషనేటెడ్ జర్నీతో వస్తోంది. ఈ చిత్రం చేయడం తన కెరీర్ లోనే ఒక ఉద్వేగభరితమైన యుద్ధాల్లో ఒకటి. సినిమా రిలీజ్ అయ్యి మంచి విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాన్ను అని పేర్కొన్నారు. అయితే.. క్రిష్ తన ట్వీట్‌లో ఎక్కడా ప్రస్తుత దర్శకుడు జ్యోతి కృష్ణ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం.



### కొట్టుకో.. కొట్టుకో.. తీన్ మార్

పవన్ కళ్యాణ్ సినిమాకు కీరవాణి పని చేయడం ఇదే మొదటిసారి. అందులోనూ పవన్ అంటే ఆయనకు విపరీతమైన అభిమానం. ఆ అభిమానాన్ని పవన్ సినామా టైటిళ్లతో ఓ పాట రూపంలో తీర్చిదిద్ది హరిహర వీరమల్లు పీ రిలీజ్ వేదికపై చాటుకొన్నారు. గోకులంలో సీత వెదికింది.. అత్తారింటికి దారేదని.. అక్కడ అమ్మాయికి ఇక్కడ అబ్బాయి దొరికితే ఖుషి.. తమ్ముడూ.. హే తమ్ముడూ ఎక్కడున్నాడు ఆ కాటమరాయుడు? తమ్ముడూ.. హే తమ్ముడూ ఆ అజ్ఞాతవాసిని వెదికి పట్టుకో.. నేడుపులి పంజాకైనా దొరకని గబ్బర్ సింగ్ వాడూ సర్దార్ గబ్బర్ సింగ్ వాడూ..బెదిరిస్తే వస్తాడా.. నెవ్వర్.. హీ హీజ్ గుడుంబా.. శంకర్ పెరిగి పోతోందిక్కడ.. ఫీవర్.. కొట్టుకో.. కొట్టుకో.. తీన్ మార్. మా బంగారానికి నీపై తొలిప్రేమ పుట్టింది బ్రో.. ఈ వకీలు సాబే తన లైఫ్‌లోన జానీ అంటోంది బ్రో. ఈ బాలుని.. ఈ బద్రిని.. ఈ భీమ్లా నాయక్‌ని గోపాల గోపాల మాంగళ్య మంత్రాల అన్నవరంలో పెళ్లాడు.. మంత్రాల జల్సాల వేదికకి సుస్వాగతం.. ఆ సునామికి సుస్వాగతం. ఇది అరాచకం.. ఇది అరాచకం రాంబాబూ.. నువ్వు రెడీ అయిపో.. నీ కెమెరాతో.. నువ్వు రెడీ అయిపో ఆ గంగతో.. ఇకరెచ్చిపో..వస్తున్నాడొస్తున్నా దొస్తున్నా దహో.. వచ్చేశాడొచ్చేశాడొచ్చేశాహో.. ఎవ్వడూ.. హరి హర వీర మల్లు..!




### సీక్వెల్ ఆశలు సజీవం

ఈ సినిమా సీక్వెల్‌ను ఉద్దేశించి పవన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. హరిహర వీరమల్లు మొదటి భాగం చాలా బాగా వచ్చిందని. సినిమాలో మంచి మెసేజ్ ఉంటుందని, చరిత్రని కళ్ళకు కట్టినట్టు చూపించడానికి నిర్మాత ఏ.ఎం.రత్నం ముందుకొచ్చారని. 2వ భాగాన్ని కూడా జనాల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఆయన చేస్తున్నారని పవన్ అన్నారు.

## బుల్లితెర రాకుమారి



యాంకర్ శ్రీముఖి ఆరెంజ్ లెహంగాలో రాకుమారిలా ముస్తాబైన లేటెస్ట్ ఫొటో షూట్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించింది. బుల్లితెర బ్యూటీ యాంకర్ శ్రీముఖి ప్రస్తుతం చేతి నిండా షోలు, ఈవెంట్లతో కెరీర్‌ని సక్సెస్ ఫుల్‌గా లీడ్ చేస్తోంది. ఓ వైపు షోలు ఈవెంట్లతో బిజీగా ఉన్నప్పటికీ తన యూట్యూబ్ ఛానెల్, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఫుల్ యాక్టీవ్ కనిపిస్తుంది. వ్లాగ్స్, రీల్స్, లేటెస్ట్ ఫొటోషూట్లత్ ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంటూ ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఆరెంజ్ లెహంగాలో రాకుమారిలా ముస్తాబైన శ్రీముఖి అందాలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ ఫొటోలపై అభిమానులతో సహ బుల్లితెర నటులు లైకులు వర్షం కురిపిస్తున్నారు. సూపర్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం శ్రీముఖి స్టార్ మా ఛానెల్‌లో ఆదివారం విత్ స్టార్ మా పరివారం, కిర్రాక్ బాయ్స్ కిలాడీ గర్ల్స్ షోలు హోస్ట్ చేస్తుంది. వీటితో ప్రీ రిలీజ్ ఈవెంట్స్, స్పెషల్ ఈవెంట్స్‌తో బిజీగా ఉంటోంది. షోలు, హోస్టింగ్ మాత్రమే కాదు నటిగా కూడా తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంది శ్రీముఖి. జులాయి, నేను శైలజ, భోళా శంకర్ వంటి సినిమాల్లో స్టార్ హీరోలతో నటించే అవకాశం దక్కించుకుంది. శ్రీముఖి పటాస్ కామెడీ షోతో ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత బిగ్ బాస్ సీజన్ 3 రన్నరప్ మరింత పాపులారిటీ తెచ్చుకుంది. శ్రీముఖి డ్రామా జూనియర్స్, సరిగమపా, అదుర్స్ వంటి పాపులర్ షోస్ హోస్ట్ చేసింది.



## వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్



పవన్ కళ్యాణ్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో శ్రీలీలతో పాటు రాశీ ఖన్నా కూడా మరో ఫీమేల్ లీడ్‌గా కనిపించబోతున్నారని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఉస్తాద్ భగత్ సింగ్‌లో రాశీ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో రాశీ శ్లోక అనే పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిపారు. పోస్టర్ లో రాశీ మెడలో కెమెరా వేసుకొని స్టైలిష్ గా కనిపించింది. చూస్తుంటే.. సినిమాలో రాశీ ఓ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ అన్నట్లుగా అనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే హైదరాబాద్ లో కొత్త షెడ్యూల్ ప్రారంభించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ డీఎస్పీ సంగీతం అందిస్తున్నారు. పవన్ ఫ్యాన్స్‌ని అలరించే మాస్ అంశాలు, ఎలివేషన్స్, విజిల్ మార్క్ సన్నివేశాలు ఈ సినిమాలో పుష్కలంగా ఉంటాయని తెలుస్తోంది. అంతేగాదు కథ, కథనం పాత్రలు అన్నీ కొత్తగా ఉంటాయని, పవన్ ని ఇప్పటివరకు చూడని ఒక డిఫరెంట్ యాంగిల్‌లో చూడబోతున్నారని హరీష్ శంకర్ తెలిపారు.



## 25 వసంతాల వేళ..

జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరూ సినీ పరిశ్రమలో అడుగుపెట్టి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. జులై 25న ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వార్ 2 ట్రైలర్ విడుదల చేయాలని నిర్ణయించినట్లు మేకర్స్ ప్రకటించారు. మరోవైపు ఈ చిత్ర తెలుగు ప్రీరిలీజ్ ఈవెంట్‌ను విజయవాడలో ఘనంగా నిర్వహిస్తారని.. దీని కోసం ఎన్టీఆర్ స్వయంగా బాధ్యతలు తీసుకున్నాడని.. ఇక ఈ ఈవెంట్ కోసం హృతిక్ రోషన్ కూడా వస్తాడని సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఆగస్టు రెండో వారంలో నిర్వహించేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారని సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా ఈ చిత్రాన్ని ఆగస్టు 14న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలుచేస్తున్నారు. 2019 లో బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన వార్ సీక్వెల్‌గా వార్ 2 రూపొందించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హృతిక్ కబీర్ పాత్రలో తిరిగి వస్తుండగా.. ఎన్టీఆర్ మరో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇందులో బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఫీమేల్ లీడ్‌గా నటించింది. జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న ఈ సినిమాను తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## పరాశక్తికి రానా కీలకం?

తమిళ స్టార్ హీరో శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న పరాశక్తి లేటెస్ట్ షెడ్యూల్‌ను తమిళనాడులోని కోయంబత్తూరు, పొల్లాచిలో నిర్వహిస్తున్నారు. హీరో శివ కార్తికేయన్, హీరోయిన్ శ్రీలీల..లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో హీరో రానా కూడా పాల్గొన్నట్టు తెలుస్తోంది. రానాకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇందులో మీసాలు పెంచి కనిపిస్తున్నాడు రానా. దాదాపు శివ కార్తికేయన్ లుక్ కూడా ఇలానే ఉంది. దీంతో ఈ సినిమాలో టాలీవుడ్ హీరో రానా కూడా కీలక పాత్ర పోషించనున్నారన్న వార్తలు వస్తున్నాయి. దీనిపై టీం అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గురు ఆకాశం నీ హద్దురా వంటి సూపర్ హిట్ సినిమాలు అందించిన సుధా కొంగర ఈ చిత్రానికి దర్శకుడు. జయం రవి అలియాస్ రవి మోహన్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండగా శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.



మరో తమిళ హీరో అథర్వ మురళి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై తిరుచిరాపల్లి, ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 5కి రిలీజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## వింత జంతువుల నుంచి ప్రతిఘటన

చాలా గ్యాప్ తర్వాత హాలీవుడ్ నుంచి ఓ ప్రిడేటర్ చిత్రం ప్రిడేటర్ బ్యాడ్ ల్యాండ్స్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. గతంలో ప్రే, 10 క్లవ్‌ర్ ఫీల్డ్ వంటి విజయవంతమైన చిత్రాలను రూపొందించిన డాన్ ట్రాచ్టెన్‌బర్గ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా 20 సెంచరీ స్టూడియోస్ నిర్మించింది. ఎల్లే ఫానింగ్, డిమిట్రియస్ షుస్టర్కో లోమాతంగి లీడ్ రోల్స్‌లో నటించారు. నవంబర్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ మూవీ ట్రైలర్ విడుదల చేశారు.

ఇక.. ఈ ట్రైలర్ విషయానికి వస్తే చూసే ప్రతిఒక్కరికి గూస్‌బంప్స్ వచ్చేలా ఉంది. ఇప్పటివరకు ఈ ప్రెడేటర్ సిరీస్ ఫ్రాంఛైజీలో ఆరు చిత్రాలు రాగా ఇది ఎడవ చిత్రం. అంతేగాక ఈ ఆరు చిత్రాలలో ప్రతీసారి మనుషులతోనే పోరాడిన ప్రెడేటర్.. ఈ సినిమాలో మాత్రం కథ భిన్నంగా ఉండనుంది. అనుకోకుండా ఓ గ్రహం పైకి వచ్చిన ప్రెడేటర్‌కు అక్కడి వింత, భయంకరమైన జంతువుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుంది.

అంతేగాక అక్కడే ఉండే రోబోట్స్, హై లెవల్ టెక్నాలజీని ఉపయోగించే మనుషులతోనూ పోరాడాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితుల్లో మొండెం వరకు మాత్రమే ఉండే ఓ యువతి ఆ ప్రెడేటర్‌కు సాయం చేస్తుంది. ఈ క్రమంలో వారు అక్కడి నుంచి సురక్షితంగా బయట పడ్డారా లేదా, అక్కడి జంతువుల, రోబోట్స్‌ను ఎలా ఎదుర్కొన్నారనే స్టోరీతో ప్రెడేటర్ బ్యాడ్ ల్యాండ్స్ సినిమా ఉండనుంది.

ఈ నేపథ్యంలో.. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌ను చూస్తే ఇప్పటివరకు వచ్చిన చాలా హాలీవుడ్ సినిమాలను మించిన విజువల్స్, గ్రాఫిక్స్‌ను తలదన్నేలా ఉన్నాయి. ముఖ్యంగా యానిమల్స్ అయితే నెవర్ భిఫోర్ అనేలా ఉన్నాయి. ఒక్కసారి ట్రైలర్

## గుర్రం పాపిరెడ్డికి స్పెషల్ అట్రాక్షన్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా గుర్రం పాపిరెడ్డి. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేను సడ్డి, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. త్వరలో గుర్రం పాపిరెడ్డి సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా నుంచి ప్రముఖ నటుడు యోగిబాబుకు జన్మదిన శుభాకాంక్షలతో స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో యోగిబాబు ఉగ్రాజు అనే పాత్రలో సందడి చేయబోతున్నారు. ఆయన పర్‌ఫార్మెన్స్ ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. పర్ఫెక్ట్ డార్క్ కామెడీ మూవీగా గుర్రం పాపిరెడ్డి సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా డిజైన్ చేసిన క్యారెక్టర్స్‌ను హైదరాబాద్ సిటీ బ్యాక్ డ్రాప్‌లో కాంటెంపరరీగా, స్టైలిష్‌గా ప్రెజెంట్ చేస్తున్నారు దర్శకుడు మురళీ మనోహర్. నటీనటులు నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా, బ్రహ్మానందం, యోగి బాబు, తదితరులున్నారు.



## వాళ్లు నన్ను అలా పిలవమనేవాళ్లు

అందాల హాట్ యాంకర్ అనసూయ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జబర్దస్త్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ సినిమాల్లో కూడా బిజీ అయ్యింది. ఇక అనసూయ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అంటే రంగస్థలమే. రామ్ చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రంగమత్త పాత్రలో అనసూయ నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా హిట్ తరువాతనే టాలీవుడ్ అనసూయ బిజీగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో రంగమత్త పాత్ర తనకు ఎలా వచ్చిందో అనసూయ చెప్పుకొచ్చింది. ఈ పాత్ర కోసం చాలామందిని ఆడిషన్ చేశారని, ఆడిషన్ జరిగిన 3 నెలల తరువాత తనను ఫైనల్ చేసినట్లు తెలిపింది. రంగస్థలంలో నన్ను సెలక్ట్ చేసే సమయానికి సుకుమార్ సార్.. నేను నటించిన క్షణం సినిమా కూడా చూడలేదు. సుక్కు సార్ తో పాటు ఆ సినిమాకు ముగ్గురు రైటర్స్ పనిచేశారు. ఇప్పుడు పెద్ది సినిమాకు డైరెక్షన్ చేస్తున్న బుచ్చిబాబు .. అప్పుడు రంగస్థలంకు ఒక రైటర్‌గా పనిచేశాడు. వారితో పాటు కాశీ, శ్రీనివాస్ అని ఉండేవారు. వారు ముగ్గురు నాచేత మాయ్యా అని పిలిపించుకొనేవారు. బుచ్చి మాయ్యా.. కాశీ మాయ్యా.. శ్రీనివాస్ మాయ్యా.. వాళ్ల ముగ్గురు చాలామందిని ఆడిషన్ చేశారు. కనీసం ఒక 20 మందిని ఆడిషన్ చేశారు. చిన్నవాళ్లు.. పెద్దవారు చాలామంది ఉన్నారు. ఆ తరువాత నాకు ఆడిషన్ కు రమ్మని కాల్ వచ్చింది. నేను వెళ్లి వచ్చిన మూడు నెలల తరువాత ఒకే అని చెప్పారు. అప్పటికీ ఆశలు వదిలేసుకున్నా.. నన్నెందుకు తీసుకుంటారులే అనుకున్నా... తరువాత షెడ్యూల్ ఇది అని చెప్పారు.



## మెగాఫోన్ అందుకున్న జోషీ

లెజెండరీ డైరెక్టర్ జోషీ ఓ హై-ఒక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్‌కి మెగాఫోన్ పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఉన్ని ముకుందన్ ఫిలింస్ ఐన్స్టిన్ మీడియా బ్యానర్లపై ఈ సినిమా రాబోతోంది. జోషీ తన పుట్టినరోజు వేళ ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్లు తర తరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. ఇప్పుడు ఆ అనుభవంతో, ఈ తరం స్టోరీ టెల్లింగ్ పవర్‌తో, ఒక భారీ యాక్షన్ మూవీ తీసేందుకు రెడీ అవుతున్నారు. నేషనల్ అవార్డు గెలుచుకున్న మెప్పడియాన్ తర్వాత వంద కోట్ల గ్రాస్ కలెక్షన్‌తో దూసుకెళ్లిన మార్కో వంటి సినిమాలతో గేలీనీ స్టాండర్డ్‌ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లింది. ఇప్పుడు జోషీ లాంటి మాస్టర్ డైరెక్టర్‌తో చేతులు కలపడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అభిలాష్ ఎన్. చంద్రన్ ఈ సినిమాకి కథ స్క్రీన్‌ప్లే అందిస్తున్నాడు. పొరించు మరిఅమ్ జోస్ కింగ్ ఆఫ్ కొథా వంటి సినిమాలకు రాసిన ఈయన ఎమోషన్ డెప్త్ ఉన్న క్యారెక్టర్‌లు రాయడంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ సినిమా కూడా యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలుతో ఉండబోతోంది. హీరోగా ఉన్ని ముకుందన్ తన కెరీర్‌లో ఎప్పుడూ చూడని లుక్‌లో, మాస్ యాక్షన్ అవతారంలో కనిపించబోతున్నాడు. ఈ సినిమా నిర్మాణంలో భాగమైన ఐన్స్టిన్ మీడియా ఇటీవలే ఆంటోనీ, పురుష ప్రేతం వంటి యూనిక్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. డిఫరెంట్ కాన్సెప్ట్స్, క్వాలిటీ కంటెంట్‌కి పేరు తెచ్చుకున్న ఈ బ్యానర్ కూడా ఈ సినిమాతో సత్తా చాటబోతోంది.



# అందానికి గులాబీ..



రంగురంగుల గులాబీలను చూస్తే మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుంది. అయితే సౌందర్య పరిరక్షణలోనూ గులాబీల పాత్ర ఎంతో ఉందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందామా?

నల్లటి వలయాలు దూరం... కళ్ల కింద వలయాల సమస్యకు చెక్ పెట్టడానికి గులాబీలను ఉపయోగించవచ్చు. కొద్దిగా రోజ్‌వాటర్‌ని తీసుకొని అందులో కాటన్‌ను ముంచి కళ్లకింద మృదువుగా మర్దన చేయాలి. ఇలా కనీసం రెండు రోజులకోసారి చేస్తే ఫలితం ఉంటుంది. గులాబీ రేకల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటను తగ్గిస్తాయి.

**క్లెన్సర్‌గానూ :..** గులాబీ మంచి క్లెన్సర్‌గా కూడా పని చేస్తుంది. రోజ్‌వాటర్ మన ముఖంపై ఉన్న జిడ్డుని, పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా మార్చుతుంది. అంతేకాదు.. గులాబీ రేకల్లోని సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయి. అందుకే స్నానం చేసే నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా కొన్ని గులాబీ రేకలను వేసుకుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుంది.

విటమిన్ 'సి' పుష్కలం... గులాబీల్లో విటమిన్ 'సి' శాతం ఎక్కువ. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేసి అతినీల లోహిత కిరణాల నుంచి రక్షణ కల్పిస్తుంది. అందుకే ఎండలోకి వెళ్లేముందు రోజ్‌వాటర్ అప్లై చేసుకొని వెళ్లడం మంచి దంటున్నారు నిపుణులు. అంతేకాదు. గులాబీ ట్యాన్‌ని కూడా తొలగిస్తుంది. దీనికోసం కీరా దోస, గులాబీ, గ్లిజరిన్‌లు కలిపిన ప్యాక్‌ని వేసుకుంటే ఫలితం ఉంటుంది.

**జుట్టు ఆరోగ్యానికి ...** గులాబీల్లో ఉండే సహజ సిద్ధమైన కండిషనింగ్ గుణాలు జుట్టును పట్టుకుచ్చులా మెరిసేలా చేస్తాయి. దీనికోసం మీరు వాడే షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్క రోజ్ వాటర్ కలుపుకొంటే సరి లేదా గులాబీ రేకల పేస్ట్‌ను జుట్టుకు, కుదుళ్లకు పట్టించి కాసేపయ్యాక తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది.



# జనాభా వృద్ధి స్థిరంగా ఉండాలంటే..

**జనాభా వరమా? శాపమా? జన భారత్ ఇకపైన ఎలా అడుగులు వేయాలి. దీన్లో మహిళల పాత్ర ఏంటి.. లాంటి సందేహాలెన్నో! వీటిపైన 'పాప్యులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.**



భారత్‌లో ప్రస్తుతం సంతాన సాఫల్య రేటు (టిఎఫ్ఆర్) రెండుగా ఉంది. అంటే సగటున ప్రతి మహిళా ఇద్దరు బిడ్డలకు జన్మనిస్తోంది జనాభా వృద్ధి స్థిరంగా ఉండాలంటే అది 2.1గా ఉండాలి. కానీ ఇలా తగ్గడం ఒకసారి మొదలైతే, క్రమంగా అది తగ్గుతూ పోతుంది. ఆ మార్పు ఇప్పుడు చూస్తున్నాం. అధిక జనాభాతో సవాళ్లు ఉన్నాయి. తగు రీతిలో వనరులు అవకాశాల్ని అందించకపోతే సామాజిక, ఆర్థిక సమస్యలు పెరుగుతాయి. విద్య, ఉపాధి దక్కకుంటే యువత పక్కదారి పడుతుంది. అందుకే అధిక సంఖ్యలో స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు తీసుకురావాలి. నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. ఉపాధి అవకాశాలు పెరగాలి. ముఖ్యంగా మహిళలకు విద్య, పోషకాహారం, వైద్యం, ఆదాయ వనరుల్ని అందించాలి. జనాభా గురించి ఆందోళన చెందకుండా. ప్రతి భారతీయుడూ ఒక ఆస్తి అనుకొని ప్రణాళికలు రచించాలి.

**ఆ స్వేచ్ఛ ఇవ్వండి...** కొన్నిచోట్ల పిల్లలు కనడంపైన ఆంక్షలు పెడితే, ఇంకొన్నిచోట్ల ప్రోత్సాహకాలు చేస్తున్నారు. వీటి ప్రభావం ప్రత్యక్షంగా పడేది మహిళలపైనే. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులని గతంలో కొన్ని రాష్ట్రాలు ప్రకటించాయి. వీటి కోసం కొందరు కాగితం మీద విడాకులు తీసుకున్నారు. దీంతో వివాహ బంధం అనిశ్చితిలోకి వెళ్తుంది. కొందరు పిల్లల్ని దత్తత ఇచ్చారు. అప్పుడూ బాధపడేది తల్లే కాబట్టి పిల్లల్ని ఎప్పుడు కనాలి, ఎంతమందిని కనాలనే నిర్ణయం మహిళలు తాముగా తీసుకునే స్వేచ్ఛ రావాలి. పిల్లల్ని కనాలని చెప్పడం. వద్దనడం.. మహిళల్ని అగౌరవ పరచడమే. పిల్లల్ని కనడమనేది స్విచ్ కాదు ఆన్ ఆఫ్ చేయడానికి కెరియర్, ఆర్థిక, సామాజిక కోణాల్లో ఆలోచించి పిల్లల విషయంలో మహిళలే నిర్ణయానికి వస్తారు.

**భారం మహిళలదేనా? ••**

1970 నాటికి దేశంలో 30 శాతం వాసెక్టమీ ఆపరేషన్లు జరిగేవి. ఇప్పుడవి 0.3 శాతానికి తగ్గాయి. వాసెక్టమీ పదినిమిషాల్లో ముగుస్తుంది. కావాలనుకుంటే వెనక్కి మరల్చవచ్చు. ట్యూబెక్టమీలో కోత, కుట్లు ఉంటాయి. దురదృష్టవశాత్తూ పుట్టిన వాళ్లు చనిపోతే ట్యూబెక్టమీలో వెనక్కి వెళ్లి పిల్లల్ని కనే పరిస్థితి ఉండదు. అప్పుడు మగవాళ్ళు వేరే పెళ్లి చేసుకునేందుకు ఆస్కారం ఉంది. మరోపక్క ఏటా భారత్‌లో 1.6కోట్ల అబార్షన్లు జరుగుతున్నాయి. లెక్కకి అందనివి ఇంకెన్నో. వీటిలో సగం జవాంఛిత గర్భధారణలు కాగా, మగ పిల్లలు కావాలనుకోవడం మరో కారణం.



రెండో త్రైమాసికంలోకి వెళ్తే అబార్షన్లతో ప్రాణహాని ఉంటుంది. అంతేనా... గర్భనిరోధకాలు వాడటం మగవాళ్లకు సంబంధంలేనిదిగా కేవలం పనే అన్నట్టుగా ఉంది. వీటన్నింటివల్ల మహిళల ఆరోగ్యమూ దెబ్బతింటుంది. జేజరే టాటా చెప్పినట్టు "మగ వాళ్లు మారినప్పుడే దేశం మారుతుంది. వాళ్లలో ఎలాంటి మార్పు రావాలంటారా... పిల్లల పెంపకంలో బాధ్యతలు తీసుకోవాలి. ఇంటిపనుల్లో మహిళలకు భాగమవ్వాలి. కుటుంబ నిర్ణయాల్లో మాటకు విలువ ఇవ్వాలి. అప్పుడే జనాభా పెరిగినా, తగ్గినా సమస్యలు తగ్గుతాయి. జనాభా లెక్కల్లో మహిళలకు సంబంధించిన డేటా తక్కువగా వెలుగులోకి వస్తోంది. 2027 జనాభా లెక్కలతోనైనా దీన్లో మార్పు రావాలి. జనాభా లెక్కింపు సమయంలో ఇంటి వివరాలు మగవాళ్లే చెబుతారు. అలా కాకుండా మహిళల్ని అడగాలి. మహిళలు, బాలికలకు సంబంధించి సరైన సమాచారం లేకుంటే పథకాల రూపకల్పనలో పొరపాట్లు జరుగుతాయి. అది ఎన్నటికీ పూడ్చలేని లోటుగా మిగిలిపోతుంది. 2050 నాటికి జనాభాలో 20 శాతం(34కోట్లు) వృద్ధులు ఉంటారని అంచనా. మహిళల ఆయుష్షు ఎక్కువ కాబట్టి వీరి కోణంలోనూ ప్రణాళికలు రచించాలి. కొత్త విషయాలను. నైపుణ్యాల్ని నేర్చుకునేలా అలవాటు చేయాలి. దాని వృద్ధాప్యంలోనూ పనిచేసే సామర్థం వస్తుంది.

# ఆధారం ఇస్తేనే ఆరోగ్యంగా..



ఎండా, వానా, చలీ.. వంటివాటి నుంచి మనం రక్షణ ఏర్పాటు చేసుకున్నట్లే మొక్కల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే అవి ఆరోగ్యంగా ఉంటాయి.

✦ వర్షం, బలమైన గాలుల వల్ల పొడవుగా ఉన్నవీ, కాయలూ, పండ్లతో ఉన్న మొక్కలు రకాలూ ఇట్టే విరిగిపోతుంటాయి. అలాకాకుండా ఉండాలంటే మొక్కలను గ్రిల్‌కో, పెద్ద చెట్టుకో తాడుతో కట్టేయాలి.

✦ వర్షాకాలంలో కుండీల్లో అదనపు నీరు నిలిచి మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వీలైతే వాటిని రూఫ్ కిందకో, పెద్ద చెట్టు నీడకో తెచ్చి పెట్టడం మేలు. ఆ అవకాశం లేకపోతే మొదలు చుట్టూ ప్లాస్టిక్ షీట్ కప్పేయండి.

✦ తరచూ వర్షాల్లో తడవడంవల్ల ఆకులూ, పూలూ వాడిపోవడం, కుళ్లిపోవడం జరగొచ్చు. అలాంటివాటిని ఎప్పటికప్పుడు తీసేయాలి. లేదంటే ఈ సమస్య మిగిలిన భాగాలకూ వ్యాపించొచ్చు. ఇలాంటప్పుడు బేకింగ్ సోడా, కార్న్‌పౌడర్, దాల్చినచెక్క పొడి వంటివి చల్లుకుంటే సరి. తెగుళ్లను నియంత్రించొచ్చు.

**చెలి చిట్కా** వాష్‌బేసిన్ రంధ్రాల్లో వాసనరాకుండా ఉండటానికి బేకింగ్‌సెఓడావేసి వేడినీరు పోయండి.

◆ పూరీపిండి 2 స్పూన్‌ల బొంబాయిరవ్వ మరో 2 స్పూన్లు మైదా కలిపితే పూరీలు చాలా రుచిగా ఉంటాయి.


# స్నేహితురాలు ఉండాల్సిందే..

**పనిలో బిజీగా ఉన్నా, కుటుంబ బాధ్యతల్లో పడిపోయినా కొంతమంది అమ్మాయిలు మొదట త్యాగం చేసేది స్నేహితులనే**

కానీ, మనల్ని మనం మలుచుకోవాలన్నా, భావోద్వేగాలను పంచుకోవాలన్నా స్నేహానికి మించిన బంధం ఏముంటుంది చెప్పండి. నిజానికి అమ్మాయిల మధ్య ఉండే స్నేహం ఒకింత ప్రత్యేకమైంది. ఎందుకంటే, మనసువిప్పి మాట్లాడుకోవడానికి ప్రతి ఒక్కరికీ ఓ స్నేహితురాలు ఉండాల్సిందే. యూసిఎల్‌ఎ పరిశోధన ప్రకారం, మహిళలకు ఒత్తిడి కలిగినప్పుడు.. దాన్ని ఎదుర్కోవడంలో భాగంగా మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిలో ఆక్సిటోసిన్, ఈస్ట్రోజన్ కొన్ని. అవే మనం పిల్లలతో ఆడుకునేలా, ఇతర మహిళలతో స్నేహం చేయడానికి కారణమవుతాయట. దాంతో ఒత్తిడి దూరమై ప్రశాంతంగా ఉండగలుగుతాం. అయితే, ఈ కామింగ్ ఎఫెక్ట్ మగవారిలో ఉండదట. ఎందుకంటే వాళ్లు ఒత్తిడికి గురైనప్పుడు టెస్టోస్టిరాన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తయ్యి, ఆక్సిటోసిన్ ప్రభావాన్ని తగ్గిస్తుందట. కాబట్టి, ఒత్తిడి ఎదురైనప్పుడు అబ్బాయిలూ, అమ్మాయిలూ వేరుగా స్పందిస్తారట. అంతేకాదు, స్నేహితులతో ఎక్కువ సమయం గడిపే మహిళల్లో వయసు పైబడ్డాక వేధించే శారీరక బలహీనతలు వచ్చే అవకాశం తగ్గుతుందని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధనలో తేలింది. అంతేనా, మన భావాలు పంచుకునే స్నేహితులు లేకుంటే, ఒత్తిడి గూడుకట్టుకుపోయి బరువు పెరిగే అవకాశాలు ఉన్నాయట. ఇక, సుమారుతొమ్మిదేళ్లపాటు స్నేహితులతో నాణ్యమైన సమయం గడిపిన వారిలో మరణించే ప్రమాదం 60శాతానికి పైగా తగ్గిపోతుదనీ పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నిబట్టి దీర్ఘాయుష్షును అందించే జీవనమంత్రం స్నేహమే అని అర్థమవుతుంది.



# ఓట్స్‌తో మెరిసే చర్మం



**మీది జిడ్డు చర్మమా? మొటిమలూ, మచ్చలూ ఇబ్బంది పెడుతున్నాయా?** అయితే, కీరదోస, ఓట్స్ ఫేస్‌మాస్క్‌ను ప్రయత్నించండి. ముందుగాతొక్క తీసిన కీరదోస ముక్కలను మిక్సీలో వేసి మెత్తని ముద్దగా చేసుకోండి. దానికి రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్‌ను కలిపి మరోసారి మిక్సీ పట్టండి. ఆ మిశ్రమానికి ఓ టీస్పూన్ తేనె వేసి కలిపి.. శుభ్రపరచుకున్న ముఖానికి రాయాలి. అరగంట అయ్యాక, గోరువెచ్చని నీటితో ముఖం కడిగేసుకుంటే సరి. కీరదోస చర్మాన్ని చల్లబరిచి వాపును తగ్గిస్తుంది. మచ్చలు మానేలానూ చేస్తుంది. ఓట్స్‌లో అధికంగా ఉండే జింక్.. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, మొటిమలు పెరగకుండా చేస్తుంది. కాబట్టి, తరచూఈమాస్క్‌ను వేసుకుంటే మెరిసే చర్మం మీ సొంతమవుతుంది.

# క్యాలీఫ్లవర్ పకోడీ

**కావలసిన పదార్థాలు :** చిన్నగా తుంచిన క్యాలీఫ్లవర్ పూలు-రెండు కప్పులు, శనగపిండి-కప్పు, ఉప్పు, పసుపు-పావు చెంచా చొప్పున, అల్లం వెల్లుల్లి ముద్ద-అరచెంచా, కొత్తిమీర తరుగు చారెడు, కచ్చాపచ్చాగా నూరిన పచ్చిమిర్చి-చెంచా, నూనె-వేయించేందుకు సరిపడా.

**తయారీ :** ఒక పాత్రలో శనగపిండి, ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, నూరిన పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగు వేసి కొద్దికొద్దిగా నీళ్ల పోస్తూ కొంచెం గట్టిగా కలుపుకోవాలి. చిన్నగా తుంచిన కాలీఫ్లవర్ పూలను పిండిలో ముంచి తీసి కాగిన నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. కమ్మటి క్యాలీఫ్లవర్ పకోడీ చిన్నా పెద్దా అందరికీ నచ్చుతాయి.



# పనులు పూర్తవడం లేదా?

ఉద్యోగాల్లో కొన్ని సందర్భాలు డెడ్‌లైన్‌తో ఉంటాయి. మరో పక్క ఇంట్లో పనులూ ఓ పట్టాన తెమలవు. దీంతో తెలియని ఆందోళన.. దేనిపైనా దృష్టిపెట్టలేకుండా చేస్తుంది. అలాకాకూడదంటే..

మల్టీ టాస్కింగ్ చేయడంలో మహిళలు సమర్థులంటారు! కానీ ఆ అలవాటు అన్ని సమయాల్లోనూ మంచిది కాదు. ముఖ్యంగా పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు దీని జోలికి పోవద్దు అంటారు. కెరియర్ నిపుణులు. దేనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలో గుర్తించగలిగితే దానిమీదే శ్రద్ధపెట్టి త్వరగా పూర్తి చేయొచ్చు. ఇలా పనులన్నింటికీ ఓజాబితా రాసుకుంటే.. మనలో ఆందోళన తగ్గించడానికి ఈ స్పష్టత చాలు. పని పూర్తి చేయాలనే తొందరలో విరామం తీసుకోకుండా పనిచేస్తుంటారు కొందరు. దీనివల్ల అనుకున్న లక్ష్యం చేరకపోగా మరింత ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటప్పుడు పనిని కాసేపైనా వాయిదా వేయడం మంచిదే. ఆ సమయంలో ఓ మంచి కాఫీ తాగండి. నచ్చిన మరో అంశంపై దృష్టిపెట్టండి లేదా ఓ చిన్న కునుకు తీయండి. ఇవన్నీ మీ కంగారుని తగ్గిస్తాయి. తిరిగి ఉత్సాహంగా పనులు మొదలు పెట్టే శక్తినిస్తాయి. ఒక్కోసారి ఒత్తిడితో కూడుకున్న పనులు రెండుమూడురోజులు కూడా కొనసాగొచ్చు. అలాంటప్పుడు రోజుకి కనీసం గంటైనా ఏదైనా వ్యాయామం చేయండి. అది ఆందోళనని ఎదుర్కొనే శక్తినిస్తుంది. మెదడుని చురుగ్గా మార్చగలిగే బాదం, వాల్‌నట్స్ వంటివి తినండి. మనసుని ప్రశాంతంగా ఉంచే కొన్ని గుమ్మడి గింజల్ని నోట్లో వేసుకోండి. ఇవన్నీ ఒత్తిడిని తట్టుకుంటూ పనిచేయగలిగేఏకాగ్రతనీ పెంచుతాయి.



# ఈ కాలంలో ఆరోగ్యంగా..

**వాతావరణం మారినప్పుడు..అందులోనూ వర్షాకాలంలో వివిధ వ్యాధుల బారిన పడడం మామూలే. అయితే ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు మరింత అధికం. ఈ క్రమంలో-వానలు కురిసే వేళ దగ్గు, జలుబు, జ్వరాల వంటి సమస్యల బారిన పడకుండా ఈ పానీయం ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.**

**కావాల్సిన పదార్థాలు :** మరిగించిన నీరు-2 కప్పులు, నిమ్మకాయలు-ఒకటిన్నర, తాజా అల్లం రసం-ఒకటిన్నర టేబుల్ స్పూన్, మామిడి అల్లం-టేబుల్ స్పూన్, తేనె-2 టేబుల్ స్పూన్లు, తేనె-2 టేబుల్ స్పూన్లు, ఉప్పు-చిటికెడు, దాల్చిన చెక్క -(రుచి కోసం).

**తయారీ :** ముందుగా ఒక గిన్నె/టీపాట్ లోకి తేనె, నిమ్మరసం, అల్లం రసం, మామిడి అల్లం, దాల్చిన చెక్క, ఉప్పు తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమానికి మరిగించిన నీటిని జత చేసి తేనెతో పాటు మిక్స్ చేసిన పదార్థాలన్నీ కరిగిపోయే వరకు బాగా కలపాలి. ఆ తర్వాత దీనిపై మూత పెట్టి 5-6 నిమిషాల పాటు పక్కన పెట్టాలి. ఆపై ఒక కప్పులోకి వడకట్టుకుని తాగాలి.



**వేటితో ఏ ప్రయోజనం:** ◆. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థ పనితీరును క్రమంగా మెరుగుపరుస్తాయి.

◆ అల్లంలో పుష్కలంగా ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరాన్ని డీటాక్సిఫై చేస్తాయి. దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి. జీవక్రియల రేటు కూడా మెరుగుపడుతుంది.



◆ నిమ్మలో సహజంగా ఉండే సి-విటమిన్, పొటాషియం రోగ నిరోధక శక్తి పెరగడానికి సహకరిస్తాయి. అలాగే శరీరంలోని విష పదార్థాల ప్రభావాన్ని తగ్గిస్తాయి.

◆ ఇక మామిడి అల్లం పోషకాల సమూహం. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కీళ్లనొప్పులు, చర్మంపై దురద, గాయాల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అదే విధంగా దగ్గు, అజీర్తి సమస్యలను తగ్గిస్తాయి.

# చెరపకురా చెడేవు



ఒక వేటగాడు తన విల్లంబులు, కుక్కలను వెంటబెట్టుకొని అడవికి బయలు దేరాడు. దారిలో అతడికి ఒక బౌద్ధభిక్షువు ఎదురయ్యాడు. "ఈ దరిద్రుడు తారస పడ్డాడు. ఇక నాకు ఈరోజు వేట దొరుకుతుందా" అని మూఢనమ్మకాలను నమ్మే ఆ వేటగాడు అనుకొన్నాడు. ఆరోజు అతడికి నిజంగానే నిరాశ ఎదురైంది. ఎలాంటి జంతువు, పక్షి అతడికి చిక్కలేదు. ఉసూరుమంటూ తిరుగు పయనమయ్యాడు. దారిలో మళ్లీ అతడికి ఆ భిక్షువు కనిపించాడు. కోపంతో ఊగిపోతూ వేటగాడు తన కుక్కలను ఆ భిక్షువు మీదకి ఊసిగొలిపాడు. అవి వెంటపడుతుంటే భిక్షువు భయపడి దగ్గరలో ఉన్న చెట్టు ఎక్కాడు. అక్కడికి చేరిన వేటగాడు అతణ్ణి రాళ్లతో కొట్టడం మొదలుపెట్టాడు. భిక్షువు మరింత పైకి ఎక్కే అతడు కప్పుకున్న వస్త్రం జారి ఆ వేటగాడిపై పడింది. ఆ వేటగాడినే భిక్షువని భ్రమపడిన కుక్కలు అతడి కండలు చీల్చి చంపేశాయి. వేటగాడి మరణానికి భిక్షువు చాలా బాధపడ్డాడు. ఆ తర్వాత బుద్ధుడికి తెలియజెప్పి కన్నీరుపెట్టుకున్నాడు. "ఇందులో నీ తప్పేమీ లేదు. పరులకు ఎలాంటి హానీ తలపెట్టని నీలాంటి వాడిపైకి కుక్కలను వదిలి ఆ వేటగాడు తన అంతం తానే కొనితెచ్చుకొన్నాడు" అని ఊరడించాడు. అనంతరం బుద్ధుడు ఇలా చెప్పాడు.

"మనసులో ఎలాంటి కల్మషం లేకుండా పదిమంది మంచి కోరుతూ సన్మార్గంలో పయనించేవాడికి ఎవరైనా అపకారం తలపెడితే, అది తిరిగి వారికే తగులుతుంది. గాలికి ఎదురుగా నిలిచి మట్టిని విరజిమ్మితే ధూళి వారి కంట్లోనే పడుతుంది కదా!" మన పెద్దలు దీన్నే 'చెరపకురా చెడేవు' అని మరొక విధంగా చెబుతారు!

ఆధ్యాత్మికం

# పోషకాల 'పుట్ట'

ఒక్కో సారి మనసు దిగులుగా ఉంటుంది. భావోద్వే గాలూ పెల్లుబుకుతూ ఉంటాయి. కానీ, ఇలా తరచూ జరుగుతూ ఉంటే మాత్రం మీ డైట్‌లో కొన్నిరోజులు మాష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి కొన్ని రోజులు మష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి మిమ్మల్ని చురుగ్గా మారుస్తుందని చెబుతోంది పెన్ యూనివర్సిటీ పరిశోధన. ఇది కాదు..గతంలో ఓ అధ్యయనం పుట్టగొడుగుల్లో లభించే ఎర్గోథియోనీన్ అనే యాంటీకానఇసడెంట్‌కి..రొమ్ము క్యాన్సర్ కణాలతో పోరాడి అకాల మృత్యు ముప్పుని తగ్గించే శక్తి ఉందనీ వెల్లడించింది. ఇంతేనా మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ వీటిని తినడం వల్ల అందుకోవచ్చు.



సాధారణంగా వర్షాకాలంలో మష్రూమ్స్ ఎక్కువగా దొరుకుతాయి. ఇవి రుచిలోనూ, పోషకాల్లోనూ నాన్‌వెజ్‌కిపోటీనివ్వ గలుగుతాయి. అందుకే, వీటికి సూపర్‌ఫుడ్ అనే పేరూ ఉంది. అయితే, ప్రపంచ వ్యాప్తంగా పుట్ట గొడుగుల్లో రెండు వేల రకాలు ఉంటే, మన దేశంలో 283 జాతులున్నాయి. వాటిల్లో వైట్ బటన్ మాష్రూమ్, ఆయిస్టర్ మష్రూమ్, చైనీస్ మష్రూమ్, మిల్క్ మష్రూమ్ వంటివాటినే మనం ఎక్కువగా పెంచుతాం. తింటుంటాం. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్..యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్‌గా పనిచేస్తాయి. ఇందులోని పోషకాలు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముకల్ని దృఢంగా మార్చే డి విటమిన్, ఆహారాన్ని శక్తిగా మార్చి శరీరానికి అందించే బి12 వంటి కీలకమైన పోషకాల్నీ అందిస్తాయి. కండరాల పనితీరుని, వ్యాధినిరోధకశక్తినీ పెంపొందించే ప్రొటీన్ కూడా పుట్ట గొడుగుల నుంచి తగినంతగా అందుతుంది.

# నేడు బిగ్ ఫైట్

## భారత్‌కు డూ ఆర్ డై మ్యాచ్.. సిరీస్ కైవసం కోసం ఇంగ్లండ్




**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ముగిసే సమయానికి భారత్ ప్రస్తుతం 1-2 తేడాతో వెనుకబడి ఉంది. ఈ నెల 23 నుంచి మాంచెస్టర్ వేదికగా ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో నాలుగో టెస్టు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్ కానుంది. ఇందులో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని భారత్ భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఓడినా లేదా డ్రా చేసుకున్నా, సిరీస్‌ను గెలిచే అవకాశం భారత్‌కు ఉండదు. ఈ నాలుగో కీలక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఒక్క మార్పుతో బరిలోకి దిగుతోంది. టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టు తమ ప్లేయింగ్ 11ను ప్రకటించింది. గాయంతో సిరీస్ నుంచి తప్పుకున్న ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ లియమ్ డాసన్‌కు అవకాశం లభించింది. ఇంగ్లాండ్‌కు ఇది కీలకమైన టెస్టు కావడంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు అవకాశం ఇచ్చారు. దీంతో దాదాపు 8 ఏళ్ల తర్వాత డాసన్ టెస్టు జట్టులోకి వచ్చాడు. షోయబ్ బషీర్ గాయంతో దూరం కావడంతో డాసన్‌కు ఇంగ్లాండ్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. లార్డ్స్ టెస్టు మూడో రోజు షోయబ్ బషీర్‌కు గాయం అయింది. రవీంద్ర జడేజా కొట్టిన హిట్టింగ్ డ్రైవ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించిన సమయంలో అతని ఎడమ చేయి చిటికన వేలికి గాయం అయింది. భారత జట్టు విషయానికి వస్తే పేస్ బౌలింగ్ విభాగంలో గాయాల వల్ల సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆకాష్ దీప్ ఇంకా గాయాల నుంచి కోలుకోలేదు. అర్ష్‌దీప్ సింగ్ చేతి గాయంతో టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతను చివరి మ్యాచ్ కు కూడా అందుబాటులో ఉండే అవకాశం లేదని సమాచారం. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కంబోజ్ మాత్రమే ప్రస్తుతం భారత పేస్ బౌలింగ్ విభాగంలో ఫిట్ గా ఉన్నారు. 24 ఏళ్ల అన్షుల్ కంబోజ్‌ను రిజర్వ్‌గా జట్టులోకి తీసుకున్నారు. అతని లైన్‌లెంగ్త్ బౌలింగ్, క్రమశిక్షణ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ సహా కోచింగ్ సిబ్బందిని మెప్పించడంతో జట్టులోకి వచ్చాడు. ఇక భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ కు గత మ్యాచ్ లో చేతికి గాయం అయింది. భారత ఇన్నింగ్స్ సమయంలో పంత్ బ్యాటింగ్ చేయడానికి వచ్చారు. ప్రస్తుతం గాయం తగ్గడంతో తిరిగి కీపింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో స్వల్పంగా అసౌకర్యంగా ఉన్నా, అతను కీపింగ్ చేస్తూ కనిపించాడు. ఇది భారత జట్టుకు పెద్ద బలంగా మారనుంది. అయితే ఆకాష్ దీప్ గాయం మరోసారి తీవ్రతరం కావడంతో అతను ఆడటం కష్టమేనని సమాచారం.

## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ తొలి రౌండ్‌లో మహిళా ప్లేయర్స్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్-2025 ప్రారంభ రోజున భారతీయులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆరుగురు భారత మహిళా క్రీడాకారిణులలో ఐదుగురు తమ తొలి రౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. ఈజిప్టులోని కైరోలో జరిగిన వ్యక్తిగత స్క్వాష్‌లో భారత స్క్వాష్ క్రీడాకారులు విజయాలతో ఆరంభించారు. అండర్ 19 ఆసియా బాలికల స్క్వాష్ ఛాంపియన్ అనాహత్ సింగ్ మొదటి రౌండ్‌లో బై పొందగా, అండర్ 17 ఆసియా జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అనికా దుబే పోలాండ్‌కు చెందిన తోలా ఒట్ర్జాసెక్‌ను 3-1 (9-11, 11-7, 11-9, 11-3) తేడాతో ఓడించింది. రుద్ర సింగ్, నవ్య సుందరరాజన్, మరియు ఆరాధ్య పోర్వాల్ తమ ప్రత్యర్థులపై ఏకపక్ష విజయాలు సాధించారు. రుద్ర దక్షిణాఫ్రికాకు చెందిన చాంటే లెప్పన్‌ను 3-0 (11-6, 11-3, 11-3) తేడాతో ఓడించగా, నవ్య దక్షిణాఫ్రికాకు చెందిన డెనే వాన్ జైల్‌ను 3-0 (11-5, 11-8, 11-3) తేడాతో ఓడించింది. ఆరాధ్య పోర్వాల్ దక్షిణాఫ్రికాకు చెందిన మకైలా నాయుడును 3-0 (11-3, 11-3, 11-4) తేడాతో ఓడించింది. మరో వైపు ఉన్నతి త్రిపాఠి ఏకైక భారతీయురాలు, పోలాండ్‌కు చెందిన నటాలియా మియర్జెజ్యూస్కా చేతిలో 0-3 (11-13, 8-11, 9-11) తేడాతో ఓడిపోయింది. కాగా పురుషులలో అరిహంత్ కెఎస్, శివన్ అగర్వాల్ వారివారి మొదటిరౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. అరిహంత్ జర్మనీకిచెందిన రూఫస్ గెబార్ట్‌ను 3-0 (11-2, 11-4, 11-5) తేడాతో ఓడించగా, శివన్ ఐర్లాండ్‌కు చెందిన ఫ్రాంక్ ఓ ఫ్లిన్‌ను 3-0 (11-3, 11-3, 11-8) తేడాతో ఓడించాడు. అయితే, కరణ్ యాదవ్ ఈజిప్ట్‌కు చెందిన ఇయాద్ దౌద్ చేతిలో 3-0 (3-11, 4-11, 5-11) తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.







## వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో.. నిరాశతో ముగిసిన భారత్ ప్రచారం

### పరుగులో గురిందర్‌వీర్, మణికంఠ ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్-2025లో స్ప్రింటర్లు మణికంఠ, గురిందర్వీర్ ఆకట్టుకోలేకపోయారు. పురుషుల 100 మీటర్ల పరుగులో మణికంఠ హోబ్లిధర్ మరియు గురిందర్‌వీర్ సింగ్ సెమీస్‌కు చేరుకోలేకపోయారు. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో పురుషుల 100 మీటర్ల ఈవెంట్‌లో భారతదేశం యొక్క ప్రచారం నిరాశతో ముగిసింది, దేశంలోని ప్రముఖ స్ప్రింటర్లలో ఇద్దరు గురిందర్‌వీర్ సింగ్, మణికంఠ హోబ్లిదార్ ఇద్దరూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. హీట్ 7లో, గురిందర్‌వీర్ సింగ్ నిరాశపరిచే 11.00 సెకన్లు పూర్తి చేసి, నాల్గవ స్థానంలో నిలిచాడు మరియు ఆటోమేటిక్ అర్హత స్థానాలకు వెలుపల ఉన్నాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో 10.20 సెకన్లు పూర్తి చేసి వార్తల్లో నిలిచిన ఈ పంజాబ్ స్ప్రింటర్, ప్రారంభం నుంచే లయ తప్పి ఎప్పుడూ తన గరిష్ట వేగాన్ని అందుకోలేకపోయాడు. ఇటీవలి సంవత్సరాలలో భారతదేశపు అగ్రశ్రేణి స్ప్రింటర్లలో స్థిరంగా స్థానం సంపాదించిన 100 మీటర్ల స్పెషలిస్ట్ ఫామ్‌లో ఇది ఆశ్చర్యకరమైన క్షీణత. అతను రౌండ్ 1 లో పాల్గొన్న వారిలో మొత్తం 40వ స్థానంలో నిలిచాడు. ఇంతలో, 10.23 సెకన్ల మార్కుతో మాజీ జాతీయ రికార్డు హోల్డర్ అయిన మణికంఠ హోబ్లిదార్, హీట్ 8లో మరింత పోటీతత్వంతో కూడినా కాని నిరాశపరిచే పరుగును అందించాడు, 10.74 సెకన్ల సమయంతో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రతి హీట్‌లో మొదటి ఇద్దరు ఫినిషర్లు, మొత్తం మీద అత్యంత వేగంగా చేరే తదుపరి ఎనిమిది మందితో పాటు, సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. అయితే మణికంఠ సమయం వేగంగా కటాఫ్‌ను చేరుకోలేక పోవడంతో పోటీ నుండి నిష్క్రమించాడు. అతను ఫీల్డ్‌లో మొత్తం 26వ స్థానంలో నిలిచాడు.



## వాషింగ్టన్ డబుల్స్ ఓపెనర్‌లో.. వీనస్ విలియమ్స్ విజయం

**న్యూఢిల్లీ:** ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ వీనస్ విలియమ్స్ 16 నెలల్లో తన తొలి ప్రొఫెషనల్ టెన్నిస్ మ్యాచ్‌లో విజయం సాధించింది. హైలీ బాప్టిస్ట్‌తో కలిసి దీది ఓపెన్ మొదటి రౌండ్‌లో తోటి డబుల్స్ వైల్డ్ కార్డ్‌లు యూజీని బౌచర్డ్ మరియు క్లెర్వీ న్గౌనౌలను ఓడించింది. 3-1 తేడాతో వెనుకబడి, బ్రేక్ పాయింట్‌ను ఎదుర్కొన్న వీనస్ మరియు బాప్టిస్ట్ గత 12 ఆటలలో 11 ఆటలను గెలుచుకుని పుంజుకున్నారు. 2022లో మొదటి రౌండ్‌లో ఓటమి తర్వాత, వీనస్ దీది ఈవెంట్‌లో ఇది రెండవసారి. టోర్నమెంట్ కోసం వైల్డ్‌కార్డ్‌ను అంగీకరించిన 45 ఏళ్ల మాజీ ప్రపంచ నంబర్ వన్, మార్చి 2024లో మయామి ఓపెన్ తర్వాత పోటీ పడలేదు. చివరిగా ఆగస్టు 2023లో సిన్సినాటి ఓపెన్‌లో గెలిచింది. కాగా విలియమ్స్ సోదరీమణులు చాలా సంవత్సరాలుగా క్రీడలో ఆధిపత్యం చెలాయించడంతో, ర్యాంకింగ్ లేని వీనస్, మహిళల డబుల్స్‌లో సెరెనాతో కలిసి 14 ప్రధాన టైటిళ్లను గెలుచుకుంది. కాగా సింగిల్స్ పోటీలోని మొదటి రౌండ్‌లో ఆమె మరో అమెరికన్ పేటన్ స్టెర్న్స్‌తో తలపడనుంది. ఇక వాషింగ్టన్‌లో జరుగుతున్న పురుషుల సింగిల్స్‌లో బ్రిటన్‌కు చెందిన డాన్ ఎవాన్స్ మరియు కామెరాన్ నోరీ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. 2023లో వాషింగ్టన్ టైటిల్ గెలుచుకున్న ఎవాన్స్, జిజౌ బెర్గ్స్‌పై 36, 64, 63 తేడాతో కఠినమైన విజయాన్ని సాధించాడు. 35 ఏళ్ల వైల్డ్ కార్డ్ తదుపరి 13వ సీడ్ అమెరికన్ అలెక్స్ మైఖేల్‌సెన్‌తో తలపడనుంది. అలాగే నోరీ బ్రిటిష్ క్వాలిఫైయర్ బిల్లీ హారిస్‌ను 63 76 (74) తేడాతో ఓడించాడు మరియు రెండవ రౌండ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ సెమీ ఫైనలిస్ట్ మరియు ఇటలీకి చెందిన రెండవ సీడ్ లోరెంజో ముసెట్టిని ఎదుర్కొంటాడు.

## చైనా ఓపెన్‌లో వటనాబేను ఓడించిన ప్రణయ్

**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2025, ఓపెనర్‌లో వటనాబేను హెచ్ఎస్ ప్రణయ్ ఓడించాడు. ప్రపంచ 18వ ర్యాంక్‌లో ఉన్న ఆటగాడిని ఓడించడానికి 5 మ్యాచ్ పాయింట్లను ప్రణయ్ ఆదా చేశాడు. మంగళవారం జరిగిన చైనా ఓపెన్ తొలి రౌండ్‌లో భారత అనుభవజ్ఞుడు ప్రణయ్ అద్భుతమైన పునరాగమనం చేశాడు. ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్, ఆ సంవత్సరం జరిగిన చివరి సూపర్ 1000 టోర్నమెంట్‌లో 57 నిమిషాల థ్రిల్లర్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వటనాబేను 8-21, 21-16, 23-21 తేడాతో ఓడించాడు. ఈ సారి ప్రణయ్ తన ప్రచారాన్ని అస్థిరంగా ప్రారంభించాడు, దీంతో మొదటి గేమ్‌ను 8-21 తేడాతో కోల్పోయాడు. అయితే, అతను తిరిగి పుంజుకుని రెండవ గేమ్‌ను 21-16 తేడాతో కైవసం చేసుకున్నాడు. చివరి సెట్ అత్యంత నాటకీయంగా మారింది. ఒక దశలో 2-11 తేడాతో వెనుకబడిన ప్రణయ్, 5 మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని గేమ్‌ను కైవసం చేసుకుని 23-21 ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించాడు. కాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్ దగ్గర పడుతున్న తరుణంలో, ప్రణయ్ తన కాంస్య పతక విజేత ప్రదర్శన కోసం ఎదురు చూస్తున్నాడు. డెన్మార్క్‌లో జరిగిన మునుపటి ఎడిషన్‌లో ప్రపంచ నంబర్ 1 విక్టర్ అక్సెల్సెన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఇక భారత్ మరో ప్లేయర్ లక్ష్యయ్ సేన్ మరోసారి మొదటి రౌండ్ నుండి నిష్క్రమించాడు, ఐదవ సీడ్ లీ షిఫెంగ్ చేతిలో 21-14, 22-24, 11-21 తేడాతో గంటలో ఓడిపోయాడు.




## అనిల్ అంబానీని 'ఫ్రాడ్'గా వర్గీకరణ

**న్యూఢిల్లీ, జూలై 22:** భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్ కామ్), దాని ప్రమోటర్ డైరెక్టర్ అనిల్ డి. అంబానీలను అధికారికంగా 'ఫ్రాడ్'గా వర్గీకరించినట్టు పార్లమెంట్ తెలిపింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు ఫిర్యాదు చేసే ప్రక్రియలో బ్యాంక్ ఉన్నట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు రాత పూర్వక సమాధానంలో తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిర్దేశించిన మోసం రిస్క్ మేనేజ్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్స్, ఎస్‌బీఐ బోర్డు ఆమోదించిన పాలసీకి అనుగుణంగా జూన్ 13 న ఈ వర్గీకరణ జరిగినట్టు మంత్రి చౌదరి వివరించారు. ఈ వర్గీకరణను బ్యాంక్ జూన్ 24న ఆర్బీఐకి నివేదించింది. ఎస్‌బీఐకి ఆర్‌కామ్ పెద్ద మొత్తంలో బకాయి పడింది. ఇందులో రూ.2,227.64 కోట్ల ఫండ్ బేస్డ్ ప్రిన్సిపల్ బకాయి (ఆగస్టు 26, 2016 నుంచి వడ్డీ, ఇతర ఖర్చులు సహా), రూ.786.52 కోట్ల నాన్ ఫండ్ బేస్డ్ బ్యాంక్ గ్యారెంటీ ఉన్నట్టు మంత్రి తెలిపారు. ఆర్‌కామ్ మొత్తం రుణం మార్చి 2025 నాటికి రూ. 40,400 కోట్లుగా ఉన్నట్టు నివేదించింది. చట్టపరమైన చిక్కులు ఆర్‌కామ్ ప్రస్తుతం 2016 నాటి ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియలో ఉంది. కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ రిజల్యూషన్ ప్లాన్‌ను ఆమోదించి, మార్చి 6, 2020న ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద దాఖలు చేసినప్పటికీ, దాని ఆమోదం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ పరిణామాలకు తోడు ఎస్‌బీఐ అనిల్ డి. అంబానీపై వ్యక్తిగత ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఇది ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ ముంబై వద్ద విచారణలో ఉంది. గతంలో కూడా ఈ మోసం వర్గీకరణకు సంబంధించిన వివాదం తలెత్తింది. నవంబర్ 10, 2020న ఎస్‌బీఐ ఈ ఖాతాను, అనిల్ డి. అంబానీని మోసంగా వర్గీకరించి, జనవరి 5, 2021న సీబీఐకి ఫిర్యాదు చేసింది. అయితే, జనవరి 6, 2021న ఢిల్లీ హైకోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అనంతరం, సుప్రీం కోర్టు మార్చి 27, 2023న ఇచ్చిన తీర్పు (స్టేట్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా.. ఇతరులువర్సెస్ రాజేష్ అగర్వాల్.. ఇతరులు కేసు) ప్రకారం, రుణగ్రహీతలకు మోసం వర్గీకరణకు ముందు తమ సమర్థనను వినిపించుకునే అవకాశం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో, సెప్టెంబర్ 2, 2023న బ్యాంక్ గత మోసం వర్గీకరణను రద్దు చేసింది. అయితే, జులై 15, 2024న ఆర్బీఐ జారీ చేసిన కొత్త సర్క్యులర్ ప్రకారం తిరిగి ప్రక్రియ నిర్వహించి, ఖాతాను మళ్లీ మోసంగా వర్గీకరించింది.




## ఆల్‌టైమ్ గరిష్టానికి ఎటెర్నల్ షేర్లు

**ముంబై, జూలై 22:** జొమాటో, బ్లింకిట్ పేరిట వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ షేర్లు కొత్త మైలురాయిని అందుకున్నాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మంగళవారం కంపెనీ షేర్లు రూ.311 వద్ద ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు దాటింది. నిఫ్టీ 50లో ప్రముఖ కంపెనీలైన విప్రో, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా వంటి కంపెనీలను అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఇలో ఎటెర్నల్ షేర్లు 10 శాతం లాభంతో రూ.299.75 వద్ద ముగిశాయి. త్రైమాసిక ఫలితాల్లో ఎటెర్నల్ లాభాల్లో 90 శాతం క్షీణత నమోదైంది. కేవలం రూ.25 కోట్ల నికర లాభాన్ని మాత్రమే నమోదు చేసింది. అదే సమయంలో ఆదాయంలో మాత్రం 70 శాతం వృద్ధి నమోదు చేసింది. గతేడాది రూ.4,206 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.7,167 కోట్లకు పెరిగింది. దీనికితోడు క్విక్ కామర్స్ విభాగమైన బ్లింకిట్ రాణించడంతో ఎటెర్నల్‌కు కలిసొచ్చింది. జొమాటో నెట్ ఆర్డర్ వాల్యూను (ఎన్‌వీజు) తొలిసారి బ్లింకిట్ దాటేసింది. గతేడాదితో పోలిస్తే గ్రాస్ఆర్డర్ వాల్యూలో 140 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ఇన్వెస్టర్లను మెప్పించింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు బ్రోకరేజీ సంస్థలు కూడా ఎటెర్నల్‌కు బై రేటింగ్ ఇచ్చాయి. నొమురా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.280 నుంచి రూ.300కు పెంచగా, నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన టార్గెట్ ప్రైస్‌ను రూ.290 నుంచి రూ.320కి సవరించింది. జెఫ్రీస్ అయితే ఏకంగా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.250 నుంచి రూ.400కు పెంచడం గమనార్హం. ఈ కారణంగా ఎటర్నెల్ షేర్లు దూసుకెళ్లాయి. గత 12 నెలల్లో ఎటెర్నల్ షేర్లు 33 శాతం రాణించగా, 2025 లో 7 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ విభాగంలో ఉన్న స్విగ్గీ షేర్లు కూడా రాణించాయి. ఎటెర్నెల్ ఎఫెక్ట్‌తో 5 శాతానికి పైగా లాభంతో రూ.418 వద్ద ముగిశాయి.



## పేటీఎం నికర లాభం రూ.122.5 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలను మంగళవారం పేటీఎం పేరెంట్ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ విడుదల చేసింది. 2025-06 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నికర లాభం రూ.122.5 కోట్లుగా ప్రకటించింది. ఈ యేడాది ఈ సంస్థ భారీగా లాభాల్లోకి దూసుకెళ్లింది. గత త్రైమాసికంలో నివేదించబడిన రూ.540కోట్ల నికర నష్టంతో పోలిస్తే ఈ యేడాది భారీగా పెరిగింది. కార్య కలాపాల ద్వారా కంపెనీ ఆదాయం రూ.1,918 కోట్లుగా ఉంది.




## ఎంఅండ్ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం 3.2% వృద్ధి

**ముంబై, జూలై 22:** మహీంద్రా అండ్‌మహీంద్రా (ఎంఅండ్ఎం) ఫైనాన్షియల్ సర్వీసెస్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. స్టాండ్ ఎలోన్ నికర లాభం రూ.3.2శాతం పెరిగి రూ.530 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.513 కోట్లుగా ఉంది. ముంబై ప్రధాన కార్యాలయం కలిగిన గ్రామీణ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి) మొత్తం ఆదాయం 18శాతం పెరిగి రూ.4,438 కోట్లకు చేరుకుంది. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో రూ.3,760 కోట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 1000 కంటే ఎక్కువ కార్యాలయాలతో భారతదేశంలోని అగ్ర ట్రాక్టర్ ఫైనాన్సర్లలో ఇది ఒకటి.

## ఆరంభంలో లాభాలు..చివరికి ఫ్లాట్‌గా సూచీలు

**ముంబై, జూలై 22:** తొలి త్రైమాసిక ఫలితాల జోష్‌తో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. అయితే, అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడం, ట్రంప్ నిర్దేశించిన గడువు ఆగస్టు 1 దగ్గర పడుతుం డడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,527.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,200.34) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,110.63 82,538.17 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్ల నష్టంతో 25,060 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.36గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, టైటాన్, బీఈఎల్, మారుతీ సుజుకీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.49 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,396 డాలర్ల వద్ద కొనసాగింది.




## వాణిజ్యం

## గూగుల్ 11వేల యూట్యూబ్ ఛానళ్లపై వేటు

**ముంబై, జూలై 22:** వివిధ దేశాలకు సంబంధించి అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపిస్తూ గూగుల్ దాదాపు 11వేల యూట్యూబ్ ఛానళ్లను తొలగించింది. వీటిలో చైనా, రష్యాకు చెందిన ఛానళ్లు టాప్ లిస్టులో ఉన్నట్లు వెల్లడించింది. తొలగించిన వాటిలో కేవలం చైనాకు సంబంధించినవే 7,700 యూట్యూబ్ ఛానళ్లు ఉన్నట్లు తెలిపింది. అవి భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నాయని.. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ పలు కంటెంట్‌లను పోస్టు చేస్తున్నాయని ఆరోపించింది. రష్యాకు చెందిన 2,000లకు పైగా యూట్యూబ్ ఛానళ్లు, ఇతర వెబ్‌సైట్లను తొలగించినట్లు గూగుల్ వెల్లడించింది. ఈ ఖాతాల్లో ఉక్రెయిన్, నాటోలను విమర్శిస్తూ.. రష్యాకు మద్దతిచ్చేలా సందేశాలను వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొంది. రష్యాలోని పలు సంస్థలకు కూడా ఈ ఛానళ్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిపింది. ఇటీవల గూగుల్ 20 యూట్యూబ్ ఛానెల్‌లు, నాలుగు ఖాతాలు, రష్యా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా సంస్థకు సంబంధించిన ఓ బ్లాగును తొలగించినట్లు వివరించింది. చైనా, రష్యాలతో పాటు ఇరాన్, తుర్కియే, ఇజ్రాయెల్, రొమేనియా, అజర్‌బైజాన్, ఘనాకు చెందిన యూట్యూబ్ ఛానళ్లను కూడా తొలగించినట్లు గూగుల్ తెలిపింది. ఆయా దేశాలకు చెందిన యూట్యూబ్ ఛానళ్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా అసత్య వార్తలు ప్రసారం చేస్తున్నందువల్ల వాటిని నిలువరించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. 2025 మొదటి త్రైమాసికంలో గూగుల్ 23,000లకు పైగా ఖాతాలను తొలగించింది. మెటా సైతం ఇటీవల దాదాపు 10 మిలియన్ల నకిలీ ప్రొఫైల్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.




## కాల్గేట్-పామోలివ్ లాభం రూ.363.98 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కాల్గేట్-పామోలివ్ లిమిటెడ్ నికర లాభం రూ.363.98 కోట్లకుచేరుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా కంపెనీ ఆదాయం కూడా 4.4శాతం తగ్గి రూ.1,420.64 కోట్లకు చేరుకుంది. వేగంగా కదిలే వినియోగ వస్తువుల మేజర్ యొక్క కార్యాచరణ లాభం రిపోర్టింగ్ త్రైమాసికంలో రూ.431.95 కోట్లు, ఇది గత సంవత్సరం రూ.489.25 కోట్ల కంటే తక్కువ. 'పట్టణ డిమాండ్ తగ్గడం, పెరిగిన పోటీ తీవ్రత కారణంగా కఠినమైన ఆపరేటింగ్ పరిస్థితుల నుంచి నిరంతర ఎదురుదెబ్బలను మా తొలి త్రైమాసిక ఫలితాలను ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత త్రైమాసిక పనితీరు మునుపటి సంవత్సరం కంటే అధిక బేస్ సైకిల్ ద్వారా కూడా ప్రభావితమవుతుంది' అని మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రభా నరసింహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సవాళ్లను అధిగమించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ భాగంలో క్రమంగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.